UNIVERSAL LIBRARY
OU_204711
UNIVERSAL LIBRARY

శ్రీ

# కలాభిలాషక కావ్యమాలిక.

# బిల్హణీయము. 3 *

(నాటకము.)

శ్రీ కలాభిలాషక సమాజాధిపతియును,

శీ. సీ. ఎమ్. (పూర్వపు లండను మిషను) హైస్కూలు ప్రధానాంధ్ర

పండితుఁడును, ఐందవహితసభాస్థాపకుఁడును,

అగు

## మారేపల్లి రామచంద్రశాస్త్రి

వ్రాసినది.

(సవరించిన రెండవకూర్పు.)

కాపీరైట్.

విజయరామచంద్ర ముద్రాక్షరశాల, విశాఖపట్టణము.

1913.

[అంచెకూలిగాక, వెల 8 అణాలు.]

# కలాభిలాషక కావ్యమాలిక.

## నిత్యపోషకులు.

మ. రా. రా. విన్నకోట-అప్పలనరసింహులుసెట్టిగారు,
విశాఖపట్టణము.

బొడ్డు రామయ్యసెట్టిగారు,
విశాఖపట్టణము.

,, ఆరుట్ల రామదాసునాయుఁడుగారు,
విశాఖపట్టణము.

,, శ్రీధరాల వేంకటరమణయ్యసెట్టిగారు,
విశాఖపట్టణము.

,, బూరి జగన్నాయకులునాయుఁడుగారు,
హార్షబాదు, గంజాముజిల్లా.

## నిత్యసహాయకులు.

మ. రా. రా. వరిగొండ వేంకటనరసింహముపంతులుగారు,
ములగపాక.

,, త్రిపురాన శ్రీనివాసరావునాయుఁడుగారు,
విశాఖపట్టణము.

,, తోట రాజయ్యసెట్టిగారు,
సిరువంచ.

# పాత్రములు.

| పురుషులు. | స్త్రీలు. |
|---|---|
| మదనాభిరాముఁడు—రాజు. | యామినీపూర్ణతిలక—రాజకూఁతురు. |
| గుణవంతుఁడు—మంత్రి. | కళావతి- } యామినీపూర్ణతిలక |
| సర్వశాస్త్రముఖసోమయాజి- } | మధురభాషిణి- } చెలికత్తెలు. |
| మలయమారుతావధాని- } బ్రాహ్మణులు. | వసుమతి—రాణి. |
| పటాటోపశాస్త్రి- } | భవాని—రాజుయొక్క [illegible]. |
| దంభాచారచయనులు- } | దాసి—చాడీలు చెప్పునది. |
| [illegible]ఁడు—యామినీపూర్ణతిలక గురువు | |
| రాజభటులు. | |
| [illegible]. | |
| [illegible]. | |

# పాటలు.

పాటలతో నాటకములాడుకొనువారికొఱకు నాటకము చివరను [illegible] పాటలు చేర్పఁబడినవి. పాటలు నాటకమున ఎచ్చటవచ్చునదియు తెలియుటకు పువ్వులతో అంకెలు వేయఁబడినవి. అంకెలతోడనే రెండు పువ్వులునున్న క్రిందికథ యేమియు కలిసియుండదు. ఒకపువ్వేయున్న రెండవ పువ్వువఱకును ఉన్న కథాభాగము పాటయందిమిడి యుండును. కాఁబట్టి పాట ఉపయోగించునప్పుడాకథాభాగము వదలివేయవలయును.

# కథాసంగ్రహము.

౧ అంకము:—మదనాభిరాముఁడు తనకుమార్తెయగు యామినీపూర్ణతిలకకు చదువుచెప్పఁదగిన పండితులెవరోయని విచారించి బిల్హణుని రప్పించును. అతఁడు రూపవంతుఁడగుటచే భయపడి, అతనినియమము ననుసరించి రాజు తనకుమార్తె కుష్ఠరోగిణిఅని చెప్పును. దానిమీఁద బిల్హణుఁడు తానుగురువుగా ఉండుటకు వీలుకాదన రాజు కాండపటము కట్టింతునని చెప్పి ఒప్పించును. పిమ్మట, తనకూఁతుదగ్గఱకువచ్చి, గురువును నిర్ణయించుట తెలిపి, ఆమె గ్రుడ్డివానిదగ్గఱ చదువుకొననన కాండపటము కట్టింతునని చెప్పి ఒప్పించును.

౨ అంకము:—బిల్హణుఁడు యామినీపూర్ణతిలకకును- ఆమె చెలికత్తెలకును చదువు చెప్పును. యామినీపూర్ణతిలక, భవానీదేవి కనఁబడినట్లును- తనకు వరమిచ్చినట్లును- కలగని, లేచి, ఆసంగతి చెలులతో చెప్పును.

3 అంకము:—బిల్హణుఁడు దేవతార్చనమునకు పువ్వులు కోసికొనరాఁగా, యామినీపూర్ణతిలకమాత్రము వానిని చూచును. ఆరాత్రి ఆమె విరహతాపము నొందుచుండ శీతలోపచారములు చేసి సఖులు పండుకొందురు. ఆమె మరలలేచి బాధపడుచుండును. అపుడు బిల్హణుఁడు తానొక రాజపుత్రికకు గురువుగానున్నట్లును- ఆమె తన్ను మోహించినట్లును- రాజు తనకుమరణదండనము విధించినట్లును- భవానిదయవలన తుదకు వివాహమైనట్లును- కలగని, లేచి, జడిసి, సిబ్బరము తెచ్చికొని, చంద్రుని వర్ణించుచుండును. అదివిని యామినీపూర్ణతిలక లేచి, ఆనఁడు తనగురువు కాఁడనుకొని, చూచి, తాను కలఁగాఁగనిన పురుషుఁడగుటచే సంతసించును. అతఁడు మనస్సుత్రిప్పుకొనఁగా వగచును. వానిని దగ్గఱకు రప్పించుటకు దయ్యముపట్టినట్లు నటించి మొఱ్ఱపెట్టును. బిల్హణుఁడు కాండపటముపైనుండి వచ్చి, విభూతిపెట్టి, పోఁబోవును. వారిరువురికి సంవాదము జరుగును. బిల్హణుఁడు గురువునువరించుట మంచిదికాదని బోధించును. ఆమె చావసిద్ధపడును. అపుడు తప్పక బిల్హణుఁడామెకోరికకియ్యకొని, గాంధర్వవిధిని వివాహమాడును.

౪ అంకము —కళావతీచతురభాషిణులు తమచెలికత్తెనుగూర్చి ముచ్చటించుచుందురు. అదివిని యామినీపూర్ణతిలకపైని వగపట్టినదాసి రాజుతో చెప్పఁబోవును. బిల్హణుఁడు చెఱసాలలో వగచుచుండ యామినీపూర్ణతిలకవచ్చి, విలపించును. బిల్హణుఁడామెకు బుద్ధులుచెప్పును. కళావతిమాటమీఁద యామినీపూర్ణతిలక తండ్రిని వేఁడుకొనఁబోవును.

౫ అంకము:—భార్యయును- కుమార్తెయును- బిల్హణుని మన్నింపవలయునని తన్నెంత వేఁడుకొనినను వినక, రాజు యామినీపూర్ణతిలకనుసైతము దండింతుననును. బిల్హణుని వధింప సిద్ధమగునెడ భూగృహములోనుండి యామినీపూర్ణతిలక వచ్చును. వధింపఁబోవుచో భవాని ప్రత్యక్షమై బిల్హణయామినీపూర్ణతిలకలకు వివాహము చేయుమని రాజుతోఁ జెప్పును.

# మొదటికూర్పు పీఠిక.

ఈ "బిల్హణీయము" మాకావ్యమాలికలోని తృతీయకుసుమము. ఇది, సురభినాటకులు నన్నెంతయు బలవంతపెట్టి కోరఁగా, 1902 సం॥ మున వ్రాసితి. నాటకానుకూలముగా ఉండుటకై ప్రబంధములోని కథ కొంత పెంచి, కొంత మార్చితి.

ఇందలికథ నీతిబోధకము కాదని కొందఱు దీనిని 'తారాశశాంకవిజయము'తో జతచేసి నిందించుచుందురు. అది సాధారణపువాదమునకే కాని సరికాదు. వ్యభిచారిణియగు తారయు, గురుతల్పగతుఁడగు చంద్రుఁడును దండమొందక మన్ననపొందినట్లు చెప్పు తారాశశాంకవిజయమెక్కడ? వివాహమాడఁదగిన కన్య అయినను శిష్యురాలయిన యామినీపూర్ణతిలకను మోహించినందులకు బిల్హణుఁడును, గురువును మోహించినందులకు యామినీపూర్ణతిలకయు దండమొందినట్లు చెప్పెడి యీబిల్హణీయమెక్కడ? ఈనాటకము చదివినవారికి తుదకెట్లో తప్పనిసరిగా బిల్హణయామినీపూర్ణతిలకలకు వివాహమయినను, సర్వసమ్మతము గాక నింద్యమగు వారిప్రవర్తన మనుసరింపఁదగినది కాదనియే తట్టునుగాని మఱియొకవిధముగా ఎప్పుడును తట్టదు. నిందలపాలై, చెఱసాలలోపడి, చివరకెట్లో తప్పినను మరణదండనమొందిన బిల్హణునిగతి చూచిచూచి, ఎవఁడు శిష్యురాలిని మోహింపఁ సాహసించును? ఇఁక, లోపములు కలవారింగూర్చి తెలుపు పుస్తకములే పనికిరావందురేని, ఏవీ మనకట్టిగ్రంథములు? రావణాదులులేని రామాయణములు, కౌరవులులేని భారతములు కావలయును. ఇది అసంభవము. ఏభాషయందుఁగాని అట్టిగ్రంథములుండవు. మఱియొకమాట. చాయలేక యేరంగుగాని రాణింపనట్లు దుర్మార్గులచర్య లేక సన్మార్గులచర్య రాణింపదు. చూడుఁడు. కైక కఠినురాలు గాకున్న రాముఁడిట్లు లోకాభిరాముఁడు కాఁజాలునా? దుర్యోధనుఁడు దుష్టుఁడు గాకున్న ధర్మరాజింత పేర్మిగాంచనోపునా? విశ్వామిత్రుఁడే వివేకవంతుఁడైన హరిశ్చంద్రునిసత్యవ్రతప్రశస్తత యిట్లు నత్యంతము కాఁగలుగునా? వట్టిది; ముమ్మాటికి వట్టిది. అది అటుండనిండు. రావణాదులచర్యవలన మనమేమి నేర్చుకొనుచున్నారము? వారివలెనే చెడునడతలు నడచి యిడుమలపాలు కావలయుననియా? కాదుగదా? కాన, లోపములుగలవారినిగూర్చి తెలుపు గ్రంథములన్నియు నీతిబోధకములు కావన వీలులేదు. ఇంతకు, నీతిబోధకములుగాని గ్రంథము లెట్టివి? తప్పులున్నను దండనములు లేనట్లు చెప్పునది; అయిన బిల్హణీయమట్టివానిలో చేరునా? చేరదు. కాఁబట్టి, ఇది నీతిబోధకమే కాని మఱొకటి కాదు. ఇది, కన్యలకు

ఉపాధ్యాయులుగా ఉండువారును-కన్యలతోడ కలసిమెలసి చదువుకొనుచుండు వారును- మిక్కిలి జాగ్రత్తగా మెలఁగుచు, ఇంద్రియనిగ్రహము కలిగి ఉండవలయుననునీతి చక్కఁగా బోధించును.

ఇందలిపాటలు విశేషనాటకానుభవముగల తడకలూరి కుప్పసామిరావిచ్చిన మట్ల ననుసరించి వ్రాసితి.

ఈనాటకమిప్పటికి అనేకపర్యాయములు ప్రదర్శింపఁబడినది. మ్యూశికలాభిలాషకసమాజమిచ్చటను- విజయనగరమునను, అంతకుముందే సురభినాటకసమాజములును- సంగీతమానినీసమాజమును- పెక్కుచోట్లను, ప్రదర్శించె. చూచినవారికి మిక్కిలి మనోహరముగా ఉండినట్లే తెలియవచ్చినది. దీనికొఱకు నాకువచ్చిన ఉత్తరములును దీనియందుఁగలజనామోదమును వెల్లడిచేసె. ఇపు డెట్టియాదరణము గాంచునో చూడవలయు. దోషజ్ఞులగు పండితులును గుణములనే గ్రహించి ఆనందింతురుగాక.

కోరినసదుపాయములన్నియు చేయనియ్యకొని, తమపనికంటె నాపనిహెచ్చుగా చూచుచు, కావ్యమాలికాగ్రంథము లచ్చువేయుటయందు నాకెంతెంత అనరాని సాయముచేయఁ బూనుకొనిన నామిత్రులును, శ్రీశారదామకుట ముద్రాక్షరశాలాధిపతులును అగు మ॥ రా॥ రా॥ విన్నకోట- అప్పలనరసింహులుసెట్టిగారికి నే నెంతయు కృతజ్ఞుఁడ.

నాయందెంతయో అభిమానము కలిగి, నాతోఁబాటు ప్రూపులు చదువుచు, అచ్చుతప్పులు సాధ్యమగునంతవఱకు లేకుండునట్లు ప్రయత్నించుచు, సాయము చేయుచుండు నామిత్రులగు బ్రహ్మశ్రీ వెంపరాల- జగన్నాథశాస్త్రిగారి కనేకవందనము లర్పించువాఁడ.

నాపనియందభిమానముగలిగి, మాయేర్పాటుననుసరించి యచ్చుకూర్పుటకొడంబడి, శ్రద్ధాభక్తులతోఁ బనిచేయు నాలి- అప్పలసామికి సర్వేశ్వరుఁడు మేలొసంగుఁగాక.

విశాఖపట్టణము,
౧౯౧౦ సం॥ జూలై.

మారేపల్లి - రామచంద్రశాస్త్రి.

# రెండవకూర్పు పీఠిక.

౧౯౧౦ సం॥ జూలై నెలలో అచ్చుపడిన మా బిల్హణీయపు మొదటికూర్పు ప్రతులు రెండుసంవత్సరములలోపుననే మా ప్రకటనము తగినంత లేకపోయినను చెల్లిపోవుటయే, దానియందు జనులకు ఉన్న ఆదరమును వెల్లడిచేసి, నాకు ఎంతో ప్రోత్సాహము కలిగించినది.

రెండవకూర్పు వేగముగా వేయింపలేకపోవుటచే, ప్రతులు కోరినవారికి వెంటనే పంపఁజాలకపోతిని: వారు ఆలస్యమునకు మన్నింతురుగాక! ఈకూర్పును మొదటిదానివలెనే జనాదరము కాంచుఁగాక!

నాటకము ఆడువారికిని, వినువారికిని, చదువుకొనువారికిని అర్థము సులభముగా బోధపడుటకును, స్వభావసిద్ధముగా ఉండుటకును, ఈకూర్పునందు వీలగునంతవఱకు సంధులు విడఁదీసితిని; కొన్నియెడల సవరించితిని.

ఈకూర్పు ప్రకటించుటయందు నాకు సాయపడిన శ్రీ విజయరామచంద్ర ముద్రాక్షరశాలాధిపతులును, నాస్నేహితులును అగు మ॥ రా॥ రా॥ విన్నకోట దుర్గారావుసెట్టిగారికి నేనెంతయు కృతజ్ఞుఁడ.

విశాఖపట్టణము,
ది ౨౦-౮-౧౯౧౩ సం॥

మారేపల్లి - రామచంద్రశాస్త్రి.

శ్రీ

# బిల్హణీయము.

## నాంది.

ఎదను తలంప నోట తగ ♦ ఎన్న ఒకింతయు లోనుగాక, ఇ
య్యది అది రూపమంచనఁగ ♦ అచ్చట ఇచ్చట ఉండునాఁగ వీ
లొదవ, కగమ్యశక్తి, అఖి ♦ లోద్ధురరూపి, సమస్తవాసియై
పొదలెడు ఆపరాత్పరుఁడు ♦ ప్రోచు సదా సుజనాళి సత్కృపన్.

౧ * *

సూత్రధారుఁడు—(నాంద్యంతమున సభనుచూచి) అహో యేమి యీసభ!

సీ. ఒకచోట వేదశా ♦ స్త్రోత్కరములు ముని
గోష్ఠ తుదలనుండు ♦ కోవిదులును,
ఒకచోట రసతతు ♦ లుట్టిపడఁ కావ్య
గణమొనర్పఁగఁజాలు ♦ కవివరులును,
ఒకచోట వినువార ♦ లొడలు మఱచునట్లు
పాడఁగా నేర్చు మే ♦ ల్పాటకులును,
ఒకచోట తమబుద్ధిఁ ♦ ఉర్వి అంతయు ఏల
నోపిన మేటి ఉ ♦ ద్యోగిమణులు,
కూడ కలకలలాడు ఈ ♦ నాడెవుసభ
చూడ పండితులకె గుండె ♦ వీడుననఁగ
ఏమిఁ కేపాటివారల ♦ మెలమిఁ తప్పు
లన్నియును కాచి మన్నింపుఁ ♦ డయ్యలార!. ౨

(పూవులు చల్లును.)

(తనలో) ఏనాటకము ప్రదర్శించిన ఈవిద్వజ్జనబృందంబుల డెందంబు లలరఁ
గలవు? ఆలోచింతమనిన నటికూడ ఇంకను రాలేదు. (పక్కకునడచి) ౨ *
ఇంతీ! ఒకసారి యిటు వచ్చెదవా? ఎంతసేపు నీకొఱకిట వేచియుండుట?

నటి—(ప్రవేశించుచు) ఏల నాకై వేచియుండుట? నాథా! ఏమి విచారించు
చున్నారు?

సూత్ర—చూచితివా యీసభ? ఏనాటకమాడిన బాగుగా ఉండుననెదవు?

నటి—దీని కింతచింత యెందుకు? బిల్హణీయమాడరాదా? *

సూత్ర—(తలయూఁచుచు) ఆడవచ్చును; కాని-

నటి—మఱేమిసందియము? బాగుగాఉండదనియా?

సూత్ర—ఆసందేహము నాకు ఆవంతయు లేదు. అయినను కొందఱిది నీతిబోధకము
కాదందురేమొ అని అనుమానించుచున్నాఁడ.

నటి—(నగుచు) ఇది నీతిబోధకము కాదందురా? ఎవరు? చూడనివారొకవేళ
అందురేమోకాని చూచినవారుమాత్ర మనఁజాలరని నానమ్మకము.

సూత్ర—ఎందుచేత?

నటి—మీకుమాత్రము తెలియదా? ఇంతకు దీనియందు ఉన్న దుర్నీతి యేమి?

సూత్ర—గురువును శిష్యురాలును పరస్పరానురాగబద్ధులైనట్లు చెప్పుటలేదా?

నటి—ఆఁ; చెప్పఁబడినది; అయిన, అదొక గొప్పతప్పా? తప్పే అనుకొన్నను
వారు దండింపఁబడినట్లును చెప్పఁబడినదే. అందుచే అట్టిపని సాధారణముగా
కూడదనియే బోధించుచున్నదిగాని కూడునని బోధించుట లేదు. అదియును
గాక జవ్వనులగుకన్నెలదగ్గఱ పురుషులను ఉంచరాదనియు, కల్లలాడరాదని
యును కూడ బోధించుచున్నది.

సూత్ర—సరేకాని కథానాయకుఁడును, కథానాయికయును మంచి నడతకలవా
రై ఉండవలయునుగదా?

నటి—ఉండవలసినదే; ఇందలి వారలు అట్టివారే. ఈనాటకపు బిల్హణ యామినీ
పూర్ణతిలకలు ప్రబంధపు బిల్హణ యామినీపూర్ణతిలకలే అనుకొనుచున్నారు
కాఁబోలు. వారు వారు; వీరు వీరే. వారు వారే. కాన, ఇది నీతిబోధకమే
కాని మఱొకటి యెంతమాత్రము కాదు.

సూత్ర—అవును; చక్కఁగా చెప్పితివి! నీతిబోధకమే కాదేని కృతికర్త యిది
రచించుటకే పూనుకొనకుండును.

నటి—ఎవరాయన?

సూత్ర—ఎఱుఁగవా? తెలిపెద; వినుము.

సీ. దైవంబునే నమ్మి ♦ ధర్మానుసారంబు
గా ప్రవర్తింపఁగా ♦ కడఁగువాఁడు,
తను స్తోత్రములు చేసి ♦ నను నింద చేసిన
ఒక్కరీతిని కను♦ చుండువాఁడు,
తనచేతనగునంత ♦ దనుక అన్యులకు మే
లొనరించుటకె చూచు ♦ చుండువాఁడు,
దేశాభివృద్ధి మ♦ దిఁ ముఖ్యముగ ఎంచి
పాటుపడఁ వెనుఁ ♦ బడనివాఁడు,
శ్రీకలాభిలాషకుఁడయి ♦ చెలఁగువాఁడు,
శుభద 'లండన్ మిషన్ హాయి♦ స్కూలు' లోన
ఆంధ్రపండితుఁడుగ అల ♦ రారువాఁడు,
సమ్ముదితశాస్త్రి, మా॥ రామ ♦ చంద్ర శాస్త్రి. ౩

చెలీ! ఇఁక జాగేల? ఏదో ఒకగీతము పాడి యీబుధవరేణ్యులకు శ్రవణానందమొనరింపుము.

నటి—ఏ ఋతువునుగూర్చి?

సూత్ర—మఱొకదానిని గూర్చియేల? వేవెలుంగు పగటివేళ పొగలెగయు మెండుగా వెలుంగ, ఇలపై నెలకొని యుండు గాలి వెచ్చగిలి పైకెగుర, కడలిమీఁద వెలయు వలిగాలి ఒడలికి విందుగా అల్లనల్లన వీవ, బయళ్ల మల్లెపందిళ్ల పజ్జ వానిపూవులతావులు ఉల్లంబులు పల్లవింపఁజేయ ఉల్లాసంబుగా రేలు పవ్వళింపఁదగిన ఈవేసవిననుసరించియే సభాసదుల మనసులు కరఁగ ఒకసరసగీతము పాడుము.

నటి—చిత్తము.

† లయగీతము. వేసవి ఋతువులనెల్లను♦ వాసికన్నదే కదా;
భాసుర శాఖోత్కరములకు ♦ పట్టుకొమ్మయేకదా;
చలిబాధలేక చల్లనినీట♦ స్నానమాడవచ్చుఁగా;
వెన్నెలబయల నింగిసొగసు♦ వేడ్కఁ గానవచ్చుఁగా. ౪

---

† మొదటపాదము పల్లవిగా చేసి యిదిపాటగా వాడుకొనవచ్చును.

సూత్ర—అవునవును; ఈవేసవి అనేకసౌఖ్యంబులకు ఆకరంబె. కాని లోపములు కూడ లేకపోలేదు. అయిన దీననే అననేల? లోకములో ప్రతిదానియందును వెదకిన లోపములు కానరాకపోవు.

గీ. అఖిలవిభవాంచితుఁడు మద ♦ నాభిరామ
జనవరుఁడు సర్వసద్గుణ ♦ ఖనిఅన తగు
తన తనయకు చదువు లోప♦ మని తలంచి
హెచ్చుగా వగవవలసి ♦ వచ్చెఁగాదె? ౫

కాన లోపంబులెంచక మంచికే మనము సంతసింపవలయు. రమ్ము; పోవుదము; రమ్ము. (నిష్క్రమింతురు.)

ఇది ప్రస్తావన.

శ్రీ

# బిల్హణీయము.

## ప్రథమాంకము.

ప్రథమరంగము—రాజసభ.

[మదనాభిరాముఁడు మంత్రులు మొదలగువారితో ఆసీనుఁడై ప్రవేశించును.]

మద—సచివశేఖరా! రాజ్యసమాచారములేమి? 3 *

పంచచామరము. ధరామరుల్ తపోజపాళి ♦ తప్పకాచరింతురే?
ధరావరుల్ స్వకీయవృత్తి ♦ దాఁటకొప్పునారలే?
దురాశ పొంద పోక తృప్తి ♦ తోడ వైశ్యులుందురే?
పరాత్మభేదమెంచి శూద్ర ♦ పాళి నడ్చుకొందురే? * ౬

మఱియు మనదేశంబునందెచ్చటను దుర్భిక్షాదిబాధలులేక జనంబు నిరంతర సౌఖ్యపారావారంబున తేలుచున్నవారా? ఈవృత్తాంతంబంతయు సాంతంబుగా తెలిపి నాస్వాంతంబు సంతోషనిశాంతంబు కావింపుము.

గుణవంతుఁడు—దేవా! తమరాజ్యంబున అందఱును స్వధర్మంబులు తప్పక చరించుచున్నవారు. మఱియు శత్రుశలభ మూషికాదీతిబాధలులేక కాలంబున పర్జన్యం డనుకూలంబుగ వర్షంబులు వర్షించుచుండ, ధారుణీతలంబంతయు సకలనన్యసంశోభితంబై భాసిల్లుచుండ, నిత్యకల్యాణంబును- పచ్చతోరణంబునై దేశంబంతయు ఒప్పుచుండ, జనులెల్ల నిరుపమాన సుఖపరవశులై తమరాజ్యంబు రామరాజ్యంబును కూడ మఱపించుచున్నదని సర్వదా సంస్తుతులొనరించుచు, సంతోషభరితులై ఉన్నవారు.

మద—అమాత్యోత్తమా! నీవచనామృతధారాసేచనంబునంజేసి నాహృదయసంతాపకర రాజ్యవిచారగ్రీష్మసమయోద్ధూతధరాపరాగంబంతయు నసాకల్యంబుగ నివారింపఁబడినది. కాని—

గుణ—(సంభ్రమముతో) దేవా! దేవరవారిప్పుడు దేనినిగూర్చి చింతింపవలసివచ్చినదో నాచిత్తంబునకు ఆవంతయు గోచరంబు కాకున్నది. రాజ్యమా? సర్వ

వైభవోపేతంబై జనానురంజకంబుగా రంజిల్లుచున్నయది. తమరా? లబ్ధసంతానులై సంతానంబును తృణీకరించుదానవిశేషంబులు చేసి పండితప్రకాండుల అఖండమోదాయత్తచిత్తులుగా కావించి వారివలన నుతులందుచున్నవారు.

గీ. ఇట్టియెడ తమమానసం ♦ బెందుకొఱకు
చింతనొందును? కనక నా ♦ చిత్తమోరు
గాలిఁ అల్లాడు ఆకునా ♦ కంపమొందు
చున్న: దది తెల్పుఁడీ; తీర్తు ♦ ఓపినట్లు. ౭

మద——గుణవంతా! నీవు చెప్పినదంతయు సత్యమే. అయినను,

చ. వ్రతములు దానధర్మము ల ♦ పారముగా ఒనరించి, వేడ్కతో
సుతుని కనంగ ఎంచి, విధి ♦ సూత్రము లేమిఁ కుమార్తెఁ గాంచితిన్;
సుతయు సుతుండు ఈమె; ఇఁక ♦ సూరివరేణ్యులచేత విద్య వి
శ్రుతముగ నేరిపింపవలె; ♦ శోభిలునే అది లేకపోయినన్? ౮

ఇందుకు తగినపండితు లెవరో అని విచారించుచున్నవాఁడ.

గుణ——మహాప్రభూ! భవద్వంశతిలకమగు యామినీపూర్ణతిలక యిప్పటికే విద్యావతియై ఒప్పుచున్నదికదా?

మద——ఏవో నాలుగుముక్కలు మేము చెప్పితిమిగాని గురువులేనివిద్య కూడునా? కావున ఇప్పుడాబాలికావతంసమునకు సకలకలాకోవిదుండును, విశుద్ధచరితుండును అగు పండితోత్తమునిచే విద్యాభ్యాసంబు కావింపచేసి, కావ్యనాటకాలంకార సంగీతకళాకోవిద అగునట్లొనరింపవలయు.

గుణ——ఇదెంత కార్యము? దీని కింతచింత యేల? భవదాజ్ఞానుసారంబుగా ఇప్పుడే మనపురంబున ఉన్న విద్వద్బృందము నెల్ల రప్పించువాఁడ. సేవకా! మన ఆస్థానపండితసందోహంబునెల్ల రయంబ తోడ్కొనిరమ్ము. పొమ్ము.

సేవకుఁడు——చిత్తము. (నిష్క్రమించును.)

మద——సచివశిరోమణీ! ఒకమాట వినుము.

గీ. గురుఁడుగా ఉండువాఁడొక్క ♦ కోవిదుండె
అయిన లాభంబులేదు వి ♦ ద్యార్థికెందు;
అతఁడు నిష్కళంకచరిత్రుఁ ♦ డైనఁగాని
కీడు మూఁడును ఇరువురి ♦ కిని చివరకు. ౯

కాన గురువును ఎంచుకొనునపుడు విద్యాప్రావీణ్యము మాత్రము గాక నిర్మల ప్రవర్తనంబును ప్రధానంబుగా చూడవలయు. పురుషులకు గురువుల నిర్ణయించునప్పటికంటె స్త్రీలకు ఉపాధ్యాయుల నిర్ణయించునప్పుడు ఎక్కువ జాగరూకత కలిగి ఉండవలయు. అందులో అంతఃపురస్త్రీలఁగూర్చి యెంత మెలఁకువగా ఉండవలయునో నీవే యోచింపుము.

గుణ—తాము చెప్పినదంతయు మిగుల శ్లాఘనీయము. భవదభీష్టానుసారముగనే గురునిర్ణయం బొనరింతము.

సేవ—(ప్రవేశించి) పండితసమూహంబంతయు వచ్చి ద్వారంబుకడ వేచికొని ఉన్నది; ఏమి సెలవు?

గుణ—శీఘ్రముగా వారిని లోనికి కొనిరమ్ము. పొమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్రమించును.)

పండితులు—(ప్రవేశింతురు.)

మగ—(లేచి నమస్కరించును.)

పండి—సకలదిగ్విజయంబును, నిజమనోభీష్టసిద్ధియును అగుఁగాక.

మద—పండితరత్నములారా! ఈపీఠములు అలంకరింపుఁడు.

పండి—చిత్తము. (కూర్చుందురు.)

మద—(కూర్చుండి) మహాత్ములారా!

౮ * గీ. మీరలందఱు మామేలు ♦ కోరుచుండు
వారె; ఇప్పుడు మావంశ ♦ వర్ధని కొగిఁ
చదువు చెప్పింపవలె; అది ♦ సాగఁజేయ
ఎవరు పూనుకొనెడివారో ♦ యెఱుఁగ చెపుఁడి. ౧౦

సర్వతోముఖసోమయాజి—రాజాగ్రణీ!

గీ. వేదశాస్త్రపురాణాళిఁ ♦ వెలఁదికేమి
కావలసియున్న నేర్పఁగాఁ ♦ గలము; వాని
యందు మము మించువార లీ ♦ అవనిఁ లేరు;
తెలుపుమా యేమి చెప్పఁగా ♦ వలెను వేగ. ౧౧

మద—బుధసుధాకరులారా! నాతనూజకు కావ్యనాటకాలంకార సంగీత కవితా విద్యలు కఱపవలయు. ఇందులకు మీలో ఎవరు తగినవారో చూచి చెప్పుఁడు.

సర్వ—చిత్తము. (పక్కగా వెళ్లి) అయినది; మన ఆశ నిరాశ అయినది. కావ్యము

లఁట! నాటకములఁట! అలంకారములఁట! సంగీతమఁట! కవిత్వమఁట! ఎవరికి వచ్చును? పొట్టచించి చూచినను మనయందీవిద్యలలో ఒకటియును కానరాదు. ధనాశచే వచ్చునని సాహసము చేసినను చివరకు నలుగురిలో చీవాట్లును చెప్పుదెబ్బలును తప్ప ఎక్కువ బహుమానము రాదు. ఎందుకు అందరానిపండ్లకు అఱ్ఱులుచాచుట? చాపుకబురు చల్లఁగా చెప్పుమన్నట్లు మనయథార్థస్థితి మెల్లఁగా చెప్పి జాఱవలయు.

మలయమారుతావధాని—బాగుగాచెప్పితిరి. సంగీతము మనగొంతుక కోసినను రాదు. కవిత్వమా? మనలను కాల్చినను రాదు. ఎందుకీఅడియాసలు? ఉన్నమాటయేదో శీఘ్రముగా వెడలఁబెట్టుఁడు. పట్టణములోనికి పోయిన నాలుగుడబ్బులు సంభావనఅయిన దొరకును. చెప్పుఁడు చెప్పుఁడు.

పటాటోపశాస్త్రి—(కోపముతో) చెప్పను లేదు జాతియు లేదు. నోరు మూసికొనుము. చేతఁగాని శుంఠలకు మీకు రావని అందఱకు రావని చెప్పెదరా? మీవంటి తెలివితక్కువపెద్దమ్మలతో కూడ వచ్చిన మావంటివారిపరువుకూడ మంటకలియును. చేతఁగాకున్న మీరు పొండు. నేను నావిద్యాప్రభావము చూపి రాజును మెప్పించి యామినీపూర్ణతిలకకు గురువునయ్యెదను.

మలయ—ఎందుకీనోటిదురుసుతనము! నీకంతనిబ్బరమున్న సిద్ధపడుము. మాకేమి కావలె? (ప్రక్కగా) మహేమిపాండిత్యమున్నను లేకపోయినను ఈపాండిత్యమితనికి బాగుగా ఉన్నది.

దంభాచారచయనులు—పటాటోపశాస్త్రి! సంగీతము నీకు సంపూర్ణముగా వచ్చును; బాగుగానే ఉన్నది; కాని కవిత్వముమాటయేమి?

పటా—ఏమి? దంభాచారచయనులూ! కవిత్వముమాత్రము నాకు రాదా?

దంభా—అయిన నాకు సున్నము పెట్టచూచుచున్నావా? జాగ్రత్త! నీగుట్టు బయటఁ బెట్టెదను.

పటా—(తనలో) వీఁడు మాటలపోగు. నోరు విడివడిన కట్టుపడుట కష్టము. కాఁబట్టి వీనికి మెత్తనిమాటలచేతనే వాకట్టుకట్టి తరువాత చల్లఁగా తడిగుడ్డలతో గొంతుక కోయవలయును. (పైకి) చయనులూ! మాటవరుసకంటినిగాని కవిత్వములో నీతరువాతనే మఱియెవరినైనను చెప్పవలయును. కవిత్వమునకు నీవును, సంగీతమునకు నేనును గురువులమవుదము. తెలిసినదా?

దంభా—ఆలాగున దారికిరమ్ము. మనమిద్దఱమును ఒకటిఅయిన అగ్నివాయువులవలె లోకమంతయును ఒక్కక్షణములో భస్మీభూతము చేయఁగలము. ఆలస్యమమృతం విషమ్మని ఆలస్యమెందుకు? రాజునకు మనసంగతి తెలుపుదము.

వటు—తెలుపుదము గాని ఉందుము. మనపాండిత్యము చూపవలెనుగదా? ఏదో ఒకపద్యము వ్రాయుము.

దంభా—పద్యమా? సరే. వ్రాసెద. (ఆలోచించి వ్రాయుట అభినయించును.)

మల—అయ్యలారా! చూచితిరా వీండ్ర సాహసము? వీఁడు సంగీత శాస్త్రవేత్త అఁట! వాఁడు కవిత్వకళానిధి అఁట!

సర్వ—ఇందులో వింతయేమున్నది! వీండ్ర స్వభావము మనకు క్రొత్తయా! ఊరి అందఱది ఒకదారి ఉలిపికట్టెది మఱొకదారి అనునట్లు ఈపటాటోపశాస్త్రి మనమొకటిఅనిన తానొకటి అనుచుండును. వీనికి దంభాచారచయనులు తోడుపడుచుండును. పోనిండు; వాండ్రగొడవ మనకెందుకు? చేతఁగాని పరుగులకు పోయెదరు; బోర్లఁబడియెదరు. మనసంగతి రాజుతో చెప్పుదము; రండు. (రాజును సమీపించి) మహారాజా! మీరుకోరినలక్షణములన్నియు వాలో ఎవరియందును లేవు. కావున మేమందులకు అనర్హులము.

మద—(విచారముతో) అట్లయిన మనపట్టణమున నామనోరథ మీడేర్పఁగలవారు ఒకరైన లేరా? (మంత్రితో) ౫ *

గీ. ఏమి పాపమొకో! యిది; ♦ ఈ మహాపు
రమున నాముద్దుపట్టికి ♦ ప్రథితకళల
నేర్పఁగలవారు లేరైరి; ♦ నే నిఁక ఎట
నుండి పండితులకొని తే♦ నోపువాఁడ? ౧౨

గుణ—అన్నికళలును ఒకనికే వచ్చియుండుట దుర్లభము.

సర్వ—రాజచంద్రమా! తమరిట్లు విచారింపనేల? సర్వకళాప్రవీణుఁడగు బిల్హణుఁడనుకవిపుంగవుఁ డొకఁడు క్రొత్తగా మననగరంబున కేతెంచియున్నవాఁడు.

అతఁడు, గీ. కావ్యనాటకాలంకార ♦ ఖని; నిరుపమ
సరస సంగీతనిధి; సురు ♦ చిర నవరస
కలిత కవితామృతాంచిత ♦ కలశవార్ధి;
అహహ! తత్ప్రతిభ గణింప ♦ అలవి అగునె? ౧౩

కాన ఆకవిశిఖామణిని పిలిపించిన మీమనోరథసిద్ధి కాఁగలదు.

మద—(సంతోషముతో) ఏమీ? ఇట్టి అనుపమప్రజ్ఞావంతుఁడగుకవివతంసము మనపురంబునకు వచ్చి ఉన్నవాఁడా? మంత్రీ! ఆమహానుభావుని శీఘ్రముగా రప్పింపుము.

గుణ—చిత్తము. ఇప్పుడే రప్పించెద. సేవకా! త్వరగా పోయి ఆకవీంద్రుని తోడి తెమ్ము. మనసోమయాజులుగారాయనను కనఁబఱచెదరు.

సేవ—చిత్తము. (సర్వతోముఖసోమయాజితో నిష్క్రమించును.)

దంభా—పటాటోపశాస్త్రీ! పద్యము వ్రాసినాఁడ; వినెదవా?

పటా—అంతకంటెనా? ఏదీ యేదీ?

దంభా—ఇదిగో! వినుము—

పటా—ఉండుండు. చదివినపై వారువినరా? చూచెద. (చూచుట అభినయించి) ఇది యేవృత్తము? (పకపకగా) గణయతిప్రాసవిరహితాపశబ్దగర్భితవచన వృత్తము.

సేవ—(ప్రవేశించి) మహాప్రభూ! ఆయన వచ్చియున్నాఁడు.

మద—మంచిది. నీవు పొమ్ము. ఆయనను లోనికిరానిమ్ము.

సేవ—చిత్తము. (నిష్క్రమించును.)

దంభా—ఏవృత్తమైననేమి? ఏలాగున ఉన్నది?

పటా—అడుగవలెనా మరల? శ్రాద్ధయోగ్యముగా ఉన్నది. రమ్ము. పులిమీఁద పుట్రి వచ్చినది. ఇఁక మన ఆటలు సాగిరావు. మహారాజా! సెలవు. (నిష్క్రమింతురు.)

మద—(బిల్హణుని దూరమునచూచి) గుణవంతా! ఇట్టినవమోహనాంగుని అంగనామణులకు గురువుగా నిర్ణయించుట తగునా?

గుణ—తగునని చెప్పఁజాలను; కాని యిప్పుడితనికంటె మంచిపండితుఁ డెందును కానరామింజేసి యే అపాయంబును కలుగుటకు వీలులేని ఉపాయంబొకటి చూచి యీభూసురోత్తముని ఉపాధ్యాయునిగా నియమించుట బాగుగా ఉండునని తోఁచుచున్నది. పిదప దేవరచిత్తము.

మద—అటులే చేయవలయును.

బిల్హ—(ప్రవేశించును.)

మద—(లేచి, నమస్కరించును.)

బిల్హ— ఉ. సురుచిరరూపరాజ! సుఖ ♦ శోభన నిర్జరరాజ! ధైర్యమం
దరగిరిరాజ! లోకనుత ♦ దానజితాంబుదరాజ; శాత్రవో
త్కరమృగరాజ! కీర్తిజిత ♦ కల్పమహీరుహరాజ! రాజ! సు
స్థిరవిభవప్రమోదముల ♦ తేలుచునుండువుగాక! సర్వదా. ౧౮

మద—మహాత్మా! ఈపీఠమును భూషింపుఁడు.

బిల్హ—(కూర్చుండును.)

మద— ౬ * *

కవీంద్రచంద్రా! భవత్పాండిత్యాతిశయంబు ధారుణీబృందారకసందోహం బుచే శ్రవణానందంబుగ ఆకర్ణించినవాఁడ. భవాదృశుల అర్హసత్కారంబు ల నన్మానింప త్రిభువనాధినాథుండగు దేవేంద్రునికయిన సాధ్యమగునో కాదో అని సంశయంబు కలుగుచో నామాట చెప్పనేల! మంత్రీ! పూజాద్రవ్యంబు లి టు తెమ్ము.

గుణ—ఇవిగో! సిద్ధముగానే ఉన్నవి. (చేతికిచ్చును.)

మద—భూసురాగ్రణీ! నేనొసంగఁగలపత్రపుష్పంబులతో సంతసించి నన్ను మీ కరుణాకటాక్షావలోకనంబులకు పాత్రముగా ఒనరింపుఁడు. (పూలదండ మె డలోవేసి వీడెమొసంగును.)

బిల్హ—రాజశశాంకా!

ఉ. సంతసమొందె నీవిపుడు ♦ సల్పిన పూజకు నామనంబు; నీ
స్వాంతమునందు ఏదొ ఒక ♦ వాంఛిత ముండెడునట్లు తోఁచెడిన్;
మంతుగ చేసి యీక్షణమ ♦ మన్ననలన్ గొను వాఁడ; కాన, ఆ
వంతయు సందియంబు కన ♦ కయ్యది యేదియొ విప్పిచెప్పుమా. ౧౫

మద—౭ * మహాత్మా! నాదొక ప్రార్థనకలదు.

బిల్హ—ఏదో అది రయంబ చెప్పుము; సందేహమెందుకు?

మద—తామది సావధానముగ వినవలయును.

బిల్హ—వినుటయే కాదు; నాచేతనగునదైన తప్పక చేసెద.

మద—అయిన చిత్తగింపుఁడు.

గీ. లేక లేక ఒకకుమార్తె ♦ మాకు కలిగె;
ఆమెయే అగు ఆత్మజ ♦ ఆత్మజుండుఁ;
కాన, ఇపుడామెకున్ సర్వ ♦ కళల నేర్పి
కన్నుతెఱచెడు నటుచేయఁ ♦ గా వలయును. ౧౬

బిల్హ—దాని కేమి అభ్యంతరముగాని ముందు నానియమభంగముకాకుండ చూ చుకొనవలయును.

మద—(సంభ్రమముతో) ఏమిరేమి ఆనియమము?

బిల్హ—మఱేమియు లేదు; కుష్ఠాదిదుష్టరోగవేష్టితుల చూడననియే. *

మద—సత్యవ్రతా!

గీ. మీ రొనర్చిన ప్రతినల ♦ మీఱువారు
కారని యెఱుంగుటఁ బ్రమోద ♦ కంధిఁ దేలె
నాదుహృదయారవిందము ♦ నలినసంభ
వాన్వయశశాంక; నేను ధ ♦ న్యతను గంటి. ౧౭

తాము మొదటనే యేఅడ్డును పెట్టక నామనోరథమీడేర్ప మాటయిచ్చియున్నారు. కాన అనుమానము మాని ఒకమనవి చేసికొనెద; వినుఁడు.

బిల్హ—ధారుణీశ్వరా! ఏమిది? నీవాక్యంబు లాకర్ణింప నాముందరికాళ్ళకు బందములు వేయుచున్నట్లు తట్టి నాడెందమాందోళనం బొందుచున్నది. నీతనూజ కుష్ఠాదిరోగంబులలో దేనిచేతనుగాని పీడింపఁబడుట లేదుగద?

మద—మహానుభావా! మన్నించి వినవలయు.

ౘ * పంచచా. పురాకృతంబుచేత కుష్ఠ♦ పూరితాంగి అయ్యో సూ:
బిల్హ— సరే! మఱేల? విద్య చెప్పఁ♦జాల నేనిఁ కామెకున్;
మద— వరంబు అిస్తె మర్చిపోవ ♦ పాడియే? కవీశ్వరా!
బిల్హ— ధరాధిపా! వచింతువిట్లు; ♦ తప్పవెట్లు నీమముల్. ౧౮

మద—మీనియమము తప్పుఁడని నేను చెప్పుదునా?

బిల్హ—తప్పకుండ ఆమెకు చదువు చెప్పట కెట్లు వీలగు? *

మద—అదే మనవిచేసెద; చిత్తగింపుఁడు.

గీ. పడఁతి యెప్పుడుఁ మీకంటఁ ♦ బడనిరీతి
నడుమ నిబిడకాండపటము ♦ ఇడ నెనర్తు;
కాన, దర్శనభయమైనఁ ♦ గాని, నియమ
భంగభయమైనఁ గాని పో ♦ సంగదింత. ౧౯

కావున, తామిఁక ఏవిధంబగుసందియంబును పొందక యిచ్చినవరంబు సఫలంబుచేయ ప్రార్థించెద.

బిల్హ—నృపశిరోమణీ!

మ. భవదీయాంచితభాషణామృతము నా♦ స్వాంతవ్యథన్ బాపి, ఉ
త్సవపాథోనిధిఁ దేల్చె; నీప్రతిభ నేఁ♦ జర్చింపఁగాఁ జాల; మ
త్కవితాప్రాభవ మోర్చుకొంటి; యిఁక నీ♦ కన్యామణిన్ సర్వశా
స్త్రవిశేషాంచితఁ జేయువాఁడ; కనుమ♦ స్మత్ప్రౌఢిమం బంతయున్. ౨౦

మద—కవీంద్రా! భవద్వాక్యసుధాధారాసేచనంబునం జేసి నామనోవ్యాధియు నిర్మూలంబు చేసినారు. తరువాత శుభముహూర్తము నిశ్చయించి విద్యాభ్యాస మొనరింతము. (లేచును.)

బిల్హ—మంచిది; అటులే చేయుదము.

(నిష్క్రమింతురు.)

[తెరదిగును.]

---

రంగము:—అంతఃపురము.

[యామినీపూర్ణతిలక తనసఖులగు కలావతీచతురభాషిణులతో ప్రవేశించును.]

చతు—సఖీ! గురువువలన చిరకాలమభ్యసించినను సరిగా పట్టుపడని సంగీతజ్ఞానము నీకు సహజముగానే అబ్బుట పూర్వజన్మార్జితపుణ్యవిశేషంబుచేఁగాని వేఱు కాదు. దీనికితోడు గురుసాహాయ్యంబుకూడ కలిగిన బంగారమునకు వెలిగారము తోడగునట్లుండునుగదా!

యామి—చెలీ! నేనును ఇదే ఆలోచించుచుందును. దైవానుగ్రహమువలన నాకు ఉన్నకొలఁది గ్రహణశక్తికి ఉపబలంబుగా సకలకలాకోవిదుండగు ఉపాధ్యాయుండు లభించిన మేలుగా ఉండును.

కలా—అవును; ఎట్టిజాతిరత్నమైనను సానఁబట్టక సంపూర్ణప్రభాభాసితంబు కానేరదుగదా! అయిన, దీనికి ఇంతవిచారమెందుకు? నీఅభిప్రాయము మహారాజుగారికి తెలియఁజేసిన ఆయన నీమనోభీష్టము సులభముగా నెఱవేర్పఁగలరు. కాన, ఇందులకై కొందలమందక యిందాఁక నీవుపాడినపాట శ్రవణానందముగా మరల ఒకసారి పాడుము.

యామి—మంచిది; నీవుచేసిన హితోపదేశమునకు బదులు మ ఱేమి చేయఁగలను?

హరికాంబోది—త్రిశ్రగతి చాపు.

దేవదేవా! నన్- బ్రోవవే॥ దేవ॥
భావమందు నిన్ సదా- భక్తియుక్తిఁ గొల్చెద; ప్రేమతో॥ దేవ॥
గీర్వాణులైన నీ- కీర్తి నెన్న లేరనన్
సర్వేశ! నేనింక- బాలుఁడనే ఒకింత? వట్టిదే॥ దేవ॥
జన్మమెత్తినందుకున్- చరణసేవ ఒసఁగవే;
మన్మనోరథంబు తీర్చి- మన్ననలన్ గొనవే॥ దేవ॥

కలా—ఆహా! నీగానమెంత మనోహరముగా ఉన్నది! ఈగీతమెక్కడ నేర్చుకొంటివి? నేనిదివఱకెన్నఁడును వినినదానివలె లేదే. నీవే రచించితివా యేమి?

యామి—(చిఱునవ్వునవ్వుచు ఊరకుండును.)

చతు—కళావతీ! వేఱుగా చెప్పవలయునా? ఈమెముఖకళయును, చిఱునవ్వువెన్నెలయును నీసందేహాంధకారమును పాపుట లేదా?

కలా—(పక్కగా) అవును; అందులకు సందేహము లేదు; కాని యీమెనోటనే ఆమాట వినవలయునని వేడుకగా ఉన్నది. (యామినీపూర్ణతిలకతో) సఖీ! తెలుపుము; నిజముగా ఈగీతకవిత్వము నీవే చేసితివా యేమి?

యామి—కళావతీ! నానోట చెప్పించినఁగాని నీకు తృప్తి కాదా? ఇది నేనే అల్లితిని.

కలా—చతురభాషిణీ! చూచితివా మనసఖి అదృష్టము? కవితాసంగీతలతలు ఈ లతాంగిహృదయక్షేత్రమున దైవికముగా అంకురించినవి.

యామి—ఎవరో వచ్చుచున్నట్లున్నది; చూడు.

చతు—(చూచి) మఱెవరును కారు; ఇంతకుముందు మనమనుకొనినదానికి అనుగుణముగా మహారాజుగారే వచ్చుచున్నారు. ఇఁక నీఅభీప్సిత మీడేఱినట్లే.

[మదనాభిరాముఁడు ప్రవేశించును.]

యామి—(తండ్రికి నమస్కరించును.)

మద—దీర్ఘాయురారోగ్యవిభవయుక్తురాలవును, సంప్రాప్తమనోరథవును అగుదువుగాక. అమ్మా! మీరేమో ఆలోచించుచున్నట్లున్నది.

౯ * గీ. పలుకు మమృతంబు జలజల ♦ ఒలుకునటుల;
యామి— అనుకొనుచు నుంటిమేము వి ♦ ద్యను గురించి;
మద— ఏమి! తలఁచితి· మొక్కట ♦ ఇరువుర మదె;
యామి— ఏమి వింతయో! సఖులార! ♦ ఇట్లు జరుగ. ౨౧

నాన్నగారూ! దయచేసి నాకోరిక నెఱవేర్పుఁడు.

మద—నీకు ఏమి చదువుకొనవలయునని ఉన్నదో చెప్పుము. తగిన గురువును కూర్చెద.

యామి—కవితాసంగీతాదికళలు నేర్చుకొనవలయునని కోరిక ఉన్నది. *

మద— క. నీమృదువచనామృతమున
నామదిఁ సంతసపుపైరు ♦ ననలెత్తె; త్వదీ
యామోఘవాంఛ మెచ్చితి;
నాముద్దులపట్టి! నీమ ♦ నసు తీర్తు వెసన్. ౨౨

అమ్మా! నేఁడు సభయందు నీవిద్యాభివృద్ధినిగూర్చియే ఆలోచించి, సర్వశాస్త్రపారంగతుఁడును, కావ్యనాటకాలంకారకవిత్వాదికళావిశారదుఁడును అగు ఒక పండితమార్తాండుని నీకు గురువుగా నిర్ణయించినాఁడ.

యామి—(సంతోషముతో)

౧౦ * ఉత్సాహము. ఏమిపొగడనేర్తు? మీకు ♦ ఎసఁగు ప్రేమ నాయెడన్;
కామితములు తెలుపకుండఁ ♦ గా ఫలింపఁజేయు వా;
రేమిమాఱు చేయనేర్తు ♦ ఇట్టికూర్మి? కందుచే
నామనంబుతోడ వంద ♦ నములొనర్తు; తనియుఁడీ. *

మూక బధిరాంధాదులను చూడ నను నానియమము తమకు విశదమేకదా? మీరు నిర్ణయించిన ఉపాధ్యాయశ్రేష్ఠుఁడు సర్వవిధముల మాననీయుఁడై ఉండుననుటకు సందియము ఉండదు. ఆమహానుభావుఁ డెవరో తెలిపి నన్ను ధన్యను కావింపుఁడు.

మద— గీ. అతఁడు బిల్హణకవి అను ♦ అవనిసురుఁడు;
సకలజనమాననీయుఁడు; ♦ సర్వశాస్త్ర

కోపవిదూరుఁడు, శాంతచిత్తుఁ, డ ♦ కుంఠితమతి
విభవుఁడును, ధర్మవిదుఁడునై ♦ వెలయు; కాని. ౨౪

యామి—నాన్నగారూ! ఏమి యేమి అట్లంటిరి?

క. కాని యనెడు నుడివిని నా
మానసమను పర్వతంబు ♦ మఱిందఁగఁ జేసెన్;
కానఁ గలలోపంబున్
వే నాకెఱిఁగింపవలయు; ♦ వేఁడుకొనియెదన్. ౨౫

మద—మఱేమియు లేదు; అంధుఁడు.

యామి—అయ్యో! అట్లయిన నానియమభంగము కలుగునుగదా! పుట్టుపేడి, పుట్టుగ్రుడ్డి, కుష్ఠరోగి మొదలగువారిని చూడకూడదను శాస్త్రనియోగమును, తదనుగుణమగు నానియమమును తమకెఱింగినదేకదా? తెలిసి తెలిసి యిట్టివాని నిర్ణయించితిరేమి? నేను అతనివద్ద చదువ ఎంతమాత్రము వీలుపడదు.

మద—అమ్మా! అట్లనకుము; నేను ఆలోచింపక చేసెదననుకొంటివా?

౧౧ *

యామి—(తొందరతో) గీ. ఏమి యోచించినారో మీ ♦ రెఱుఁగ చెప్పుఁడి;
మద— కాండపట మొండు కట్టింతు; ♦ కలఁతపడకు;
యామి— అయిన సరియే; వచింప మీ ♦ ఆనకెదురు;
మద— చదువుకొనవచ్చు మదిలీల; ♦ సంతసింపు. * ౨౬

నీకీశుభవార్త తెలుపుటకే సభనుండి యిచ్చటికి వచ్చినాఁడ. మధ్యాహ్నమైనది. స్నానమునకు చనెద. నీవు సుఖముగా నుండుము. (నిష్క్రమించును.)

యామి—చిత్తము.

[తెరపడును.]

శ్రీ

# బిల్హణీయము.

## ద్వితీయాంకము.

### రంగము:—అంతఃపురము.

[బిల్హణుఁడును, యామినీపూర్ణతిలకయు, ఆమెసఖులును ప్రవేశింతురు.]

బిల్హ—మీపాఠములు చదివితిరా?

చతు—చదివి సిద్ధముగా ఉన్నాము గురువర్యా!

బిల్హ—ఏదీ నీపాఠము? ఒప్పగింపుము.

చతు—చిత్తము.

"శ్లో. శక్యో వారయితుం జలేన హుతభుక్, ఛత్రేణ సూర్యాతపో,
నాగేంద్రో నిశితాంకుశేన సమదో, దండేన గోగార్దభః,
వ్యాధి ర్భేషజసంగ్రహైశ్చ, వివిధై ర్మంత్రైః ప్రయోగై ర్విషం;
సర్వస్యౌషధ మస్తి శాస్త్రవిహితం; మూర్ఖస్య నా స్త్యౌషధమ్."

బిల్హ—దీనితాత్పర్యము చెప్పుము.

చతు—చిత్తము. నీటిచేత అగ్నిని ఆర్పుటకు శక్యమగును. చేటచేత ఎండను అడ్డుటకు శక్యమగును. వాఁడిఅయిన అంకుశముచేత మదపుటేనుఁగును నివారింప శక్యమగును. కఱ్ఱచేత గోవును, గాడిదను లొంగఁదీయ శక్యమగును. మందులచే రోగమును అరికట్టుటకు శక్యమగును. వివిధములగు మంత్రప్రయోగములచే విషమును రూపుమాప శక్యమగును. ఇట్లే ప్రతిదానికిని శాస్త్రవిహితమగు మందు కలదు; కాని, మూర్ఖతనుమాన్పు మందు లేదు.

బిల్హ—అవును; ఆమాట సత్యము. కళావతీ! ఏదీ నీపాఠము?

కళా—చిత్తము; ఇదిగో అప్పగించుచున్నాను.

"శ్లో. అయంచ రథసంక్షోభా దంసే నాంసో నిపీడితః।
ఏకఃకృతీ శరీరేఽస్మిన్; శేష మంగం భువో భరః."

బిల్హ—దీని ప్రతిపదార్థము చెప్పుము.

కళా—చిత్తము. రథసంక్షోభాత్=రథము కదలుటవలన, తస్యాః=ఆ ఊర్వశి యొక్క, అంసేన=భుజశిరస్సుచేత, అసౌ=నాభుజశిరస్సు, నిపీడితః=రాచు కొనఁబడినది; అస్మిన్=ఈ, శరీరే=దేహమందు, అయం=ఇది, ఏకః=ఒకటే, కృతీ=కృతార్థమైనది; శేషమ్=తక్కిన, అంగం=శరీరము, భువః=భూమికి, భరః=బరువు.

బిల్హ—బాగుగా ఉన్నది. రాజకుమారీ! ఏదీ నీపాఠము?

యామి—చిత్తము.

"శ్లో. అద్యాపినూనం హరకోపవహ్ని స్త్వయి జ్వలత్యౌర్వ ఇవాంబురాశౌ।
త్వ మన్యథా మన్మథ మద్విధానాం భస్మావశేషః కథ మిత్థ ముష్ణః."

బిల్హ—సరే. శ్లోకము వచ్చినది. ప్రతిపదార్థము చెప్పుము.

యామి—చిత్తము. హరకోపవహ్నిః=ఈశ్వరునికోపాగ్ని, అద్యాపి=ఇప్పుడునైతము, ఔర్వః=బడబాగ్ని, అంబురాశావివ=సముద్రమునందువలె, త్వయి=నీయందు, జ్వలతి=మండుచున్నది; నూనం=నిశ్చయము. అన్యథా=అటుగాకున్న, మన్మథ=ఓమన్మథుఁడా!, భస్మావశేషః=భస్మమాత్రావశిష్టుఁడవైన, త్వం=నీవు, మద్విధానాం=నావంటివారలకు, ఇత్థమ్=ఈప్రకారము, కథమ్=ఎట్లు, ఉష్ణః=ఉష్ణత్వముకలవాఁడవు, అసి=అగుచున్నావు.

బిల్హ—మన్మథునియందలి ఉష్ణత్వమెక్కడిది?

యామి—ఈశ్వరకోపాగ్ని సంబంధమైనది.

బిల్హ—బాగుగా వచ్చినది. ఇప్పటికి భోజనములకు వెళ్ళుఁడు. మధ్యాహ్నము క్రొత్తపాఠములు చెప్పెద.

యామి—చిత్తము.

(నిష్క్రమింతురు.)

[యవనిక జారును.]

## రంగము:—శయ్యామందిరము.

[యామినీపూర్ణతిలక పండుకొని ఉండును; ఆమెసఖులు చదువుకొనుచుందురు.]

యామి—(ఉలిక్కిపడిలేచును.)

చతు—సఖీ! ఏమి? ఉలిక్కిపడి లేచినావు.

యామి—ఏమి చెప్పుదును? ఏదో కలగంటిని.

కళా—ఏమి ఆకల? త్వరగా చెప్పుము.

యామి—మొదట భవానీదేవి కనఁబడి నాకు వర మిచ్చినది.

చతు—ఆవర మేమి?

యామి—నాకు కావలసినవరమే.

కళా—అనఁగా ఏది?

యామి—ఏదా? అదే. నేను చెప్పఁగలది అంతే.

చతు—పోనిమ్ము; తరువాత.

యామి—తరువాతిసంగతియు చెప్పఁజాల.

కళా—ఏమి? ఎందుచేత? సరిగా జ్ఞాపకము లేదా? తొందర అక్కఱలేదు; జ్ఞప్తికి తెచ్చుకొనియే చెప్పుము.

౧౨ *

యామి—ఉత్సా. చెప్పఁజాల నే నెఱింత ♦ చెప్పఁజాల నిజముగా;
కప్పలవలె నాతలఁపులు ♦ గంతులిడెడు; నమ్ముఁడీ;

కళా—(నగుచు) నీవరము వరవరము కాఁబోలును.

సఖులు— చెప్పు నీవుకనినకలయు ♦ చిత్తభవునివర మొకో!
ఒప్పులాఁడి! ఏల సిగ్గ ♦ నొంద ఇటుల మాకడన్?

యామి—అబ్బా!

ఉత్సా. నన్ను బాధపెట్టకుఁడిఁక ♦ నారులార! ఇపుడు నా
మిన్నుముట్టునట్టిసిగ్గు ♦ మ్రింగివేయు; కావునన్;

కళా—సఖీ! తిన్నఁగా ఆలోచించిన వడ్లగింజలో బియ్యపుగింజ అనునట్లు కావు వ్యవహారము అందఱకును తెలిసినదే. కాన,

సఖులు— అన్నుమిన్న! మమ్ము చంపి ♦ నన్నె యింక చెప్పవే;
నన్నుతించువారము నిను; ♦ సరిగ చెప్పుమా కలన్.

యామి—సఖులారా! మీరట్లు వదలరుకదా! చెప్పెద; వినుఁడు.

మోహనము. నవ మోహనాంగుఁ డొకఁడు ♦ నాకు కానఁబడియెనే;
నవనీతమట్లు అపుడు ♦ నామనస్సు కరఁగెనే;

కళా—(చతురభాషిణినిచూచి, కన్నుగీఁటి, నవ్వుచు) మేలు మేలు!
ఉవిదా! మఱంత అతఁడె ♦ ఉబ్బినిన్ను అలమెనో;
అవునా ననంగ అతని ♦ అట్టెనీవె అలమితో!. * ౨౯

యామి—ఓసీ! చాలు నీనేర్పు. ఊరకుండుము. ఆపయిసంగతి నేను చెప్పఁజాల. ఇఁక నన్ను వేధింపకు.

కళా—సగము చెప్పనే చెప్పితివి. మఱి సిగ్గెందుకు? మిగిలినదికూడ చెప్పి మమ్మానందింపఁజేయుము.

యామి—కళావతీ! నీవు ఏమన్నను ఆపైసంగతి నేను చెప్పను. పలుమాఱడుగకుము.
(పరుండును.)

చతు—(నగుచు) ఓసీ! కళావతీ! ఆపైసంగతి నీకు తెలియదా? మఱలవేఱుగా అడుగవలయునా?

కళా—నాకేమి తెలియును? కలగన్నదానను నేను కానుగదా!

చతు—ఇపుడు కాకున్న మఱియెప్పుడును ఇట్టికల కనియుండనేలేదు కాఁబోలును.

కళా—నేను కంటినో లేదో కాని నీమాటలవలన నీవు కనినట్లు స్పష్టమగుచున్నది. తరువాతిసంగతి యేమో చెప్పుము.

చతు—నీకు తెలియకున్నఁగదా నేను చెప్పుట. పాపము! నంగనాచివి. నీకు ఈ సంగతులేమియును తెలియవు.

కళా—నాకును తెలియును; నీకును తెలియును; వయసువచ్చిన స్త్రీలకందఱకును తెలియును. ఈమెనోటనే చెప్పించి సంతసింపవలెనని ప్రయత్నించుచుండ, పానకములోని పుల్లవలె నీవేల అడ్డువచ్చెదవు?

చతు—చెప్పింపుము; చూచెదను.

కళా—చెప్పించిననే నన్ని పేర పిలువుము. (యామినీపూర్ణతిలకతో) చెలీ! యామినీపూర్ణతిలకా! ఒకమాట.

యామి—ఒకమాటయు లేదు; రెండుమాటలును లేవు. ఇప్పుడు నన్ను మాట్లాడింపకుము.

కళా—సఖీ! ఎప్పుడునులేనిది యేమి నేఁడిట్లు కోపగించెదవు? నీవు కోపగించినను నాకుమాత్రము కోపము రాదు; కాని, ఒకమాట చెప్పుము.

యాము—ఏమది?

కళా—తరువాత పైకొనినదానవు నీవా? అతఁడా?

యామి—మరల అదేమాటా?

కళా—ఇందాఁక చెప్పెదనన్నదానవు నీవేకదా?

యామి—అవును; నేనే. అయిననేమి?

కళా—మఱియేమియు లేదు; పైకొనినదానవు నీవే.

యామి—నేనటుల చెప్పితినా?

కళా—ఇప్పుడేకదా నేనే అంటివి.

యామి—దేనినిగూర్చి?

కళా—దేనినిగూర్చియో! నేనడిగినదానికి ప్రత్యుత్తరమగునా? కాదా? నిజము చెప్పుము. పైకొనినదానవు నీవేకదా?

యామి—ఓసీ! అసత్యమాడఁజాల; నేనే.

కళా—సెబాసు! సఖీ! సెబాసు! చతురభాషిణీ! ఇప్పుడేమనియెదవు? చెప్పించితినా? లేదా?

చతు—అవును. నీవు సామాన్యురాలవా? నల్లకాకిని తెల్లకాకిగా చేయఁగల మాయలమల్లివి.

కళా—పోవే; నీమాటలకేమి? నావంతము నెగ్గించుకొంటినా? లేదా? (యామినీపూర్ణతిలకతో) సఖీ! మంచికల కనినదానవు. దీనివలన కొలఁదికాలములోనే శుభము కలుగును.

యామి—ఏమిశుభము?

కళా—(చతురభాషిణితో) ఈమె వట్టిముగ్ధ. ఏమియు ఎఱుఁగదు.

చతు—మొదట నీవుమాత్రము కావా? ఇప్పుడు జాణవైతివిగాని.

కళా—(యామినీపూర్ణతిలకతో) చెలీ! ఏమిశుభమో ఊహింపలేవా?

యామి—నేను ఊహింపఁజాల; నీవే తెలుపుము.

కళా—అయిన నేనే చెప్పెదను; వినుము.

పంచచా. అనంగరూపవైభవాఢ్యుఁ ♦ డైనపూరుషుఙ్ కలఙ్
మనంబు తీఱ కూడి సౌఖ్య ♦ మగ్నవైతి; కావునఙ్
ఘనాఘనాభవేణి! అట్టి ♦ కాంతు కొన్నినాళ్లలో
అనూనరాగ మొప్పపొంది ♦ హర్షవార్ధిఁ తేలెదే.

యామి—(విచారములో) వట్టిది; నాకట్టిభాగ్యమెట్లులబ్బును? కలయే నిజమైన లేనిదేమున్నది?

కళా—చెలీ! ఎందుకు సందేహించెదవు? నీవు కలలోఁ గలసిన పురుషుఁడు దొరకఁడనియా? భవానీవరము ఏమగుననుకొంటివి? కాన, ఇంక ఆసందేహము మాని అతఁడెట్టివాఁడో చెప్పుము.

యామి—కళావతీ! ఆమదవతీమదనుఁడు ఇట్టివాఁడని తెలుప నలువకును- చిలువరాయనికినికూడ అలవికాదన, ఇఁక అబలనగు నేను ఎంతదాన?

కళా—అలవి అగునంతవఱకే తెలుపుము; విని సంతోషించెదము.

యామి—మంచిది; నీయిష్టము వచ్చినట్లే కానిమ్ము. ౧౩ *

అందము.

తెలువఁగఁజాలనె ఆతనిఅందము ♦ దివ్యులనేనియు తలదన్నున్;
బలితపుతుమ్మెదఱెక్కలపోలెడు ♦ వానికురుల్ మగువల కట్టున్;
అలరులవిల్తునితూపులమించెడు ♦ ఆతనిచూపులు మది చీల్చున్;
చెలువముకుల్కెడునీటులు గోటులు ♦ చేడెలఁ వైమఱువఁగఁజేయున్. *

కళా—ఏమీ? అతఁడంత అందగాఁడా?

యామి—ఓసీ! నేనుచెప్పినది ఆ సుందరాంగుని అంగములో సహస్రాంశమైనను కాదని నాకు సిగ్గగుచున్నది. ఒక్క సౌందర్యమే కాదు; ఆవగ కానివిలాససంపద, సల్లాపచతురత, విద్యావైభవమును మఱొకనికి ఉండునని నేను తలఁపను.

కవిరాజవిరాజితము.

కననిగతిన్ కడగన్నులనే నను ♦ కాంచెడుపోఁడిమి, నాపయి బా
ళిని మదిఁ బొందియు పైకి ఒకింతయు ♦ లేనితెఱంగుననే నటియిం
చునయము, నేఁ బయికొన్నను ధీరత ♦ చూపుచు నీతిని తెల్పెడునే
ర్పును, తుదిసౌఖ్యపయోనిధిఁ దేల్చిన ♦ ప్రౌఢతనంబు,. అవాచ్యముసూ.

కళా—చతురభాషిణీ! ఈవర్ణనముఁబట్టి యీమెవరించినపురుషుఁడు ఈలోకములో ఉన్నవానివలె కనఁబడఁడు. ఎప్పుడైనను ఇన్నిసుగుణములు ఒక్కనియందుండునా? ఇది కలలోవార్తయే.

ఉత్సా. సఖియ! ఎండమావులందు ♦ స్నానమాడి, మింటిపూ
సికను తాల్చి, శశకశృంగ ♦ చిత్రితోగ్రకార్ముకం

బు కరమందు పట్టి వచ్చు ♦ పుట్టుగొడ్డురాలివు
త్రకుఁడఁటంచు ఎంతు ఈ అ ♦ తాంగికన్న ఆతఁడున్.

(యామినితో) సఖీ! నీవర్ణనము అపూర్వముగా ఉన్నది. ఇట్టిపురుషుఁడు సులభసాధ్యుఁడనిమాత్రము నాకు తోఁచదు.

యామి— సులభసాధ్యుఁడైనను కాకున్నను నేను అతనినిగాక మఱొకనిని వరింపను.

కళా—(తొందరతో) ఎవనిని? కలలో కనినవానినా?

యామి—అవును.

కళా—(పక్కగా) అయిన అతనిని మరల కలలో వరింపవలసినదే. (యామినీపూర్ణతిలకతో) సఖీ! కలలోకనినవానినే కాని మఱొకని వరింపనని తొందరపడి నిశ్చయించుట తగునా? అట్టివాఁడు యథార్థపురుషుఁడు గాక కలలోనివాఁడే అయిన చిక్కు కలుగునుగదా.

యామి—ఏమిచిక్కు కలుగును? ఆమనోహరాంగుఁడు లభించిన వరించెదను; లేకున్న ఊరకుండెదను.

కళా—(తొట్రుపాటుతో) ఏమీ? వివాహము లేకయే ఉండెదవా?

యామి—అవును. ౧౮ *

సీ. ఊరకుండిన ఏమి ♦ ఉసురులు పోవునా
కోరినవరుఁడు నే ♦ కూరకున్న?

కళా— అందఱుఁ ఇట్టుల ♦ ఆచరించినయెడ
సుందరీ! లోకంబు ♦ సున్న కాదె?

యామి— అందఱిమాట నా ♦ కరయఁగ పని యేమి?
నామదివచ్చు చం ♦ దమున నడతు;

కళా— లోకులతోపాటు ♦ నీకును చేయఁగా
తగుఁగాక ఒంటివి ♦ ధంబు తగునె?

యామి— ఎవరికర్మమునకు ♦ ఎవ్వరు కర్తలే?
ఎవ్వరికేమి నే ♦ నిటులొనర్ప?

కళా— ఎల్లరకున్ పని ♦ యేమియు లేకున్న
తలిదండ్రులైనను ♦ తల్లడిలరె?

యామి— వారుమాత్రము దుఃఖ ♦ పడనేల నేను సౌ
ఖ్యాంబురాశిని తేలి ♦ యాడుచుండ?

కళా— (ఆశ్చర్యముతో) ఏమిటి సుఖంబు నీ ♦ కైటుల లభించును
కోమలి! పెండ్లిగాక ♦ [illegible]?

యామి— మనసునకు రానివానితో ♦ [illegible]
కన్యగా ఉండు [illegible] ♦ [illegible] కాదె?

కళా— చెలి! ఇంకఁ నీవు పలుక ప ♦ [illegible]
పలుకఁగాఁజాల; ఏమి కా ♦ గలదొ యెఱుఁగ. * ౩౪

యామి—కళావతీ! నీవెందుకంతగా చింతించెదవు? మాటవరుసకు నీతో వాదించితినిగాని, నిజమునకు, నా స్వాంతమునమాత్రము నను కోరిన కాంతుఁడు దొరకఁడనువంత ఆవంతయును లేదు.

కళా—(సంతోషముతో) సఖీ! నీకు ఇట్టినిబ్బర మెట్లు కలిగినదో తెలుపుము; నాకు వింతగా ఉన్నది.

యామి—మఱేమియు లేదు; విను.

భుజంగప్రయాతము. పరున్నమ్మి, ధర్మంబు ♦ పాటించినన్, దు
ష్కరంబైన కార్యంబు ♦ కానోపుసుమ్మీ;
సరోజాక్షిరో! నేనె ♦ సద్వృత్తినేన్ ఈ
శ్వరుండేల నాకోర్కి ♦ సాగింపకుండున్? ౩౫

కళా—అవునవును; చక్కఁగా చెప్పితివి. అదియునుగాక భవానీవరంబు వ్యర్థమగునా? కాదు.·నేనే మందమతినై కలఁతపడితిని. ఇప్పుడది తీఱినది; తీఱు టేకాదు. దైవానుగ్రహమువలన నీయభీష్టము కొనసాఁగఁగలదనుగట్టినమ్మకము నాకును కలుగుచున్నది.

ఉత్సా. అదిగో! లోకబంధుసింహ ♦ మంధకారకుంభినిన్
విదితకిరణనఖరపాళి ♦ విచ్చి లోకులెల్లరున్
ముదముపొంద చల్లుకీర్తి ♦ ముత్తియంబులనఁగ ఇం
పొదవు మంచుబొట్లు కాఁలె ♦ ఉదయశిఖరిఁ మించెడిన్. ౩౬

యామి—అవును; తెల్లవాఱినది. కాల్యకరణీయంబులు తీర్చుకొని ఉద్యానవనమునకు పోదము; రండు. (నిష్క్రమింతురు.)

[తెరపడును.]

శ్రీ

# బిల్హణీయము.

## తృతీయాంకము.

### రంగము:—ఉద్యానవనము.

[యామినీపూర్ణతిలక చెలికత్తెలతో ప్రవేశించును.]

చతు—చెలీ! ఈశృంగారవనము ఈప్రభాతకాలమున ఎంతమనోహరముగా ఉన్నదో కనుఁగొనుము.

కళా—సఖీ! ఏమి? ఈప్రమదావనరమణీయత కనక పరధ్యానమున ఉన్నదానవు. ఇంకను స్వప్నవృత్తాంతమునే తలఁచుకొనుచున్నావాయేమి? తొందరపడకుము. కొలఁదికాలములోనే నీమనోరథము ఈడేఱఁగలదు.

యామి—(తలయెత్తిచూచి) ఏమేకళావతీ! ఏమనుచున్నావు?

కళా—(ఒకప్రక్కగా) సరే; నేననినట్లే. ఈమెశరీరము ఇచ్చటనున్నదిగాని మనసు ఇచ్చటలేదు. (పైకి) సఖీ! నేను ఏమనినదియు నీకు వినఁబడనే లేదు కదా. పోనిమ్ము. ఈ ఉపవనసౌందర్యము తిలకింపుము.

౧౫ * సీ. పూలతో నిండిన ♦ భూజముల్ లతలొప్ప,
చల్లగాలి చెలంగ ♦ ఉల్లసిల్లు;

యామి—అవును. ఈఆరామము మిగుల మనోహరముగానే ఉన్నది.

చీఁకటి అంతయు ♦ చెల్లాచెదరు కాఁగ,
ఉదయసూర్యప్రభ ♦ పొదవ మించు;

కళా—ఇక్కడ చూడుము.

విచ్చినపూఁదేనె ♦ విచ్చలవిడిఁ అళుల్
హెచ్చుగా క్రోలుచు ♦ మెచ్చిపాడు;

యామి—ఇటు చూచితిరా?

కోకిలలెలమావి ♦ ఆకులు కడుమెక్కి
చెన్నగురవముతో ♦ మిన్నునింపు;

కళా——ఈప్రక్క కనుఁగొనుము.

దొండపండు తనదు ♦ తుండంబుతో కొట్టి,
విందుగుడిచి, చిల్క ♦ కందు వల్క;

యామి——ఇచ్చట కాంచితిరా?

అచ్చవుము త్యాల ♦ మచ్చున మంచునీర్
పచ్చికపై కూడి ♦ ముచ్చటయిడు;

కళా——అటు కనుము.

ముదురుమొగ్గలు మరు ♦ పదనుబాకులవలె
పొదల ఎల్లయెడల ♦ పొదివి పొదలు;

యామి—— అవును; నాకుఁ చిత్త ♦ భవునిబాకులవలె
అవుచు నన్ను ఇప్పు ♦ డవి కలంచు. * ౩౭

(కళావతీచతురభాషిణులను ఆనుకొనును.)

కళా——సఖీ! నీవు మిగుల అలసినదానవు. ఈనికుంజాంతరచంద్రకాంతపీఠమున కొంతసేపు విశ్రాంతిపొందుము.

యామి——మంచిది; ఆలాగుననే చేయుదాన. (పొదరింట కూర్చుండును.)

సఖులు——(వీచుచుందురు.)

కళా——ఓసీ! చతురభాషిణీ! ఈమె ఇంతలోనే ఇంత అలయుటకు కారణమేమై ఉండును?

చతు——నీవంటిదే కన్నుపొడిచి కన్నీటికి కారణమేమని అడిగినదఁట.

కళా——ఏమే! అట్లనియెదవు? ఈమెఅలయికకు నేనెట్లు కారణమైతిని? చెప్పుము.

చతు——పొదరిండ్లపైనున్నముదురుమొగ్గలు స్మరునిపదనుబాకులవలె ఉన్నవని నీవనలేదా?

కళా——అనిననేమి? దానికిని, ఈమెఅలసటకును సంబంధమేమి?

చతు——లేకపోవుటయేమి? కావలసినంత ఉన్నది. నీవు స్మరునిపేరు ఎత్తఁగానే ఈమెకు స్వప్నవృత్తాంతము స్మరణమునకువచ్చి స్మరవేదన లతిశయించినవి; అందువలన అలయిక కలిగినది. ఇప్పుడైన ఒప్పుకొనెదవా?

కళా—అవునే; నాతప్పిదముననే యిప్పుడీబప్పులకుప్పకు శ్రమగలిగినది. కాని ముందుసాధనమేమి? ఈచిలుకలకొలికి కలలోకనినవానిపై బలితపువలపు కొని పొగలుచున్నది. ఆతఁడు ఈమెకు లభించుటెట్లు? ఇందెందైన కనఁబడిన మనమైన ప్రయత్నము చేయుటకు వీలుండును.

చతు—కళావతీ! మనము దీనినిగురించి కొందలమందిన లాభము లేదు. దైవానుకూలత కలిగెనేని కలలోనివాఁడును నిజముగానే కనఁబడును. (విసరుచుండును)

బిల్హ—(ప్రవేశించి) ఓహో! ఏమి యీ ఉద్యానవనమనోహరత!

లయగ్రాహి. మల్లెపొదలొక్కయెడ ♦ అల్లుకొని స్వచ్ఛసుమ ♦
వల్లరులఁ చూపఱుల ♦ ఉల్లము లలర్పన్;
మొల్లగము లొక్కయెడ ♦ చెల్లి పుపుగుత్తులను ♦
సల్లలితవాసనలు ♦ ఎల్లెడల నించున్;
పిల్లవలి తెమ్మెరలు ♦ మెల్లఁగ చరించి తను ♦
వల్లన స్పృశించి సుఖ ♦ ముల్లసిల చేయున్;
పల్లవచయమ్ము తిని ♦ వల్లకివలెన్ పికము ♦
చల్లఁగను పాడి మది ♦ పెల్లుగ కరంచున్. ౩౮

చూచుచున్నకొలఁదిని మరల చూచుచుండవలయుననియే మనసుపుట్టుచుండును. దేవతార్చనమునకు పదినాలుగుపుష్పములు కోసికొని పోయెద. (పువ్వులు కోయుచు యామినీపూర్ణతిలక ఉన్నవైపుచూచి) ఆహా! అచ్చట ఎవరో యువతీమణులున్నారు. వీరు ఎంతప్రాతఃకాలముననే వచ్చిరి! ఇఁక నేనిచ్చట తడయుట పాడికాదు. (నిష్క్రమించును.)

యామి—(బిల్హణునిచూచి, సంతోషపడి, తలవంచుకొనును.)

కళా—సఖీ! ఏమి? నీలో నీవు సంతోషపడి తలవంచుకొనెదవు. కడచినరాత్రి కనఁబడినపురుషుఁడు కనఁబడినాఁడా యేమి?

యామి—(తలవంచుకొనియే) కనులువిప్పి నలుగడలనుచూచిన నీకును కనఁబడును.

సఖులు—(ఆశ్చర్యముతో) నిజమే? (చూతురు.)

కళా—ఎక్కడను కనఁబడలేదే.

యామి—కన్నులుమూసికొని చూచినావా! విప్పిచూచినావా?

కళా—విప్పుకొనియే చూచుచున్నాను. ఇప్పటికిని నాకు ఎవ్వరును కనఁబడరే. ఎక్కడ ఉన్నాఁడో చూపుము. ఏల తలవంచుకొనెదవు?

యామి—చతురభాషిణీ! నిజము చెప్పుము. నీకును కనఁబడుట లేదా?

చతు—లేదు సఖీ! లేదు.

యామి—నన్ను పరిహాసము చేయుటకు నీవును కళావతికి తోడుదొంగవైనావా యేమి?

చతు—లేదు సఖీ! లేదు. నిజము చెప్పుచున్నాను. నాకిచ్చట ఎవ్వరును కనఁబడుట లేదు.

యామి—ఏమీ? (తలనొత్తి చూచి, విచారముతో ఊరకుండును.)

కళా—సఖీ! పగటికల కనుచున్నావా యేమి? వింతమాటలాడి వింతపనులు చేసెదవు.

యామి—ఓసీ! కళావతీ! నా అదృష్టము వింతగా ఉన్నది కాని మఱొకటి కాదు. నేను చెప్పినది కలలోనివార్త కాదు. ౧౬ *

వగ. కనుఁగొంటినె నిజముగనే ♦
కనుఁగొంటినె అతనిఁ ♦ కందర్పనిభున్;

కళా— కనుఁగొన్న ఇట ఎపుడెటుల్ ♦
కనుఁగొంటివె అతనిఁ ♦ కాంతా! చెపుమా;

యామి—కనుఁగొంటినె యిపుడిటనే ♦
క్షణమాయెను; విధినా ♦ కాంతుఁడే తలఁగెఁ:

కళా— కన అబ్బురమగు; అతఁడే ♦
కడ కాంచిన చెలియా! ♦ కానంబడఁడే. ౩౯

యామి—సఖులారా! ఏమి చెప్పుదును? నోటికగ్గటి ముద్ద తన్నుకొనిపోయినట్టుల ఆ పాపపువిధి నా మనోహరుని ఎడఁబాపె. అకటా! ఏమి చేయుదును? *

కళా—ఏమీ! నిజముగానే యిచ్చటికి వచ్చెనా? అటులయిన ఇప్పుడే పోయి అతనిని వెదకెదము. మేము తిరిగివచ్చుదాఁక నీవిచ్చటనే ఉండుము. చతురభాషిణీ! రమ్ము; మనసఖీప్రియుఁడు ఎచట ఉన్నాఁడో వెదకికొనివత్తము.

చతు—మంచిది. (కొంతదూరము నడచి) నీవు ఇటు పోయి చూడుము; నేను ఇటు వెళ్లి చూచెదను. (నిష్క్రమించును.)

కళా—జాగ్రత్తగా వెదకుము. (నిష్క్రమించును,)

యామి—అకటా! నామనసు మఱిఁగెడునీటివలె క్రిందుమీఁదగుచున్నది. కళావతి అనినట్లు ఇది కలకాదుకదా? కాదుకాదు. కల యెట్లగును? అంతఃపురమునుండి చెలికత్తెలతో ఈప్రమదావనమునకు వచ్చినదాన. ఇందు కొంతదనుక విహరించినదాన. కళావతి యీపొగరింట్లముదురుమొగ్గలు మదనునిబాణములవలె ఉన్నవన మదనవేదనాదూయమానమానసనైనదాన. అంత ఈపాదరింటికి వచ్చి కూర్చుండి దైవికముగా కనులెత్తి ఆమనోహరాంగుని కన్నులార చూచినదాన. దానినిగూర్చి కళావతితో నాదించినదాన. నిజమని నమ్మి ఆమనోహరాంగుని వెదక సఖులు చనదమనిన ఇయ్యకొనినదాన. ఇది అంతయు కల అగునా? కాదు కాదు. కాదుపో, ఇందువలన కలిగినఫలమేమి? దొరకిననిక్షేపము చేతినుండి జాఱిపోయినటుల ఆదివ్యసుందరవిగ్రహుండు ఇచ్చటికి వచ్చియు, నన్నుకనియు మిన్నకచనియెనే!

౧౭ * గీ. ఎటు లతఁడు నాకిఁకన్ లభి ♦ యించువాఁడొ!
ఎటుల నామనోవ్యథ ♦ యెడలఁ గలదొ!
మదనసముఁ డెద హరియించి ♦ కదియవచ్చి
కరినుఁడై యేగె; మరల నా ♦ కంటఁ బడునె! - * ౪౦

వట్టిది; ఇది వట్టిఅడియాస. దురదృష్టదేవత శిరముమీఁద నెక్కి తాండవమాడుచుండఁగా నాకు ఆవరుఁడు అబ్బునా? ఏరీ? వెదుకఁబోయినసఖులుకూడ ఇంకను రారైరి. నామది నీటినుండితీసి పైనివేసినచేఁపవలె కళవళపడి కొట్టుకొనుచున్నది. ఇంతకు నేనుచూచినది నిజమగుపురుషవిగ్రహముగాక నాడెందంబునందున్న ఆసుందరుని ప్రతిబింబమువలన ఉదయించిన తేజోవిశేషంబుచే ఏర్పడిన మాయరూపమేమో! కాదుకాదు. మొదట కలయందు కనఁబడి నాహృదయపటమున చిత్రితమయిన రూపమునకును, ఇప్పుడీప్రమదవనమున నేను కనుఁగొనిన రూపమునకును వస్త్రాభరణాద్యలంకారములందు భేదము కొంతకలదు. కాన నేనిచ్చట కనినది ఆనవీనమన్మథునివాస్తవరూపమేకాని మఱొకటి కాదు. ఏమైననేమి? తుదకు అయోమయముగా ఉన్నదే. చెలులు ఇంకను వచ్చుజాడ లేదు. ఒకవేళ వినోదముగా ఇచ్చటనే యెందైన దాఁగియున్నాఁడేమో ఆనవమదనుఁడు! వెదకి చూచెదఁగాక. (వెదకుచుండును.)

వతు—(ప్రవేశించి) వెతకివెతకి వేసారితినిగాని యీవైపున ఒకరును కనఁబడరైరి. ఒకవేళ అతఁడు కళావతికి కనఁబడెనేమో!

కళా—(ప్రవేశించి) అబ్బా! తిరిగితిరిగి నాఅడుగులు అరిగిపోయినవి కాని యీవన ఒకమగపురుషువాసనఅయినను కనఁబడలేదు. అతఁడు చతురభాషిణికి కనఁబడెనేమో!

చతు—(ముందుచూచి) అదిగో! కళావతి వచ్చుచున్నది. అడిగి తెలిసికొనెద.

కళా—అదిగో చతురభాషిణి వచ్చుచున్నది. అడిగి తెలిసికొనెద.

చతు—ఏమి? కనఁబడినాఁడా? కళావతీ!

కళా—కనఁబడినాఁడఁటే! చతురభాషిణీ!

చతు—సరే; ఇక క్రీడ యైనది. మనము ఒకరికి కనఁబడినాఁడని ఒకరము భ్రమపడినారము. చివరకు అది భ్రమయే అయినది.

కళా—ఇది అంతయు మనసఖి మతిభ్రమయేమో! రమ్ము. ఆమెదగ్గఱకు పోదము.

యామి—అదిగో! పాదములఅలికిడి వినవచ్చుచున్నది. ఆసింహసంహనుఁడు వచ్చుచున్నాఁడేమో! (చూచి) కాదు కాదు. చెలికత్తెలువచ్చినారు. ఏమి చేసికొని వచ్చినారో! ఎదురుగా చని తెలిసికొనెద. (సఖులవైపు వెళ్లును.)

చతు—ఓసీ! మనసఖి మనము విడిచివచ్చిన పొదరింట లేదు. ఏమైనదో!

కళా—ఒకవేళ మనము లేనిసమయము చూచి, ఒంటరిపాటు చిక్కెనని ఆమెకిచ్చట కనఁబడిన అతఁడు ఆలతాంగిని చేకొనిపోయినాఁడేమో!

చతు—అటులయిన మేలే; కాని నాకు ఈమెస్థితి తలఁచుకొనిన దిగులగుచున్నది.

యామి—సఖులారా! ఇటు. కాయా? పండా?

సఖులు—ఏమి చెప్పుదుము?

యామి—(దీనత్వముతో) సఖులారా! ౧౮ *

సీ. అటులనియెదరేమె? ♦ అటులనియెదరేమె?

కళా— మతిమెట్టులందుము? ♦ మగువమిన్న!

యామి— వనమంతయును మీరు ♦ కనుఁగొనినారఁటే?

కళా— అంతయు కంటిమి; ♦ అతఁడు లేఁడు;

యామి— కటికవిధికి ఇంక ♦ కాసంతఅయిన అ
క్కటికంబు నాపైని ♦ కలుగదాయె;

కళా— చటుకున నీకోర్కె ♦ సఫలంబుచేయ అ
క్కట! మాకు శక్యంబు ♦ కాకపోయె;

యామి— నాదుకర్మమిటులో ♦ నర్చుచున్నప్పుడు
మీరు దాని ఎట్లు ♦ మీఱఁగలరు?

కళా— వలయుపనిని చేయఁ ♦ గలుగనిమే మేల?
అనఁగు సఖులమనుచు ♦ అనుకొనుటకొ!. * ౪౧

యామి—మీచేతనగుపని మీరు చేసినారు. అంతకంటె మఱేమి చేయఁగలరు? సఖులారా! ఈపూఁదోఁటకు వచ్చిన మనస్సు కుదుటఁబడునేమో అని ఆసించితిని; కాని,

గీ. గాలి అనుకూలతంబట్టి ♦ గగనమునకు
ఎగసి, ప్రతికూలతంబట్టి ♦ యిలనుకూలు
నట్టి గాలిపడగవలె ♦ అకట! నేను
కొంతముదమంది, మఱి చింతఁ ♦ కుందవలసె. ౪౨

ఇఁక ఇచ్చట ఉండఁజాల. అంతిపురికి నన్ను చేర్పుఁడు.

సఖు—మమ్ము ఊఁతగొని రమ్ము.

యామి—(సఖులపై చేతులు వేసికొని మెల్లఁగా నిష్క్రమించును.)

[తెరపడును.]

---

రంగము—శయ్యామందిరము.

[సఖులు శీతలోపచారములు చేయుచుండ విరహతాపము పొందుచుండు యామినీపూర్ణతిలక ప్రవేశించును.]

యామి—సఖులారా! ఏమి చేయుదును? ౧౯ *

సీ. కను మూయఁబడదెన్న ♦ కడగండ్లఁ బడినను
స్మరబాణతతికి ల ♦ క్ష్యంబు నగుట;
పుండరీకవిరోధి ♦ చండకిరణపాళి
మండుసూదులవలె ♦ మాడ్చు మేను;
సలసలమనునూనె ♦ చల్లినరీతిని
ఒడలు మన్మథవహ్నిఁ ♦ ఉడుకులెత్తు;
పాలలో పడినట్టి ♦ బల్లిపోలిక నేను
గాలినిబడి కడు ♦ గాసిపడెద;

మూరుచుండిన, వవళింప ♦ గుణము లేదు;
ఇంటనుండిన, పైనున్న ♦ హితవు కాదు;
ఎంత ఓర్చిన మేలిసు ♦ మంత లేదు;
ఇంక, ఈతాపమున్ భరి ♦ యింపఁజాల. * (పాన్పుపై వడును.) ౪౩

కళా—చతురభాషిణీ! మంచిగంధమును, పన్నీరుబుడ్డియును ఇటు తీసికొనిరా.

చతు—(తెచ్చి) ఇదిగో! పన్నీరుబుడ్డి పుచ్చుకొని నీవు చల్లుము. నేను మంచిగంధము అలఁదుదాన.

కళా—(పన్నీరు చల్లును.)

చతు—(గంధము పూయును.)

కళా—ఓసీ! ఈమెశైత్యోపచారములచే తాపము కొంచెము తగ్గి కన్నులు మూయునట్లగపడుచున్నవి. నీవు ఈ వీవనతో మెల్లఁగా విసరుచుండుము. నాకన్నులు మూసికొనిపోవుచున్నది. ఒకసారి పరుండెద. (నిష్క్రమించును.)

చతు—మంచిది; అటులే కానిమ్ము. (విసరుచు, విసనకఱ్ఱ క్రిందపడఁగా కనులు నులుపుకొనుచు) అబ్బా! ఈనిద్దురపెద్దమ్మ నానెత్తిమీఁద ఎక్కి నాట్యమాడుచున్నది. ఈమెకును నిద్రపట్టినది. నేనును పరుండెద. (వెళ్లును.)

యామి—(లేచి) సఖులారా! (నలుగడలుచూచి) పాపము! వీరు నిద్రకు ఆఁగలేక పరుండినట్లున్నది. రాచపీనుఁగు తోడు లేక పోదనునట్లు నాతోకూడ వీరిని ఏల బాధపెట్టవలె? తల్లీ! నిద్రాదేవతా! నేను ఏమిపాపము చేసితిని? నాపై దయమాలినదానవు.

ఉత్సా. జనులు పగలు పడినగాసి ♦ సర్వమున్ నశింపఁగా
కనికరమున శయ్య చేర్చి ♦ కాచి తేర్చుదాదిరో!
ఘనమనోవ్యథాగ్నిఁ కుంది ♦ కాఁగువారి ప్రేమతో
మనుచువెజ్జ! నన్ను కావ ♦ మాని; తేమిదోషమో!. ౪౪

మారా! నిర్దయాసంబాధితవిరహిణీజనవారా! నిరాకారా! క్రూరా! నీకూరత అబలనగు నాపైనా చూపెదవు? నీశరములు కుసుమములందురే. కుసుమములే అయిన నాహృదయము, ఈవిధముగా చిదురుపలు చేయఁగలుగునా? కావు కావు. అవి నానాకారములుగా ఉన్న ఉక్కుటలుఁగులేకాని సూనములు కావు. ఏమైననేమి? నీకడిమి ఆఁడువారిముందర చూపవలసినదేకదా!

కవిరాజవిరాజితము.

మగతనముండినచో అలశూలిని ♦ మార్కొని సంగరరంగమునన్
తెగువ దలిర్ప జయంబును పొందిన ♦ తేజము నిల్పుకొనం దగదే?
తగుదునఁటంచును సిగ్గును జెందక ♦ దాడి ఒనర్చెదు మూఁకలతో
మగువలమీఁదను మన్మథ! నీవస ♦ మండ! ఇఁకైనను మానవురా? ౪౫

ఓరీ! దుర్మార్గా! నన్ను మఱింత బాధపెట్టఁ దొడఁగినావుకదరా! ఉన్నమాట అనిన ఉలికిపాటెక్కువ అనునటుల యిది నీచులకు సహజమే. గుడిమ్రింగువానికి గుడిలోనిలింగము వడియమనునట్లు తల్లిదండ్రులనే బాధించునీకు మావంటి పెఱవారు ఒకలెక్కా? గంతకుతగినబొంత అనునట్లు దోషాకరుండగు నిశాచరుండు, ఘనతరులకు ఆకులపాటొదవించుగాలి, పరులపంచలఁ బెరుఁగు పరభృతంబు మొదలగు దుష్టవర్గంబు నీకు సాహాయ్యంబగు. అకటా! అనంగా! శుకతురంగా! నీఅభంగసూనబాణసంఘంబులు నాఅంతరంగంబున నాటుకొనంగ ఏల సింజలుపింజలుగా వేయ కడంగెదవు? నీకు ఈశరసంధాననైపుణి యెటులబ్బెనో నామనంబునకు గోచరంబు కాకున్నది. ఇదే కాదు; నీచరిత్రమంతయు విచిత్రమే.

౨౦ * సీ. మెత్తనిపూవుల ♦ మొత్తముల్ కడువాఁడి
కత్తులవలె మేను ♦ హత్తుకొనును,
చల్లనివన్నీరు ♦ చల్ల కాఁగెడునూనె
చల్లినరీతి మై ♦ పెల్లు పొక్కు,
సురుచిరగంధంబు ♦ కరఁగినలోహంబు
కరణి శరీరంబు ♦ కాల్చివేయు,
పండువెన్నెలలోన ♦ పండుకొనఁగ ఒడల్
మండునిప్పులఁబడు ♦ మాడ్కి మాడు,
నీకు మనసున ఒకింత ♦ నిలువచోటా
సంగినంతన; నిను ఏమ ♦ నంగవచ్చు?
నీచరిత మతిచిత్రంబు; ♦ నిరుపమంబు;
తెలియ, ఇటువంటిదని చెప్ప ♦ అలవి కాదు. * ౪౬

హా! నిన్ను నిందించుటకైనను నాకు బలము లేకున్నది. నీబాధకును, ఈఆలయికకును నేను తాళఁజాల. (పాన్పుపై పడును.)

బిల్హ—(ఉలికిపడిలేచి) ఏమి యీస్వప్నము? ఆశ్చర్యముగా ఉన్నదే? (ఆలోచించి) ఎట్లు ప్రారంభమైనది? ఆఁ; జ్ఞప్తికివచ్చినది.

గీ. ఒకర్తె [illegible] ♦ [illegible]ండితినఁట!
ఆమె [illegible] ♦ అంచు నేను
మొదట [illegible] ♦ తుదకు ఒప్పు
కొంటినఁట! [illegible] తెలిసెనఁట!. ౪౭

(ఆలోచించి) త[illegible]వాత ఏమి జరిగినది?

గీ. నృపతి నను [illegible] గా ♦ నిగ్రహించె
నఁట! అతనికుమారిక కడు ♦ అడలినదఁట!
భూరికరుణ భవాని నన్ ♦ బ్రోచినదఁట!
వెలువముగ ఇద్దరికి పెండ్లి ♦ చేసిరిఅఁట!. ౪౮

ఏమి యీవింతకల? కొంపదీసి యథార్థముగా జరుగదుకదా! కలలోనిమొదటిసంగతికి సరిగా ఇప్పటికి నేను ఈరాజపుత్రికకు గురువునై ఉన్నవాఁడ.

౨౧ * క. ఛా! ఛా! ఎక్కడితలఁపిది?
నిచను మదిఁ తలఁచుచుంట; ♦ నింద్యం బనుటల్;
లోఁచినగతి వదలిన అటు
లే చను విడిపడినగుజ్జు ♦ మోగడుకరణిన. * ౪౯

ఇంతకు,

గీ. కుష్ఠరోగిణి యీమె నన్ ♦ కోరుటేమి?
నేను ఆకోరికన్ తీర్ప ♦ బూనుటేమి?
నృపతి నన్ను చంపఁగ ఆజ్ఞ ♦ యిచ్చుటేమి?
మగువకును నాకు తుదిఁ పెండ్లి ♦ అగుటయేమి?. ౫౦

చాలు చాలు. (తిరిగి ఆకాశమువైపుచూచి) ఓహో! నేఁడు పూర్ణిమకదా! అందుచేతనే చందురుం డమందప్రసాదసుందరుండై యింపొందుచున్నవాఁడు. (చూచుచు) ఆహా! ఈచంద్రబింబమును కనుంగొనినకొలఁదిని మనసుకరఁగి తద్వర్ణనరూపమున పొంగిపొరలి పైఁబడ ఉంకించుచున్నదే. కానిమ్ము. దీనిని యేల ఆఁపవలె?

సీ. పాలకడలియందు ♦ హాలాహలముతోడ
పుట్టి సుధాంశుఁడొ ♦ నట్టికందు,

యామి—— (పక్కపై పొరలును.)

బిల్హ—— పగలు వేఁడివెలుంగు ♦ సెగచేత పురికొన్న
తాపంబు తీర్పఁగా ♦ నోపుమందు,

యామి—— (లేచును.)

బిల్హ—— వెన్నెలపులుఁగుల ♦ వెన్నెలబోనంబు
పెట్టి తనియఁజేయు ♦ నట్టివిందు,

యామి—— (వినుట అభినయించును.)

బిల్హ—— బాసవాల్గుమి కడు ♦ ఆసతోడుత అర
గించి సంతోషించు ♦ మంచివిందు,

యామి——(సంతోషముతో) ఏమి యీవాక్సుధారసము! నాశ్రవణపుటములలోని
కి ప్రవేశించి, ననవిలుతుని అలుఁగులు తగిలి అలసి సొలసిఉన్న నాకు మరల
బలము కలిగించుచున్నది.

బిల్హ—— సుంగరోద్యానమందిర ♦ బృందమందు
మందయానలఁగూడి ఆ ♦ నంద మొందు
వారి హర్షాబ్ధిఁ దేలించి ♦ పేరుచెందు
కలువగమిపిందు కాఁడె క ♦ న్నులకు విందు? ౪౧

యామి——ఏమి యీచంద్రవర్ణనము! చంద్రుఁడు మందయానలతో కూడిఉన్న
వారిని హర్షాబ్ధిని తేలించునా? అటులయిన, పురుషులతో కూడిఉండు తరు
ణులకును ఆప్రకారమే కావలయునుకదా? ఇప్పుడు నేను విరహిణినై ఉండు
టచేత నేకాఁబోలును నన్ను బాధించుచున్నవాఁడీ అమృతకిరణుఁడు. ఇంతకు
ఈవర్ణనము చేయు పురుషుఁడెవరు కానోపును? మాగురువుగారుగాక యీ
అంతఃపురమునకు మఱియెవరు రాఁగలరు? అయిన, ఆయన అంధుఁడుకదా!
చంద్రవర్ణనము ఎట్లు చేయనోపు? అంధుఁడైననేమి? పండితకవి అగుటచే ఇది
వఱకు తానువినిన గ్రంథములయందలివర్ణనాంశములను కొని యిటు చేయఁ
గలుగుట సులభమే అగును.

బిల్హ—ఆహా!

యామి—మరల వర్ణింపఁ బ్రారంభించుచున్నట్లున్నది. ఆకర్ణింతురుగాక.

బిల్హ—ఎవరుగాని తమకనుకూలమగు కాలమునఁగాక నిజసామర్థ్యాతిశయమును
చూపఁజాలరుకదా.

తరళము. పగలు వారిజబాంధవుండు ప్ర ♦ భావిభాసితుఁడైనచో
మొగులు ముక్కు మొ అంచు ఎంచఁగ ♦ పోలుచుండుఁడి యొడన్
ధగధగద్ధగ కాంతు లీనుచు ♦ తానె లోకము అంతయుఁ
జిగి వెలుంగఁగఁ జేసి యెన్నిక ♦ చెందు; చిత్రము కాదొకో!. ౫౨

యామి—ఏమీ? ఇది పూర్వగ్రంథముల వర్ణనము లేమెఱింగిన అంధుఁడొనరించు
వర్ణనమా? అటు కనఁబడదే. గుడ్డివానికి పగటను రాత్రిని చంద్రరూపము
నందు భేదము కనుఁగొన అలవి అగునా? ఏమో! ఒకవేళ బుద్ధివిశేషము చేత ఆ
విధముగా డూహించిన నూహించి యుండవచ్చును.

బిల్హ—ఔరా! ఏమి యీవింత?

యామి—మరల ఏమొ వర్ణింప మొదలుపెట్టినట్లున్నది. వినెదరుగాక.

బిల్హ—ఉ. గాలిని వచ్చి చేరి పయిఁ ♦ గ్రమ్మినమబ్బులపిండు మళ్లి ఆ
గాలినె పోవుచుండఁగ జ ♦ గాజిగితో వెలుఁగొందు చందురుఁడీ
షోలికఁ దైవశక్తి జన ♦ మున్ పలుబాములు గ్రమ్మిపోవ, ఉ
ద్వేల సుఖాబ్ధిఁ దేలునని ♦ వింతగ తెల్పెడుఁగాదె! బాపురే!. ౫౩

యామి—ఇఁక సందేహమొందవలసినవని లేదు. ఇది అంధవిరచితంబగు వర్ణనం
బు కాదనుట నిశ్చయంబు. అంధుఁడెక్కడ? అప్పటికప్పుడు వాయువశంబు
న వచ్చి మేఘంబులు సుధాకరబింబంబును గ్రమ్మిపోవుచుండుట కని, దానిన
నుసరించి వర్ణించుటెక్కడ? ఈమహాకవిచంద్రుఁడెవరు కానోపును? మాగు
రువుగారు కారనుట నిశ్చయము. కాని, కంఠధ్వనిమాత్రము సరిగా ఆయన
దానివలెనే ఉన్నది. అయిననేమి? లోకములో ఒకరినిపోలినవారు మఱొకరుం
డరా? ఉండినను మఱొకరిచ్చటికి వచ్చుటెట్లు? ఇతఁడెవరో దివ్యపురుషుఁడై
ఉండవలయు. దివ్యపురుషుఁడైన ఇక్కడకు రాకతంబేమి? ఒకవేళ నిన్న
నాకలలో కనఁబడిన నవమోహనాంగుఁడేమో! ప్రొద్దున ప్రమదావనమున

నాకగపడి నాచెలికత్తెలకు కానరాకపోవుటంబట్టిచూడ అతఁడు దివ్యపురుషుఁ
డేఅని నాకు నమ్మకము కలుగుచున్నది. సందేహమెందుకు? చూచెదఁగాక.
కాండపటము అడ్డగాఉన్నదికదా. ఎట్లు చూడఁగలను? (ఆలోచించి) దీని
మీఁదినుంచియే చూచెద. (చూచి సంతోషముతో) అహా! ఏమి నాభాగ్యము!
అతఁడే యితఁడు.

బిల్హ—అన్నా! ఏమిది?

చ. కనులకు విందుగా శశిని ♦ గాంచుచునున్నకొలంది ఏమొ నా
మనమును మారుఁడాఁపినను ♦ మానక లోనుగ చేసి పొర్ద్దటన్
వనమునఁగన్నఆకలికి ♦ పైపరుగెత్తునెనర్చు; ఇంక ఏ
అనువున దీని ఆఁపనగు! ♦ అక్కటా! నాకల నిక్రమానుకో!. ౫౪

యామి—(సంతోషముతో) ఆహా! ఏమినాఅదృష్టము! ౨౨ *

పంచచా. క్షతార్థురాలనైతి వీని ♦ క్షిప్త బాణి నావయిక్
నిరంతరీతిఁ పుట్టి యిట్లు ♦ నిల్వనీయకుండుటన్;
వెతంబడున్ మరుండు తన్ను ♦ వీఁగఁజేయుచుండుటన్;
లతాంతధన్వివట్టు కల్గ ♦ లాభమొందకుందునే?. * ౫౫

బిల్హ—హా! మన్మథా! నీసామర్థ్య మనివార్యముకదా! నేను ఎంత ధైర్యము చూ
పఁబోయినను సాగనీయకున్నావే.

క. మారా! ఇట్టిల చేయుట
మేరా? నిశితప్రదరస ♦ మితి వేసెదవ్రా
కూరా! నాపై మచ్చర
మేరా? నావ్రతముతీర్ప ♦ నీరా; వినురా. ౫౬

అన్నా! ఈచిత్తజుఁడెంతకఠినచిత్తుఁడు? నేను ఎంత మొఱ్ఱపెట్టుకొనినను దాని
ని వెడచెవినిపెట్టి, బోయవాఁడు తన్గిపిట్ట వగవున పొగలుచుండ దానిపిల్లను
అకటికము లేక జిగురుకండెలనుపట్టి బుట్టలో పెట్టుచందమున నాహృదయం
బును తనప్రదరంబులచే పొదివి ఆమదవతియెదయందు దాఁచినాఁడు. ఏమిచే
యుదు? ఓ ఉవిదమిన్న—

యామి—(సంతోషాతిశయమున) అహా! ఇంతదనుక నన్నుబాధించుచున్న
సూనశరుఁడే నాకిప్పుడు సహకారియై నామనోరథ మీడేర్ప నామనోహరుని

ప్రేరేపించుచున్నాఁడు. ఏమియును ఎఱుఁగనట్లే చూచుచుండెద. ( చూచుచుండును. )

బిల్హ—కూడదు కూడదు; ఇటు చేసిన నావ్రతభంగమగును: కాఁబట్టి యీవనితయెంతమాత్రము కూడదు. ధైర్యమవలంబించి ఉండవలయు. ఇట్టియెడ వివేకము చూపనిచో నేనుచదివిన చదువులేల? కావ్యనాటకాల, ఇఁక కామపిశాచమును దూరముగా పాఱఁదోలి దృఢచిత్తతతో నియమితకార్యములు చేయువాఁడ.

యామి—(విచారముతోకూర్చుండి) అయ్యో! ఏమియీమార్పు? ఈయన యింతలోనే మనస్సు త్రిప్పుకొని చేసికొనిన దృఢనిశ్చయము నాప్రమోదనదీప్రవాహంబునకు ఆకస్మికపతితశైలశృంగంబు తెఱంగున నిరోధంబయ్యెఁగదా.

౨౩ * సీ. ఇఁక ఏమిసాధనం ♦ బేమియు తోఁచదే;
అకట! నాఆశ ని ♦ రాశ అయ్యె;
ఇత్తఱి నేఁ గట్టి ♦ యెత్తెత్తుకుండిన
అలరువిల్తుఁడు నన్ను ♦ నిలువనీఁడు;
తేలని అందునా? ♦ కాలాహి అందునా?
పోలవివి; మఱేది ♦ పోలియుండు! (ఆలోచించి)
సరిసరి; నన్ను పి ♦ శాచ మిప్పుడు పట్టి
పీడించునటు మోస ♦ పెట్టుదాన;
తుదకు మంచి ఉపాయమే ♦ తోఁచె; అహహా!
దైవమనుకూలముగ ఉండి ♦ తలఁచుకోర్కి
సఫలముగ చేయునట్టుల ♦ స్వాంత మిపుడు
నిరుపమప్రమోదాంబుధిఁ ♦ దేలు ఏమొ!. * ౫౭

సందేహమేమి? ఈయెత్తుతో ఆశిరుఁడు తప్పక దగ్గఱకు వచ్చితీఱవలయు. మొగమును మొగమును ఎదుటపడిన పిదప అతనిబిగువేమో తెలియవచ్చును. ఇట్లుచేసిన అసత్యమాడినదాన నగుదునుగదా? ఇతఁడు లభింపకున్న కన్యనై ఉండెదఁగాని, ఛీ! నేను అసత్యమాడఁజాల. (కొంతసేపూరకుండి) ఇంతకు దీనిలో అసత్యమేమున్నది? కామపిశాచము నన్ను బాధించుట నిజమేకదా. అనంగుఁడగుటంజేసి కామునకును, పిశాచమునకును భేదమే లేదు. అదియునుగాక నేను తలఁచిన పురుషుఁడు విధివిధానమున నన్ను చేకొనునట్లుచేయ యత్నించుచున్నదానను గాని అధర్మమార్గమున నడవయత్నించుట లేదు. కాఁబట్టి దీనికి వెనుకదీయవలసినపని లేదు. (పరుండి) అయ్యో! నన్ను ఏదోపిశాచము పట్టుకొని బాధించుచున్నది. రక్షింపుఁడు రక్షింపుఁడు.

బిల్హా—(తుల్లిపడిలేచి) ఏమియీఆర్తధ్వని! (నలుగడలుచూచును.)

యామి—చచ్చితి చచ్చితి; ఈపిశాచబాధనుండి నన్ను వేగరక్షింపుఁడు.

బిల్హా—అన్నా! ఏమి యీఉపద్రవము! నావ్రతమునకు అడ్డుగా వచ్చినదికదా. (పైకి) రాజపుత్రీ! నీవు అంతఃపురస్త్రీవి. నేను వచ్చుటకు ఎట్లు వీలుపడును? నియమభంగమగునుగదా?

యామి—(తనలో) ఆహా! ఏమియీనేర్పు! నన్నువలచిన తనకు ఏమినియమభంగమగును? (పైకి) మహానుభావా! చచ్చునపుడు సంధ్యామంత్రమనునట్లు, నేనీవలఁ జచ్చుచుండ నియమమనుచు ఊరకుండెదవా? ప్రాణరక్షణముకంటె ఎక్కువ ధర్మమేమున్నది? రక్షింపుము రక్షింపుము. లేకున్న నిన్ను స్త్రీహత్యాదోషము చుట్టుకొనకమానదు.

బిల్హా—(తనలో) అవును; ఈమాటయు నిజమే. ప్రాణరక్షణముకంటె నియమమెక్కువ కాదు. ఏమయినను సరే; ఈమెను రక్షింపవలయును. రాజకుమారీ! ఇదిగో వచ్చితి; భయపడకు. (తనలో) ఈమెదగ్గఱకు పోవుటెట్లు? కాండపటము అడ్డుగా ఉన్నదే. అయిననేమి? దీనిమీఁదినుండియే పోయెద. (అటుచేయును.)

యామి—చంపెచంపె; వేగము రక్షు.

బిల్హా—వచ్చితి; భయపడకుము. (తనలో) ఇచ్చట విభూతి లేదు; ఏమి చేయుదును? (నలుగడలుచూచి) ఇదిగో! ఇచ్చట పచ్చకప్పురపుపొడి ఉన్నది. ఇదే మంత్రించి నొసట ఉంచెద. (అటుచేసి) ఎట్లున్నది? రాజపుత్రీ!

యామి—నన్ను మృత్యువునోటినుండి తప్పించి రక్షించితివి మహాత్మా! (చూచి, లేచి, దూరముగాపోయి తలవంచుకొని, చిఱునవ్వునవ్వుచు నిలువఁబడును.)

బిల్హా—నృపకుమారీ! నీమనస్సు స్వస్థముగా ఉన్నదికదా? ఇఁక నీకు ఏమియు భయము లేదు. పరుండుము. వెళ్లెద.

యామి—(కడగంటచూచుచు) మహానుభావా! నీవు దివ్యపురుషునివలె కానవచ్చుచున్నావు. భవన్నామహారముగా ఏర్పడినఅక్షరమణులేవో తెలిపి నన్ను ధన్యఁగా చేయ తగు.

బిల్హా—(ఆశ్చర్యముతో) ఏమట్లనియెదవు? నేను నీగురువునగుబిల్హణుఁడనుగాని మఱి యేదివ్యపురుషుఁడను కాను.

యామి—మహాత్మా! నన్నేల మోసము చేయచూచెదవు? నీనామమంత్రము ఉపదేశింపుము. నాజీవితకాలమంతయు జపించుకొనుచుండుదాన.

బిల్హ——ఏమి మరల అట్లే అనెదవు? రూపమునుపట్టి కాకపోయినను, కంఠధ్వనినిపట్టి అయిన నన్ను నీగురువునని తెలిసికొననేరవా?

యామి——(నగుచు) దివ్యపురుషులకేమి అసాధ్యము? ఇతరుల రూపము తాల్పఁ గలిగినప్పుడు కంఠధ్వనిమాత్ర మనుకరింపలేరా? దేవా! నీవు మాగురువుగారు కాకుండుట నిశ్చయము.

బిల్హ——(తనలో) ఏమిది? ఈమె తాఁబట్టిన కుందేటికి మూడే కాళ్లనునట్లు వాదించుచున్నదా? ఇందులకు మఱేమైన ఆధారము కలదా? అదియు నిదియుఁ గాక యిదంతయు మోసమా? ఏమని నిశ్చయించుటకును నామనస్సునకు ఇంతయేని పాలుపోకయున్నది. (పైకి) కన్యామణీ! నేను నీగురువును కానని చెప్పుటకు నీకేమైన ఆధారమున్నదా?

యామి——(సంతోషముతో) లేకపోవుటయేమి? కావలసినంత ఉన్నది.

బిల్హ——(ఆశ్చర్యముతో) ఏమది? కొంచెము చెప్పుము.

యామి——మాగురువుగారు అంధులు.

బిల్హ——(సంభ్రమముతో వెనుకకుతగ్గి తనలో) ఏమిది? ఇదంతయు మిక్కిలి వింతగా నున్నది. (ప్రకాశముగా) ఎవరు చెప్పినారు నీగురువంధుఁడని?

యామి——ఎవరేల చెప్పెదరు? మానాయనగారే చెప్పినారు.

బిల్హ——(ఆశ్చర్యముతో) ఏమీ! మీనాయనగారా చెప్పినారు? యథార్థమేనా?

యామి——మహాత్మా! మీరు అనుమానింపనక్కఱలేదు. ఇందులో అసత్యమేమియు లేదు.

బిల్హ——(యామినీపూర్ణతిలక శరీరము పరికించి, ఆలోచించి, తనలో) ఇది రాజు చేసినపనివలెనే ఉన్నది. ఈమె కుష్ఠరోగిణిఅని నాతో చెప్పె. కాని యీమెయందు ఆరోగముమాత్ర మేమియు కానరాదు. అట్లే నేను అంధుఁడనని యీమెతో చెప్పఁగాఁబోలు. ఇందులకు కారణమేమైయుండును? (యోచించి) మఱేమి? పరస్పరానురాగభయమే. అది ఉండవలసినదే.

యామి——దేవా! ఏమి? ఇప్పటికైన ఒప్పుకొనెదవా?

బిల్హ——దానితో నాకేమిపని? నేను పోయెద. (వెళ్లఁబోవును.)

యామి——(విచారముతో) న్యాయమా యిది?

బిల్హ——(తిరిగి) న్యాయము కాక నాయెడ అన్యాయ మేమున్నది?

యామి— ౬౪ * క. అన్యాయమె లేదా? హా!
కన్యానవమదన! ఇంత ♦ కఠినత తగునా?
బిల్హ— కన్యామణి! దూఱక యే
మన్యాయము చేసినాను ♦ అయ్యది చెపుమా.

యామి—ఇదిగో! చెప్పెద; వినుము.

సీ. మన్నింపవే నన్ను ♦ కొ్రిన్ననవిల్తుని
చెన్నుతగ్గఁగ నీవు ♦ నిన్నరాత్రి?

బిల్హ—(కోపాశ్చర్యములతో)

అనుచితపుమాట ♦ లాడుట పాడియా?
కంట నిన్ కననైన ♦ కంటినె? అహా!

ఇది నిజమా? కలా?

యామి—అంతవఱకు కలే.

నేఁడుదయంబున ♦ నీవు వనంబున
చూడరా లేదె నన్? ♦ సుమశరాభ!

బిల్హ— వనమునకున్ నేను ♦ చనుదెంచితినిగాని
నిను కనుటకు కాదు; ♦ నిజము; నమ్ము;

యామి— అప్పుడయినట్టిదంతయు ♦ అరయనేల?
ఇపుడు నను కావ రా లేదె? ♦ ఎమ్మెకాఁడ!

బిల్హ— ఇపుడు నినుకావ నే నిట ♦ కేగుదెంచు
టే, అహా! తప్పఁటందువా ♦ యేమి? చెపుమ. * గీ

యామి—యువతీనవమన్మథా! నన్నిప్పుడు విడిచిపోవుట తప్పనియెదను గాని, అంతకుముందు చేసినదేదియు తప్పనఁజాల.

బిల్హ—రాజకుమారీ! నీవేమో మనసులో ఉంచుకొని మాటలాడుచున్నావు. కూడదు కూడదు. నేనును ఇక్కడ ఉండ కూడదు. పోయెద. (పోఁబోవును.)

యామి—(తనలో) ఈయనమనస్సు రాయా? వజ్రమా? (పైకి) మహానుభావా! వచ్చినపని సఫలముచేయక పోవుట తగునా?

బిల్హ—సఫలము చేయక పోవుట యేమి? నీపిశాచభయమును పోఁగొట్టితినిగదా.

యామి—కొంతవఱకేకాని నిండుగా కాదు.

బిల్హ—ఏమట్లనియెదవు?

యామి—ఎదుట ఉన్నంతవఱకే వదలునట్లగవడునుగాని వెనుకతిరిగిన వెంటనే నన్నావహించును.

బిల్హ—నేను విభూతిపెట్టినతరువాత నిన్నే పిశాచము చేరఁగలదు?

యామి—మఱొక పిశాచము చేరలేకపోయిన చేరలేకపోవచ్చునుగాని కామపిశాచముమాత్రము నిర్భయముగా నన్నిప్పుడే చేరవచ్చుచున్నది. రక్షింపుము రక్షింపుము. (దగ్గఱకుపోవును.)

బిల్హ—(ఆశ్చర్యముతో వెనుకకుతగ్గి) ఏమీ! నిన్నువట్టినది కామపిశాచమా? నేను దీనిని వదల్పఁజాల. నాకును భయమగుచున్నది; నావద్దకు రాకుము.

యామి—మహాత్మా! నీవే యిట్లనిన నాకు మఱియెవరు దిక్కు?

౨౫ * సీ. నన్ను కావుమ దయన్ ♦ నన్ను కావుమ దయన్
క్రూరుఁడౌమారుని ♦ బారినుండి;

బిల్హ— ఇటుల పల్క తగునె? ♦ ఇటులపల్క తగునె,
అక్కటా! గురువని ♦ అరయక మది?

యామి— ఏల నన్ వేఁపఁగ? ♦ చాలు నాపై పగ;
జాలి పుట్టదె? ఇస్సె ♦ కాలమేగు;

బిల్హ— ఏమి? నన్ దివ్యగా ♦ ఎంచుచున్నావె?
నేఁ గాను; నమ్ముము; ♦ నీగురుండ;

యామి—(వెనుకకుతగ్గి) ఏమిది?
అందమునువట్టి దివ్యుఁడ ♦ వని తలఁచితి;
నిక్కముగ చెప్పు గురుఁడవే ♦ నీవు వేగ;

బిల్హ— నే మఱేదివ్యుఁడను కాను; ♦ నీగురువునే;
ఏమి? ఇటువంటిభ్రమపొంది ♦ యిటు సలిపితి? * ౬౦

యామి—(విచారముతో తనలో) ఆహా! నేనెంతబేలనైతిని? ఇంతదనుక ఇతఁడెవరో దివ్యపురుషుఁ డనుకొంటిని. ఇప్పుడేమి చేయుదును? గురువును వరించుట న్యాయమా? గురువని యెఱుఁగక యీయననే మనస్సున వరునిగా కైకొని మ

తొకనిని చేపట్టుట న్యాయమా? ఏది కర్తవ్యము? మనస్సున ఒకనిని భర్తగా కొని మఱొకని వరించుటకంటె, గురువని యెఱుఁగక మఱొకరే అనుదృఢనిశ్చయముతో పతిగా మదినెంచినవానిని చేపట్టుటే అన్నివిధముల న్యాయమని తోఁచుచున్నది. ఇది దైవవశమున జరుగుచున్నదిగాని యింగునాదోష మేమియు లేదు. దైవసంకల్పమే కానిచో, అదివఱకెప్పుడును కనిఉండని యీయన నాకలలో కనఁబడుటెట్లు? దాని కుపబలముగా ప్రత్యక్షముగా నాకేఉద్యానవనమున కనఁబడుట యెట్లు? కాన దీనికై యిప్పుడు వగవ పనిలేదు. గురువైనను, ఈయనే నాకీజన్మమున భర్త; ఇది నిశ్చయము.

బిల్హ—రాజపుత్రీ! ఇప్పటికైన నీభ్రమ వదలినదా?

యామి—(తనలో) ఈయన గురువని తెలియుటచే నామనోనిశ్చయమునుగూర్చి మాటలాడుటకు సిగ్గగుచున్నది. అయినను ఉన్నసంగతి యెఱిఁగింపక తప్పదు. (పైకి) మహానుభావా! మీరు నాపూర్వపుగురువులే.

బిల్హ—(ఆశ్చర్యముతో) ఏమీ! పూర్వపుగురువులా? ఇప్పుడు కానా? మీతండ్రి తప్పింప లేదే.

యామి—మాతండ్రిగారు తప్పింప లేదుగాని దైవము తప్పించె.

బిల్హ—దైవ మెట్లుతప్పించు?

యామి—(సిగ్గుతో మెల్లఁగా) నామనోహరునిఁగా చేసి,

బిల్హ—(సంభ్రమముతో వెనుకకు తగ్గి తనలో) ఆహా! ఏమిది? నాకల నిజముగను కాఁబోలును.

గీ. ఈమె కుష్ఠరోగిణి అని ♦ యేను అంధుఁ
డనని ఒండొరులకు చెప్పి ♦ మనుజవిభుఁడు
మానుపన్ చూచె మామోహ; ♦ మైన దైవ
మెట్టులొనరించె? ఏమని ♦ యెంచువాఁడ?. ౬౧

(ఆలోచించి, పైకి) రాజకుమారీ! ఒకమాట. అంధునిచూడరాదనునియమ మేదేని నీకు కలదా?

యామి—కలదు.

బిల్హ—సరే. అల్పబుద్ధులగుమానవులు తామేమో తమసామర్థ్యంబువలననే సర్వకార్యంబులు జరిగించుచున్నామని విఱ్ఱవీఁగెదరు. ఇంతకంటె వెఱ్ఱితనమున్న

దా? రాజును మంత్రియును కలసి తమబుద్ధిచాతుర్యంబుచూపి, మాకిరువురకును పరస్పరానురాగంబు కలుగకుండ మానియుమానుకూలంబుగా మాయందు లేని లోపములు కల్పించి, చేతనైనంత జాగరూకత కనఁబఱిచినారు. అయినను తుదకేమయినదో చూడుఁడు. కలలో కని నన్ను ఈమె వలచె. తలఁపనితలఁపుగా ఈమెను కని యెంత ధైర్యము చూపఁబోయినను కొంతవఱకు నేనును మదనునికి లోనైనవాఁడనైతి. ఈమెమీఁద మోహపడకూడదని మనస్సును ఎంతదృఢపఱుచుకొనుచున్నను గాజెక్రిందియెలుకవలె మన్మథుఁడు దానినొకవైపు తొలుచుచునే ఉన్నాఁడు. ఆహా! దైవబలమే బలము. ఇష్టముకానిపనినైనను ముక్కుపట్టి యీడ్చుకొనిపోయి చేయించును. అయినను, పౌరుషలోపము కలుగనీయరాదు. కాన నేను చేయవలసినదంతయు చేసియే చూచెద. (పైకి) రాజతనయా! ఇందాఁక ఏమంటివి? దైవ మెట్లు తప్పించె?

యామి—(తనలో) నాహృదయమువలెనే యీయనహృదయమును అనురాగసందేహంబులకాస్పదంబై ఉన్నట్లు తేటపడుచున్నది. నాకు లజ్జాకరంబుగా ఉన్నను మాఱుచెప్పకుండుటకు వీలులేదు. (పైకి) భూసురశిరోమణీ! నామనోహరునిగా చేసి—

బిల్హ—(కోపముతో అడ్డువచ్చి) ఆఁ *

ఉ. న్యాయమె నీకు ఇట్టినుడు ♦ లాడుట? ముందును వెన్క కానకే
కాయజుచిక్కులన్ తగిలి ♦ జ్ఞానమువీడితి వక్కటక్కటా!
హేయములైన సౌఖ్యములె ♦ యెంచి యశస్సును మంటఁ కల్పెదే?
నీయెద గట్టిచేసికొని ♦ నీఅవివేకము మాను మిప్పుడేన్. ౬౨

నీచదివినచదువులేమయ్యె? గురువునని కొంచెమైనను సంకోచింపక మనోహరుఁడనని పల్క ఎట్లు తెగించితివి? ఎవరైన వినిన ఏమనియెదరు? చాలుచాలు; నీ చిన్నతనపుచేష్టలిఁక చాలింపుము. బుద్ధికలిగి నడచుకొనుము. *

యామి—(తనలో) ఆహా! మనుష్యస్వభావవైచిత్ర్యము! ఈయన తనమది మదనప్రదరవిదళితమగుచున్నను పైకి గాంభీర్యము చూపుచున్నాఁడు. ఇదియు శ్లాఘనీయమే; అయినను విధినిర్ణయంబు దుస్తరంబుకదా. ఇప్పుడు నాయథార్థస్థితి యెఱిఁగింపక తప్పదు. కాన ఎఱిఁగించుదాన. పిమ్మట దైవనిర్ణయమెట్లుండునో అట్లగును. (పైకి) మహాత్మా!

౬౨ * సీ. మొదట నాస్థితి విను; ♦ పిదప నిందింపుము;

బిల్హ—(తనలో) ఇది దైవవశమున జరుగుచున్నదిగాని వేరు కాదు.
(పైకి) అది యేదో తెలుపుమా; ♦ ఆలకింతు;

యామి— మదనునికిఁ జిక్కి ♦ మాత్ర మిట్టుల చేయ;
ధర్మంబు విడ వెట్టి ♦ దాన కాను;

బిల్హ— అటులైన నీస్థితి ♦ ఆరసి చూచెద;
ఉన్నది ఉన్నట్లు ♦ ఎన్నిచెపుమ;

యామి— కలకనినంతనే ♦ వలచి నిన్ భర్తగా
తలఁచితి గురువను ♦ తలఁపె లేక;

బిల్హ— తెలియనప్పుడటుల ♦ తలఁచుట సరిగాని
తెలిసినప్పుడటుల ♦ తలఁప తగునె?

యామి— మనసున ఒక్కని ♦ పెనిమిటిగా కొని
వెనుక మఱొక్కని ♦ ఎనయ తగునె?

బిల్హ— తగక ఉండుట నిజమైన ♦ తనగురువునె
మగనిఁగ వరింప చూచుట ♦ తగునె? మగువ!

యామి— తగక ఉండిన పోనిమ్ము ♦ దాన ఏమి
పోవు, నాప్రాణ మొకటియే ♦ పోవుఁగాక? * ౬౩

మంచిది; తమరేమియు ధర్మము తప్పనక్కఱ లేదు. ఇఁక దయచేయుఁడు. తెలివితక్కువదాన. మీకు చాల శ్రమ యిచ్చితి; క్షమింపుఁడు. ఇదివఱకే చాల తొందరపడినారు. శీఘ్రముగా దయచేయుఁడు. (వెదకుట అభినయించును.)

బిల్హ—అయ్యో! ఈమె విరక్తికి దిగి యిటులనుచున్నది. ఏమి చేయునోకదా! స్త్రీలకు సాహసమెక్కువ; అందులో ఈమె రాచబిడ్డ.

యామి—(త్రాడు చేతఁబుచ్చుకొని) మహానుభావా! ఇంకను తమకిక్కడ ఏమిపని? శీఘ్రముగా విచ్చేయుఁడు. నేను మృతినొందుచుండ చూచుట నేత్రోత్సవముగా నేని చూడవచ్చును. (కంఠమునకు త్రాడు తగిలించుకొనును.)

బిల్హ—(తనలో) ఆహా! దైవనిర్ణయము దుస్తరముకదా! ఇప్పుడు నేనూరకుంటి నేని స్త్రీహత్యాపాతకము చుట్టుకొనక మానదు. కాఁబట్టి యీమె ఆత్మహత్య

చేసికొనకుండ ఆఁపవలయు. (దగ్గఱకు వెళ్లి) ఆఁగుమాఁగుము; నీయిష్టము వచ్చినట్లే నడచుకొనువాఁడ.

యామి—(కోపముతో) ఏమియు అక్కఱలేదు; దూరముగా ఉండుము.

(ఉరిపోసికొనును.)

బిల్హ—(చేయిపట్టుకొని, త్రాడు లాగిపాఱవేసి)

క. తగునా యీరీతిఁ దెగిం
పఁగ నామాటయు రవంత ♦ పాటింపక యే
పగ నాపై పూనిన ఏ
మగు నాగతి? ఇంత తెగువ ♦ అర్హమె? లలనా!. ౬౭

యామి—(చేయివిడిపించుకొని దూరముగాపోయి) పాపము! ఇప్పటికి దయవచ్చినది కాఁబోలును.

బిల్హ—ఓహో! ఏమి యీమందయాన సౌందర్యము!

సీ. తుమ్మెద ఱెక్కయొ ♦ తమ్ములో నల్లఁద
నమ్మును సోగఁద ♦ నమ్ముఁ గూర్చి,
చందురునందలి ♦ క్రొందమ్మియందలి
అందంబుఁ బొంది కిం ♦ పొంద చేర్చి,
చూడవేడుక కల్గు ♦ లేడికన్నులలోని
పోఁడిమిఁ నాఁడిమిఁ ♦ కూడ దార్చి,
మంచియుంచుగడను ♦ మించు తీపితనము
మించరానివలను ♦ సంచుఁ పేర్చి,
ఈమగువమిన్న పెన్నెఱుల్, ♦ మోము, కన్నుఁ
గవయు, ముద్దులమాటలుఁ ♦ కాము తోడు
చేసికొని చేసె ఆకమ ♦ లాసనుండు;
కానిచో, ఇట్టి సొగసెందు ♦ కాన నగునె? ౬౮

ఇట్టి అసమానతనూవిలాసంబున నాసికాంత ఈసతీవతంసంబును నిజవంశసంజాతుండనగు నాకు కూర్పవలయునను ప్రేమచేత నే కాఁబోలు ఆనరసీరుహసంభ

పుండిట్లొనరించినాఁడు. సిరి రా మోఁకాలొడ్డుచెనఁటితనము కూడునా? సుందరీ! ఏమిట్లు దూరముగా పోయెదవు? (చేయిపట్టుకొనపోవ యామినీపూర్ణతిలక తప్పించుకొని దూరముగా పోవును.)

౨౮ * సీ. కోపమా నామీఁద? ♦ రూపనూతనరతీ!
స్మరుబాధ కేఁ తాళఁ ♦ జాల ఇంక;

యామి— తొందరపడనేల? సుందరీకందర్ప!
మావారొసఁగుదాఁక ♦ మనసు నిలుపు;

బిల్హ— మీతండ్రి దీనికి ♦ ప్రీతి నొప్పుకొనునె?
న్యాయమౌపనికి భ ♦ యంబువలెనె?

యామి—(తనలో) అవును; ఇదియు నిశ్చయమే కాని స్వతంత్రత నీతి అగునా? ఇఁక ఏమిసాధనము? (పైకి)

పెద్దలొప్పనియెడ ♦ పెండ్లి యెట్టుల న్యాయ
మగును? నాఅనుమాన ♦ మణఁప తగును;

బిల్హ— చాన! నీధర్మబుద్ధికి ♦ సంతసంబు
కలుగు; నేఁ ధర్మమును దాఁటఁ ♦ తలపడుదునె?

యామి— అట్టులనఁజాల కలనైన; ♦ అయిన నాదు
సంశయము బాధపెట్టెడు; ♦ సరగ తీర్పు. ౬౬.

బిల్హ—సుందరీ! నిన్ను సందేహజాలంబున కట్టి బాధింపనేల? విను.

క. మనములు కలసినపురుషులు
వనితామణు లొండొరులను ♦ వలపుబలిమిఁ జే
కొనుటయె గాంధర్వము నా
చను ఒకపరిణయము; శాస్త్ర ♦ సమ్మతము సుమా. ౬౭

యామి—అటులయిన సరే.

బిల్హ—(యామినీపూర్ణతిలక చేయిపట్టుకొని)

పంచచా. పరస్పరానురాగశక్తి ♦ పాటిచేసి స్వేచ్ఛగా
పరాత్పరుండు సాక్షిగా వి ♦ వాహమాడువార మో
సరోజపత్త్రనేత్ర!; మోహ ♦ సంపదన్ తనర్చుచున్
నిరంతరంబు సౌఖ్యమొందు ♦ నిష్ఠ నుండఁగా వలెన్. ౬౮

మనోహారిణీ! దైవసాక్షిగా నేను నీవాఁడ. (చేతిలో చేయివేయును.)

యామి—మనోహరా! దైవసాక్షిగా నేను నీదాన. (చేతిలో చేయివేసి నమస్కరించును.)

బిల్హ—(లేవనెత్తి కౌఁగిలించుకొనఁబోవును.)

యామి—(తప్పించుకొనును.)

బిల్హ—సుదతీ! నీహృదయమెంత కఠినము? ఇంకను నన్ను బాధించెదవా?

౨౯ * గీ. సూనశరశరములచేత ♦ నుఱ్ఱికినాఁడ;
మానితాధరామృతము వే ♦ ఆననిచ్చి,
పూలగుత్తులతోడుత ♦ పొల్చుతీఁగ
మించుమేను నామేనఁ గీ ♦ లించి, కావు. ౬౯

(చేయిపట్టుకొనును.)

[తెరపడును.]

శ్రీ

# బిల్హణీయము.

## చతుర్థాంకము.

రంగము:—అంతఃపురప్రాంతము.

[కళావతీచతురభాషిణులు వెనుకకు తిరిగి చూచుచు ప్రవేశింతురు.]

చతు—కళావతీ! మనసఖివృత్తాంతము తలఁచుకొనిన నాకేమో భయమగుచున్నది.

కళా—ఓసీ! భయమెందుకు? ఇప్పటికి ఈసంగతి మనకిరువురికిని తప్ప మఱొకరికి రవంతైనను తెలియదుకదా. కావున మనకు మిత్రద్రోహచింత లేనియెడల ఆమె కావంతయు అపాయము రాదు.

దాసి—(ప్రవేశించి) ఆఁ; వీరు ఇక్కడనే ఉన్నారు. యామినీపూర్ణతిలక, నేనొక నాఁడు ఉద్యానవనమున వనపాలకునితో నవ్వుచు-కేరుచు-ముచ్చటించుచుండుటచూచి, తనతండ్రితో చెప్పి, నాప్రియుఁడగువానిని నన్నును దండింప చేసినది. నాఁటినుండియు ఆపగ మనస్సులో పెట్టుకొని, ఆమెయందుఁగాని, ఆమెచెలికత్తెలయందుఁగాని నేర మేమైన దొరకునాఅని చూచుచున్నదాన. నేఁడేమో వీరిద్దఱును నడుమనడుమ వెనుకకు తిరిగిచూచుచు-ఏకాంతముకోరి తిరుగుచుండుటచూచి, సంగతియేమో కనుఁగొందమని, వీరివెంటఁబడినదాన. వీరును ఇప్పుడు చుట్టుపట్ల ఎవరును లేరనుతలంపున మనస్సులోనిది పైకి క్రక్కుకొనియెదరు; నేనిచట పొంచియుండి వినవలయును. (పొంచియుండును.)

చతు—ఆమెను మనము ప్రాణముగా చూచుకొనుచుండునపుడు మనయిరువురివల్లను ఆమెకు భయమెట్లు కలుగును? అది నిశ్చయమే. కాని, దాసీజనుల కెవరికైనను తెలిసినయెడల ఏమగునో అని నామనస్సు బితుకుబితుకులాడుచున్నది. వాండ్రలో మనసఖి దండింపచేసినదాసిచెవినిపడిన తప్పక కీడు కలుగును. అది పగపట్టిన త్రాఁచుపామువంటిది.

దాసి—(సఖులను ఉద్దేశించినట్లు) అవును; ఆమాటయు నిజమే. నేను పగపట్టిన పామువలెనే మీవెంట తిరుగుచున్నాను. ఇప్పటికి నాఅదృష్టమువలన నాపగ తీర్చుకొనుసమయముకూడ లభించునట్లున్నది. (తనలో) వీరు తమసఖినిగూర్చియే ముచ్చటించుచున్నారు. తమకు తప్ప ఇతరులకీసంగతి తెలిసిన ఆమెకు అపాయము కలుగునని భయపడుచుండునట్లు ఈచతురభాషిణిమాటలవలననే తేటపడినది. ఆసంగతియేమో తెలిసికొనవలె.

కళా—చతురభాషిణీ!

౨౦ * సీ. మాను నీభయ మింక ♦ మానుమా; ఆదాసి
చెలి కేమపాయంబు ♦ చేయఁగలదు?

చతు— ఏమి నీనిబ్బర? ♦ మేమియో తెలియదు;
నామది వగ తీఱ ♦ నమ్మ చెప్పు;

కళా— ఈరహస్యము మన ♦ మిరువురము గాక
యితరు లెవ్వ రొకింత ♦ యెఱుఁగరుకద;

చతు— ఇదియేన? ఇంక మ ♦ ఱేమైన ఉన్నదా?
ముదమొదవఁగ వేసన్ ♦ ముదిత! చెపుమ;

కళా— గొలుతనె భవాని మనచెలి ♦ కలను ఇతఁడె
చెలువుఁడగునంచు ఆమెకు ♦ తెలుపలేదె?

చతు—(సంతోషముతో)

అవును; మఱచితి; మనచెలి ♦ అటులె చెప్పె;
వగవనేల యిఁక భవాని ♦ వరము కలుగ?. * ౨౦

దాసి—(సంతోషముతో) ఆఁ. రాకుమార్తెకు ఎవఁడో ఒకచెలువుఁడు జతపడినట్లు స్పష్టమైనది. కాని అతఁడెవఁడో పేరేమో తెలియరాలేదు.

చతు—కళావతీ! భవానీప్రసాదమువలన చివరకు మనచెలికి ఏయపాయమును రాదనునమ్మకముచేత మనస్సునకు సంతోషమగుచున్నది; కాని, గురువును కూడెననులోకాపవాదము కలుగునేమో అనిమాత్రము భయమగుచున్నది. లోకులలో కాకులలో అనుసామెతరీతిని మంచిచెడ్డలు విచారింపక నిందించుట లోకస్వభావముకదా,

దాసి—మంచిపెద్దలతో నాకేమిపని? గురువును తగులుకొనినదా రాచకూఁతురు! మంచిది. నా పగ తీర్చుకొనెద. తరువాత ఏమైనను ముందు దానిని నిందించుటకు నాకు ఆధారము దొరకినదికదా.

కళా—చతురభాషిణీ! మూఢులగు జనులు నిందించిన ఏమి? చేసినపని ధర్మానుకూలమని అంతరాత్మ ఒప్పుకొనిన చాలదా? చేసినది అధర్మమని ఆత్మ యేవేళను హృదయశల్యమై బాధించుచుండిన చింతింపవలయునుగాని మూర్ఖమానవులనింద లెక్కింప నక్కఱలేదు. చాలవేళ అయినది. పోదము; రమ్ము.

చతు—ఆఁగుమాఁగు; మఱొకమాట.

కళా—ఏమది?

చతు—ఈమె కిప్పుడే నెల తప్పినదికదా; ఈరహస్యము దాఁచుటెట్లు?

కళా—భయములేదు. మన యీసంగతి మెల్లఁగా రాణిగారితో చెప్పిన, ఆమె రాజుగారిని ఒడంబఱిచి త్వరతోనే వివాహము చేయింపఁగలదని నాకు గట్టినమ్మకము కలదు. ఆలస్యమేల? ఇప్పుడే ఆమెదగ్గఱకు పోదము; రమ్ము. (చతురభాషిణితో పోవును.)

దాసి—(పైకివచ్చి) ఊఁహూఁ! నెలకూడ తప్పినదా? అయిన ఈవ్యవహారము చాలదినములనుండి జరుగుచున్నదికాఁబోలును. కానిమ్ము. ఇప్పుడే యీనెవగుపు తీసికొనెద. మీరు రాణికి ఈసంగతి చెప్పకమునుపే నేను రాజుతో ఈవృత్తాంతమంతయు చెప్పెద. ఆయన ఆబాపనయ్యను చంపించిన, ఈఅమ్మ కలకాలమును ఏడువవలసినదే. కానీ; దీనికి ఈశాస్తి కావలసినదే, నాకపకారము చేసిన నే నూరకుందునా? ఏమిచేయించెదనో చూడుఁడు. (వడిగా వెళ్లును.)

---

రంగము:—కారాగృహము.

[చెఱసాలలో ఉండి విచారించుచుండు బిల్హణుఁడును, పండుకొనియుండు కాపరియును ప్రవేశింతురు.]

బిల్హ—అకటా! విధివిధానంబు మీఱ ఎవ్వరికిఁగాని తరంబుకాదుకదా. మందబుద్ధులగు మనుజులు, తాము చేయుపని ఒకచో దైవానుకూలతచేత ఫలించిన, అది తమ ప్రయోజకత్వంబుచేతనే అయ్యెనని మిన్నును మన్నును కానక విఱ్ఱవీఁగుచుందురు. ఆపదలు సంభవించినప్పుడు అవి దైవకృతంబులని యెంచి నిందిం

చుచుందురు. అంతకు దైవమే ప్రధానమనిమాత్రము ఎప్పుడును తలఁపరు. దైవా నుకూలత లేనిచో పౌరుషం బెంత? గ్రుడ్డిగవ్వకైనను కొఱగాదుకదా? కాకున్న ఈసాయంకాలము తలఁచిన దేమి? ఇప్పుడైన దేమి?

చ. జరిగినదంతయుఁ సఖులు ♦ చాతురిఁ రాణికి జెప్ప, ఆమె భూ
వరునకు దెల్పి వేగమె వి ♦ వాహము చేయ నెనర్తు నంచనన్, *
కరము చెలంగుచో ఉఱుము ♦ కల్గని పిడ్గు తెఱంగునన్ చెఱఁ
జొర వలసెన్; తలంప కడు ♦ చోద్యము దైవకృతంబు లక్కటా! ౨౧

ఇంక ముందేమికానున్నదో రవంతయు మనంబునకు గోచరంబుకాదు. ఇంతకు నాయెడ దోషంబేమియు లేదుకదా.

[తెరలో]

యామి—హా! ప్రాణేశ్వరా!

బిల్హ—(వినుటనభినయించి) అయ్యో! నాకొఱకు ఆకాంతామణికూడ విలపించుచు వచ్చుచున్నట్లున్నది. ఏమి చేయుగలను?

యామి—(ప్రవేశించి) హా! ప్రాణేశ్వరా! (కళావతిమూఁపుపై తలఉంచుకొని, వెంటనే) సఖీ!

౩౧ * సీ. ప్రాణేశ్వరుం డెట ♦ వసియించుచున్నా డట
ప్రాణముల్ విడిచెద; ♦ త్వరగ నడుపు;

కళా— సఖి! దగ్గఱకు ఇదే ♦ చనుదెంచినారము;
అకట! నీవిట్టుల ♦ అడల చనునె?

యామి— అడలకు మంచును ♦ నుడివెదవే కాని
ఒడలిజీవంబులు ♦ విడువవు కద;

కళా— మానినీ! ధైర్యంబు ♦ పూనక యీమాడ్కి
మానరానివెతను ♦ గ్రుమ్మ తగునె?

యామి— బొందిలోనుండి ప్రాణంబు ♦ పోవుదాఁక
ఇటుల పొగలుటగాక మ ♦ రేమొనర్తు?

కళా— అన్నియు ఎఱింగి నీవిట్టు ♦ లనుట తగునె?
వగను మ్రింగి నిబ్బర మూన ♦ వలయుఁగాని. * ౨౨

యామి—ఏఁడీ? నాప్రాణేశ్వరుఁ డెక్కడ? చూపుము.

కళా—అదిగో! అచ్చట. (చేతితో చూపును.)

యామి—(తొందరగావెళ్లి) హా! ప్రాణేశ్వరా! (చెఱసాలవాకిటిముందుపడును.)

బిల్హ—కళావతీ! చూచెదవేమి? లేవఁదీయుము. అయ్యో! ఈమనోహరాంగిని ఇచ్చటికేల తీసికొనివచ్చినావు? లేవఁదీయుము.

కళా—(యామినీపూర్ణతిలకను లేవఁదీయును.)

యామి—(లేచి, బిల్హణుని చూచి)

3౨ * సీ. ఎంతటిదుస్థితి ♦ యిపుడు తటస్థించె
హృదయేశ! నీకు నా ♦ స్నేహమునను?
బిల్హ— నాపూర్వకర్మంబు ♦ నంజేసి యిటులగు;
నీస్నేహమున కాదు; ♦ నిజము; నమ్ము;
యామి— నిర్భాగ్యురాలను ♦ నిన్నిప్పు డిటువంటి
దుర్భరకష్టాబ్ధిఁ ♦ ద్రోసితి అహా!
బిల్హ—అటుల తలఁచిన,
చెలువరో! ననుఁగూర్చి ♦ చింతింప పనిలేదు;
ఖలుఁడ నేన నీకష్ట ♦ కారణంబ;
యామి— అకట! నిన్ను విడిచి ♦ ప్రాణంబుతో ఉండఁ
గలనె? ప్రాణనాథ! ♦ సెలవొసంగు;
బిల్హ— అతివ! ఇటు లధైర్య ♦ మందక యుఁకనాదు
నెయ్యమెల్ల మఱచి ♦ నెమ్మినుండు. * ౬3

యామి—నన్ను నేను మఱచినపుడుకదా నిన్ను మఱవఁగలుగుట? హా! ప్రాణేశ్వరా! అందుకు అనుజ్ఞయిమ్ము.

భటుఁడు—(ఉలికిపడి కన్నులు నులుపుకొనుచు లేచి) ఏమి యీసందడి? (చూచి, లేచి) అన్నా! ఎంతపని జరిగినది? ఈమె యీయర్ధరాత్రమున ఇచ్చటికి వచ్చినది. రాజుగారు ఇక్కడకు ఎవ్వరిని రానీయవలదని సెలవిచ్చినారు. ఇఁకనైన వెంటనే పంపివేయవలెను. లేకున్న నాకంఠముమీఁదికి వచ్చును. (పైకి) అమ్మా! మీ రిచ్చట ఉండకూడదు; వెళ్లుఁడు; రాజుగారు ఇక్కడకు ఒక పిట్టనైనను రానీయవలదని సెలవిచ్చినారు; వెళ్లుఁడు.

కళా—ఆరక్షకా! తొందరపడకుము. ఇదిగో! (హారము తీసియిచ్చును.)

భటు—(ఇటుఅటుచూచుచు హారముదాఁచుకొని) మంచిది. మీరు త్వరగామాత్రము వెళ్లవలయును.

కళా—ఇవిగో! ఇదికూడ ఇచ్చెద. (హారము చూపుచు) చెఱసాలతలుపు తీయుము.

భటు—ఊఁహూఁ; ఇది మాత్రము నాచేత కాదు. నీహారమునకు ఒకనమస్కారము. నీకు ఒకనమస్కారము; నాప్రాణముమీఁదికి వచ్చును. (దూరముగా పోవును.)

కళా—వీఁడిందులకు ఒడఁబడినాఁడు కాఁడు. ఏమి చేయుదును? నాచేతనయిన ప్రయత్నము చేసినదాన.

బిల్హ—ప్రాణేశ్వరీ! ధైర్యమవలంబింపుము. నాహితోపదేశము వినుము.

సీ. మనమీఁద కొండెముల్ ♦ మహిపతితో చెప్పి
  నట్టివారలమీఁద ♦ అలుగ వలదు;
ధర్మమెంచక నన్ను ♦ దండించెనని నీవు
  పితృభక్తి ఒకింత ♦ విడువ వలదు;
వారు వీరును అడ్డు ♦ పడినారు కారని
  యెవరి ననూయతో ♦ ఎంచ వలదు;
నాగతియేమైన ♦ నను బొత్తిగా మఱవ
  వలయుఁ గాని రవంత ♦ తలఁప వలదు;
దైవచింతన మెప్పుడున్ ♦ తప్ప వలదు;
ధర్మమార్గము ఏయెడ ♦ దాఁట వలదు;
నీవు నాపైని ప్రేమంబు ♦ నెఱపుదేని
బలువలపు పొన్న! నాముద్దు ♦ కలికిమిన్న!. ౩౨

యామి—జీవితేశ్వరా! నాజీవ మున్నంతదనుక నీహితోపదేశానుసారంబుగానే నేను నడచుకొనుదాన. నేను అధర్మముగా ప్రవర్తించెదనని మాత్ర మనుకొనవలసినపనిలేదు. ఇంతకు,

౩౩ * గీ. ఎవరిపై నల్గినను లాభ ♦ మేమి కలదు?
  కర్మము అనుభవింపక ♦ కడవ తరమె?

నాకు నీతోడిదే లోకః ♦ మాకతమున
వరులతో ఏమివని ఉండు? ♦ ప్రాణనాథ!. * ౨౫

బిల్హ—ప్రాణేశ్వరీ! నీమాటలనుపట్టి చూడఁగా బ్రతుకుపై విరక్తిచెంది నావియోగము కలిగిన ఆత్మహత్యచేసికొనవలయునని నిశ్చయించినట్లు కానవచ్చుచున్నది. కూడదు కూడదు; ఎంతమాత్రము కూడదు.

గీ. ఆత్మహత్యచే నరకంబు ♦ అందవలయు;
ఒకరు చా వారితో మఱి ♦ ఒకరు చావ
చూడ న్యాయమె? ధైర్యంబు ♦ చూపవలయు
ఆపదలయందె తగవరు ♦ లలివ మిన్న!. ౨౬

కళా—సఖీ! కష్టకాలమున మనస్సు గట్టిచేసికొని, సాధ్యమగునంతవఱకు ప్రయత్నము చేసి, ఆకష్టములనుండి గట్టెక్కుటకు చూడవలయునుగాని, విచారసాగరంబున మునిఁగి ఊరకుండుట ధీరులలక్షణము కాదు.

యామి—కళావతీ! నన్ను ఏమిచేయుమనెదవు? నానాథునికొఱకు నాప్రాణములు కూడ ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నదానను. ఏమిచేయుటకును ఇప్పుడు నాకు పాలుపోకున్నది. ఉపాయమేదైన నీకు తోఁచిన చెప్పుము; చేయుదానను.

కళా—సఖీ! నాకు ఒక ఆశ ఉన్నది.

యామి—ఏమి? అదేమి?

కళా—38 * సీ. జనపతిన్ వేఁడినన్ ♦ కనికరించును; కాన
ఆయనన్ కన మన ♦ మరుగ చనును;
యామి—ఆయన కడ కేగ ♦ అర్హమే నాకిప్పు?
నాయందు కల ప్రేమ ♦ పాయఁజేసె;
కళా— వసుధాధిపతి నిన్ను ♦ ప్రాణంబుగా చూచు;
విసిగి నీవిట్టుల ♦ విడువ తగునె?
యామి—నను తనప్రాణంబు ♦ గనె చూచుచున్నను
ఇపుడు నావిభు నేల ♦ యిట్టుచేయు?
కళా— ఎవరికైన ప్రమాదమే ♦ యొనయకున్నె?
రమ్ము; భూపతిఁ జూతము; ♦ రమ్ము వేగ;

యామి—నామనోహరుమేల్ చూడ ♦ నావిధి అగు;
కాన వెళ్లఁగ వలయు భూ♦జానికడకు. * ౨౨

బిల్హ—(తనలో) భార్య పురుషునకు అర్ధశరీరమను న్యాయమునకు తగినట్లుల ఈసుందరి నేనే తానుగా భావించి, నా కపాయంబు చేయ పూనినతనజనకునియందు కూడ ప్రేమబంధంబు త్రెంచివేసి, మరల నాకు మేలగుననుతలంపున అతనికడకు పోవ ఒప్పుకొన్నది. సతులకు తమపతులయెడ అనురాగమిట్లుకదా ఉండవలయును. నేను ఎంతధన్యుఁడను!.

కళా—సఖీ! జాగేల? ఆలస్య మమృతం విషమ్మను లోకోక్తి వినలేదా? సెలవు కొనుము; వేగముగా పోవలయును.

బిల్హ—కళావతీ! నీకును, చతురభాషిణికిని, మాయందు ఎంత ప్రేమ! మిత్రులనఁగా ఇట్టివారేకదా.

చ. కలిమిఁ జెలంగువేళఁ దన ♦ కార్యములన్ నెఱవేర్చుకొంటకై
చెలిమిని చూపువారియెడఁ ♦ జెల్లదు మిత్రపదం బొకింతయున్;
కలిమి తొలంగి కష్టములు ♦ కల్గినవేళల తోడుచూపువా
రలయెడ ఆమనోజ్ఞపద ♦ రత్నము చెల్లును సార్థకంబుగన్. ౨౩

కళా—మహాత్మా! మేమిప్పుడు మీకు చేసిన ఉపకారమేమున్నది? కష్టసమయమున మీకు రవంతయును పనికిరామైతిమికదా అని విచారకూపమున పడి కొట్టుకొనవలసిన స్థితిలోనే ఉన్నాముకాని, మీరు కష్టములనుండి గట్టెక్కి సుఖపడుచుండఁగా చూచు నోము నోవలేదుకదా మేము?

బిల్హ—మీరు మీచేతనయినంత కష్టపడుచున్నారు. ఇదే చాలును. తరువాత, సర్వాంతర్యామియు- సర్వసాక్షియు- సర్వేశ్వరుండును- సర్వశక్తుండును అగు పరాత్పరుండే ఉన్నవాఁడు. నన్నుఁగూర్చి నాకు సంతోషముగానే ఉన్నదిగాని విచారముగా లేదు. ఏమంటివేని,

గీ. మనసు సాకటిగా చరించెడు ♦ మగువయు, సుఖ
కష్టకాలంబులను ఒక్క ♦ గతిని మెలఁగు
మిత్రమును, మాట దాఁటని ♦ పుత్రకుఁడును
దొరకుటతిదుర్లభంబగు ♦ పురుషులకిల. ౨౪

అందులో మొదటి రెండుభాగ్యములును నాకు లభించినవికదా.

కళా—మహానుభావా! జాలమగుచున్నది; సెలవియ్యవలయును.

యామి—ప్రాణేశ్వరా!

౩౫ * చ. సెలవిడు; పోయివచ్చెదను ♦ చెచ్చెర ఇచ్చట ఉన్నయట్టులే;
బిల్హ— కలికిరో! మంచిదే; చనుము; ♦ గ్రక్కున రమ్మట ఏమి జర్గినన్;
యామి— సలిపెద అట్టులే; అచట ♦ జాగొనరింతునె యింతయేనియున్?
బిల్హ— కలఁగి మహీశుఁడేమనిన, ♦ కాంతరో! నీవలుగంగఁ బోకుమా. *

కళా—మహాత్మా! పోయివచ్చెదము.

బిల్హ—మంచిది కళావతీ!.

యామి—ప్రాణేశ్వరా! పోయి వచ్చెదను.

బిల్హ—ప్రాణేశ్వరీ! పోయిరమ్ము.

యామి—కళావతీ! కాలు సాగదే. (బిల్హణుని ఉద్దేశించి) ప్రాణేశ్వరా! పోయి వచ్చెదను.

బిల్హ—ప్రాణేశ్వరీ! పోయిరమ్ము.

యామి—(బిల్హణుని చూచుచు, చెలికత్తెలతో వెళ్లును.)

[తెరదిగును.]

శ్రీ

# బిల్హణీయము.

## పంచమాంకము.

రంగము—రాజమందిరము.

[కోపగ్రస్తుఁడగు రాజును, విచారగ్రస్తురాలగు రాణియును ప్రవేశింతురు.]

వసుమతి—(విచారముతో) అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము!

తే. * సీ. ఇంతతొందరపని ♦ యెందైన నుండునా?
బాగుగా యోచింప ♦ వలయుఁగాదె?

మద—(కోపముతో) ఛీ! మాటలాడకుము. వాఁడు చేసినది మంచిపనియును, నేను చేసినది చెడ్డపనియునా? పోపో.

వసు— ఆయనయెడ దోష ♦ మావంతయును లేదు;
పాడి కాదిటు చేయ ♦ పాడి కాదు;

మద—ఏమీ? వానియం దావంతయు దోషములేదా? వానిని వధించుట న్యాయము కాదా? ఇట్టివాండ్రను మన్నించుచుండుటే కాఁబోలును స్త్రీలకు నీతి. నోటికివచ్చినట్లు మాట్లాడక ఊరకుండుము.

వసు— అతనికై కాకున్న ♦ యామినికై యైన
అతని మన్నించుట ♦ అర్హముకద?

మద—ఆఁ; ఏమనియెదవు? యామినికొఱకైనను వానిని మన్నింపవలయునా? ఎందుకు? వచ్చినఅపకీర్తి చాలకా? దానిపేరు నాచెవిని పడనీయకుము. ముందు దానినే పొడిచివేయవలయునను బుద్ధి పుట్టును. పాలసముద్రములో కాలకూటము పుట్టినట్టు ఇంటికి అపకీర్తి తెచ్చుటకే పుట్టినది ఆకులట.

వసు—— అకట! పుత్రిక నిటు ♦ లాడుట ధర్మమా
ఒకవేళ తప్పేదొ ♦ ఒదవెనేని? *

మద——తప్పున్నను అనకూడదా? నెత్తిమీఁదను ఎక్కించుకొనవలయును కాఁబోలును.

వసు——నాథా!

కంచెయే పైరు మేసిన ♦ కాచువార
లెవ్వరనునట్లు తలిదండ్రు ♦ లే యిటు తమ
పిల్లతప్పును కావక ♦ వెల్లడి ఒన
రింప పెఱవారిమాట చ ♦ ర్చింప ఏల? ౨౧

లోకులో కాకులో అనునట్లు సాధారణముగా ఏమియులేనిదే యిదిగో పులిఅనిన అదిగో తోఁక అనుచుండులోకులు ఆధారము కొంచెముదొరకిన దానికి చిలువలును పలువలును అల్లి అల్లరిచేయక మెల్లఁగా ఊరకుందురా? పిల్లలకు కలిగిన అవమానము తల్లిదండ్రులది కాదా? బిడ్డలులేక అష్టమైనపాట్లుపడి దీనిని కన్నది గోరంతలు కొండంతలుచేసి యింటిగుట్టు బట్టబయట పెట్టుకొని అవ్వకు ఒడిఁగట్టుకొనుట కా? మానిసికి రాకున్న మ్రానికా వచ్చును తప్పు? తప్పులు వెదకిన ఎవరికి లేవు? కాన నామాట మన్నించి ఆబ్రాహ్మణోత్తముని మన్నింపుఁడు.

మద——(తలత్రిప్పుకొని మాటలాడక కూర్చుండును.)

కళా——(ప్రవేశించి, చూచి, వెనుకకు తిరిగి) సఖీ! మీజననీజనకులిద్దఱును మేలుకొనియే ఉన్నారు. లోనికి పోదము; రమ్ము.

యామి——(ప్రవేశించి) నడు నీవు ముందు నడు.

వసు——(యామినీపూర్ణతిలకనుచూచి యెదురుగావచ్చి కౌఁగిలించుకొనును.)

యామి——(ఏడ్చుచు) అమ్మా! నన్ను అనాథఁగా చేసెదవా?

వసు——(కన్నీరుతుడుచుచు) అట్లనకుమమ్మా! అట్లనకుము.

యామి——(తండ్రికాళ్లపై పడి)

32 * సీ. పతిభిక్ష పెట్టుమా ♦ పార్థివచంద్రమా!
సుతవత్సలత నీకు ♦ సుంత ఉన్న;

మద—(కోపముతో కాలితో త్రోసివేసి)

౩౨ * ఛీ! మాటలాడఁగా సిగ్గైన లేదఁటే?
కోరతగనికోర్కె ♦ కోరెద వహా!;

యామి—(దుఃఖాతిశయముతో)

హా! దైవమా! నాదు ♦ ప్రాణంబు పోదుగా
యీపలుకు ములుకు లి ♦ ట్లెద తగిలియు;

(కళావతితో)

నాథునితోడిదే ♦ నాదులోకంబును;
సఖి! ఇంక ఇట ఏల? ♦ చనుదము; పద;

(తల్లితో) అమ్మా! పోయెద; చనిపోయెద; ఇదియే నాతుదినమస్కారము. (నమస్కరింప పోయి పడును.)

వసు—(లేవనెత్తి)

అకటకట! మూర్ఛపోయిన ♦ యది కుమార్తె;
ఇంక ముందేమి జరుగునో ♦ యెఱుఁగ రాదు;

నీళ్లు నీళ్లు కళావతీ!.

కళా—(తెచ్చి, నీళ్లుచల్లి)

అన్న! ఈరాజున్యాయమి ♦ ట్లున్న దహహా!
తాను చేయుచున్నదే ♦ ధర్మమనును. ౮_౩

వసు—ఇప్పుడు సంతోషమైనదా? ఏమి యీకఠినత? మొదటనే భయపడుచు వచ్చి పతిభిక్షపెట్టవేఁడుకొనినకుమారికమీఁద ఇంతదయావిహీనత తగునా? అయ్యో! పిడుఁగులవంటి నిష్ఠురవాక్యములచే మొదలు నఱికిన చెట్టువలె ఎట్లు పడిపోయి మూర్ఛపోయినదో! ఇప్పటికిని తెలివిరాకున్నది. అమ్మా! యామినీ! నేనెంత నిర్భాగ్యురాలను?

మద—(క్రీఁగంటచూచి, పక్కగా)

గీ. స్త్రీలమాయ లెఱుంగఁగా ♦ చాలు ఎవఁడు?
తొలుత యోచించి యిట్టుల ♦ నలిపినారొ!

బాల యీరీతి భూమిపై ♦ పడి సొలసెను;
నిజమొ! నటనయొ! తెలియఁగా ♦ నేర; అహహా! * ౯౩

ఇంతకు ఏమైననేమి? గుండెలుతీసినపని చేసి నాపేరు మంటకలిపినది. దీనిని మన్నింప రాదు. (దూరముగ కూర్చుండును.)

కళా—ఏమి యీఅన్యాయము!

గీ. పురుషులు తమరెన్ని ♦ పోకడల్ పోయిన,
పరమధర్మములని ♦ పలుకు చుందురు;
తరుణులైన, తగవు ♦ దాఁటక నడచిన,
తప్పుతప్పఁటంచు ♦ చెప్పుదు రహా! * ౯౪

లేకున్న ఏమిది? కన్య తానువలచినపురుషుని వరించుట నేరమైనది.

యామి—(మెల్లఁగాలేచి, రాజును సమీపించి)

కవిరాజవిరాజితము.

జనపతి వంచును వేడ్కొన వచ్చిన ♦ చక్కఁగ నాస్థితి ఆరయకే
నను అనకూడనిమాటలు ఆడితి ♦ న్యాయము చూడక; వంచిదిపో;
వనరిన లాభము కల్గునె? ఇట్టుల ♦ బ్రహ్మ లిఖింపఁగ పోలు; అహో!;
చనిమెద; నాతుదివందనమున్ కొను; ♦ సౌఖ్యములన్ కనుమా జనకా!. ౯౫

(నమస్కరించి)

నన్ను దండింపుము; నాది తప్పు; నిరపరాధి; అయనను కాపాడుము.

(కాళ్లపై పడును.)

మద—(కోపముతో) పోపో; నాయెదుటనుండి పో. (కాలితో త్రోసివేయును.)

వసు—(విచారముతో) అయ్యో! అయ్యో! ఏమిది?

౯౬ * సీ. ఏమిది? పుత్రిక ♦ నిటు లొనరించు రె
భూమీశ! ఎవరైన ♦ భూమిమీఁద?

మద—నీకంత ప్రేమగా ఉన్న నీవును, అదియును కట్టకట్టుకొని దేనిలోనైన పడుఁడు; పొండు.

యామి—(లేచి, తల్లితో)

పోయెద; ననుఁ గూర్చి ♦ పొగలకు జననిరో!;
నా అదృష్టం బింతె; ♦ నను తలఁపకు;

వసు— ఎందుకు పుట్టితి ♦ వింతి! నా కడుపున?
వనట తీఱిచి నిన్ను ♦ మనుపఁజాల;

యామి— జనకుఁడు నాయెడ ♦ సదయుఁడు కాఁడని
అలుగకు! నాపాప ♦ ఫలమిదెల్ల;

వసు— ఎవరిపై కోపమెందుకు? ♦ ఏను నిన్ను
ఇటుల విడనాడి జీవింప ♦ ఎట్లు నేర్తు?

యామి— అమ్మ! నీవిట్లు చేయుట ♦ న్యాయముసుమ;
ఉండుము; జనకుని సేవించు ♦ చుండుము మోర్మి. * ౧౬

(కౌఁగిలించుకొని)

అమ్మా! సెలవిమ్ము; నేను పోయెద. కళావతీ! రమ్ము.

కళా—సఖీ! వచ్చెద. కొంచెము తాళుము. (రాజును ఉద్దేశించి) రాజా! నీమతి పోయినదా? యేమి? మొదట, మంచిచెడ్డలు విచారింపక హఠాత్తుగా బ్రాహ్మణోత్తముండగు బిల్హణుని వధింపతలఁచి, కారాగృహంబున పెట్టించితివి. ఇప్పుడాయనను గూర్చి వేఁడుకొనవచ్చిన నీముద్దులకుమార్తెను తద్దయు నిందించి, మూర్ఛనొందింపచేసితివి. దానికి సహించి మరల నిన్ను ప్రార్థింప ఆదరింపకపోవుటే కాక పోపో అని గద్దించి తన్నితివి. అందుచే ఈమె విరక్తిచెంది ప్రాణత్యాగంబు చేయునిశ్చయంబుతో ఉండుట చూచి, తల్లియు ఆత్మహత్యకు కృతనిశ్చయమై ఉన్నది. ఇట్టిస్థితిగా నోరుమెదల్పక ఊరకుండెదవేమి? ఇదేనా నీయేలుబడి? చెప్పు? బాగుగా ఉన్నది; చాల బాగుగా ఉన్నది. ఎద్దు ఈనెననిన గాఁటకట్టుమన్నట్లున్నదీవ్యవహారము. ముందువెనుకలు, మంచిచెడ్డలు ఆలోచింపక యెవరైన ఇట్టిపనిచేయుదురా? ఎవతోకూళ యేమో ప్రేల నీవీలీల కన్నకుమార్తెను బాధించెదవా? చాలు చాలు. నిజమునకు దోషమంతయు నీయందే ఉన్నదిగాని మఱియెవరియందును లేదు. ఇప్పటికైన చూచుకో; తెలివితెచ్చుకో; మించిన పిదప విచారించిన లాభము లేదు.

మద—(తనలో) ఇప్పుడు నామతిపోవుట నిజమే. ఏమిది! ఎప్పుడును నాయెదుట గట్టిగానైన మాటలాడియెఱుఁగని కళావతియెంతధరముగా నన్ను నిందించుచు

న్నది!. సరిగా చూచిన నేను ఈమెనిందకు పాత్రుఁడనే. తరువాత ఏమిచేసినను మొదట మంచిచెడ్డలు చక్కఁగా తెలిసికొనుట రాజులకు విధి కదా? నేను ఆదాసిచెప్పినమాటలమీఁదనే తొందరపడి యింతపని చేసినాఁడ. ఇందువలన వీరందఱును చావునకు తెగించి ఉన్నారు. ఇప్పుడైనను ఉన్నస్థితి కనుఁగొనకున్న బ్రహ్మహత్యా స్త్రీహత్యాగోషములు చుట్టుకొని కులనాశనము కాకమానదు. (పైకి) కళావతి! ఏమనెదవు? ఆబ్రాహ్మణుఁడు వధ్యుఁడు కాకుండిన మఱి ఎవఁడు వధ్యుఁడు?

కళా—అంతఃపురద్రోహిఅయిన, ఆయన వధ్యుఁడే.

మద—(తొందరతో) కాఁడా? ఆబ్రాహ్మణుఁడంతఃపురద్రోహి కాఁడా?

కళా—రాజా! ఆభూసురోత్తముఁడు అట్టి అపరాధియే అయిన నీసుత పతిభిక్షపెట్టుమని నిన్నేల ప్రార్థించును?

మద—(కోపముతో) ఏమీ? వాఁడు నాకుమార్తెపతియా?

గీ. ఏను దీని వాని ♦ కిచ్చి పెండిలి ఒన
ర్చితినె వాఁడు దీని ♦ పతి అగుటకు?
కళా— ఈవు చేయకున్న ♦ ఏమి? వారిరువురు
పతియు సతియు అయిన ♦ వారు రాజ!. ౧౭

మద—వారు తమంతట తాము సతీపతులైన ధర్మమెట్లగును? అప్పుడు ఇరువురును దండార్హులే.

కళా—అది విచారణీయము.

మద—ఏల విచారణీయము?

కళా—న్యాయానుకూలముగా నడవతలఁచిన.

మద—(తనలో) దీనిధీరత చూచిన ఆశ్చర్యకరముగా ఉన్నది. మంచిదో చెడ్డదో జరిగినసంగతి అంతయు తెలిసికొనవలయును. (పైకి) సరే; విచారించెద; జరిగినసంగతి యేదో చెప్పుము.

కళా—నేఁటికి దాదాపుగా నెలపదునైదు దినములక్రిందట ఒకరాత్రి మీయిలువేలుపగు భవానీదేవి కనఁబడి వరునొసఁగినట్లు కలగని, కలలో కనఁబడిన పురుషుఁడు దొరుకుట దుర్లభమని కలఁతనొందిన మనస్సుతో ఈమె ఉద్యానవనమునకు వెళ్లినది. మేమును వెళ్లితిమి. అచ్చట ఉండఁగా ఆపురుషుఁడే యీమె

కు కనఁబడెనఁట. వెదకినను మాకుమాత్రము కానరాలేదు. అంతటినుండియు అతఁడు దుర్లభుండగుదివ్యపురుషుండని తలంచి మదనజ్వరపీడితయై ఉండ, మేమారాత్రి శీతలోపచారములు చేసి అలసి పరుంటిమి. తరువాతి ఆనిశావృత్తాంతము ఈమెవలననే తెలిసికొనవచ్చును.

మద—(కుమార్తెనుచూచి) ఓసీ! ఏమి? తరువాతివృత్తాంతమేమి?

యామి—(తనలో) అయ్యో! ఏమనిచెప్పుదును? చాపుకంటె ఇదే కష్టముగా ఉన్నదే. (పైకి) తండ్రీ! నన్నేల బాధపెట్టెదవు? కావలసినసంగతి యేదో యిదివఱకే చెప్పితిని. మఱొకసారి చెప్పెదను. తప్పు నాది, నన్ను దండింపుము. ఆయన నిరపరాధి; క్షమింపుము.

మద—(కోపముతో) జరగినసంగతిఅంతయు చెప్పుమనిన, నాది తప్పు, అతఁడు నిరపరాధి అని చెప్పెదవేమి? చెప్పుము; జరగినసంగతిఅంతయు చెప్పుము.

యామి—(విచారముతో) అగంతయు నేను చెప్పక తప్పదా?

మద—ఎన్నిపర్యాయములు చెప్పవలెను? తప్పదు; చెప్పు.

కళా—(తనలో) ఏమి యీయన యింతమూర్ఖపుపట్టు పట్టినాఁడు! తనకుమార్తె చెప్పవలసివచ్చిన, ఈసంగతులన్నియు చెప్పనక్కఱలేదను నేమో అనుకొంటిని గాని, ఈయన మోమోటములేక యీమెను కూడ చెప్పుమనుచున్నాఁడు. ఏమి చేయుదును?

మద—ఏమి జాగుచేసెదవు? చెప్పు.

యామి—నామానముతీయుట మంచిదికాదు. తండ్రీ! కరుణింపుము.

మద—నీమానము నీవే తీసికొనిన దానవు. నేనిప్పుడు నీతండ్రిని కాను; న్యాయాధికారిని. జరిగినదంతయు చెప్పు.

యామి—సరే; తప్పదుకదా! వినుము.

మద—మొదట, ఈమాట చెప్పుము. కళావతి చెప్పినదంతయు నిజమేకదా?

యామి—అవును; నిజమే.

మద—తరువాతిసంగతి యేమో మొదలుపెట్టుము.

యామి—ద్విపదము. వీరు పరుండిన ♦ పిమ్మట నేను
మారజ్వరార్తితో ♦ మఱుఁగుచు నుండ
సితకరువర్ణన ♦ చెవిఁబడె; అంత
అతికుతుకంబున ♦ ఆలకించి, అది

ఆవలిగదినుండి ♦ అరుదెంచు టెంకిఁగి,
ఈవింత యేమహా! ♦ ఇందుండు గురుఁడు
జాత్యంధుఁ డాయన ♦ చంద్రు వర్ణించు
టత్యంతచిత్రమా ♦ నని యెంచి కాంచ
పటముపైనుండి ఆ ♦ ప్రకృతి కన్గొనిన,
అట దివ్యవిగ్రహుఁ ♦ డగపడె నొకఁడు;
అరయ ఆతఁడు కల ♦ యందు నేఁ కన్న
పురుషుఁడే అగుటచే ♦ ముదము నందితిని.

మద—రాచకన్నెవగు నీవిట్లుచేయుట న్యాయమా?

గీ. ఎవఁడు చంద్రుని వర్ణించె ♦ నేని యేమి?
నీకు చూడఁగ పనియేమి? ♦ నిజకులప్ర
వర్తనవిరుద్ధముగ చేయ ♦ భావ్యమగునె?
పరువు, మర్యాద చూచుకో ♦ వలదె? తులువ! ౧౯

కళా—(తనలో) ఇంక ఊరకుండరాదు. (పైకి) రాజా! దూరముగా ఆలోచించుకొనక యీమెను నిందించుచున్నావుగాని, దీనికంతకును నీవే కారణము; నీవే నింద్యుఁడవు.

మద—(కోపముతో) ఏల ? నేనేల నింద్యుఁడను? చెప్పుము. నోటికి వచ్చినట్లెల్ల పేలుచున్నావు.

కళా—కోపగింపక వినుము; నింద్యుఁడవగుదువో కావో నీకే తెలియును.

ఉత్సా. గురువు గ్రుడ్డివాఁడఁటంచు ♦ కూఁతుతోడ చెప్పుటన్
తరుణి, అంధుఁ డేగతిన్ సు♦ధాకరున్ నుతించునో
అరిదికార్య మంచు చూచె; ♦ ఆమె తప్పె? చెప్పుమా;
అరయ నీ వసత్యమాడి ♦ నట్టిదాని ఫలమెసూ. ౨౦

ఈమె, అంధుఁడెక్కడ? చంద్రవర్ణనమెక్కడ? ఇది వింత అని చూచి, నీమాటయందలి గౌరవమునుపట్టి, కనినకలనుపట్టి, తరువాత ఉద్యానవనమున జరిగినసంగతినిపట్టి, ఆ చంద్రవర్ణనము చేయు పురుషుఁడు గురువు కాఁడనియు—దివ్యపురుషుఁడే అనియు అనుకొని, అదివఱకు తానొనర్చుకొనిన నిశ్చయమును

అనుసరించి, అప్పుడును అతనిని మనస్సున భర్తగాఁ గొని, పిదప తెలిసినను మలోకవిధమున నడచుట ధర్మవిరుద్ధమని గాంధర్వవిధిని అతనిని వరునిగా గ్రహించినది. ఇందులో, ఎవరిది తప్పు? ఆయనదా? ఈమెదా? నీదా?

మద—(తనలో) అన్నా! ఇది నావ్రేలితో నాకంటికే పొడుచుచున్నది. తుదకు నేరమంతయు నామీఁదనే మోపినది. ఇప్పుడేమనుటకు నోరాడకున్నది. (ఆలోచించుచుండును.)

కళా—అయ్యా! ఏమనియెదరు? ఎవరిది తప్పు? మాటలాడరేమి?

మద—(తనలో) అన్నిటికంటె నాకు దీనిబాధ యెక్కువగా ఉన్నదే. ఏమందును? (తలయూఁచుచు) తప్పును నాదే; అపకీర్తియును నాదే. తప్పు ఎట్లో తప్పించుకొన వచ్చునుగాని, అపకీర్తి భరింప సాధ్యము కాదుకదా! (పైకి) న్యాయవాదినీ! గురుఁడంధుఁడని చెప్పుట నాదే తప్పనుకొనుము. అందువలన, ఇదిచేసినది ఒప్పగునా? కులాచారము వదలి పరవర్ణజుని వరించుట గాంధర్వవిధిమాత్రమున ఎట్లు న్యాయానుసారమగును? కావున, ఇది నిందింప తగినది; దండింప తగినది. ఆ బ్రాహ్మణాధముఁడు, సర్వనీతిశాస్త్రపారంగతుండయినను ఇట్టిపని కొడంబడుటచే, నిందింప తగినవాఁడు; దండింప తగినవాఁడు. ఇప్పుడేమందువు?

కళా—రాజా! తప్పు నీదని తెలిసియు మూర్ఖపుపట్టు పట్టి మాటలాడెడునీతో ఏమందును? నేను చెప్పవలసినదంతయు వెనుకదీయక చెప్పినదాన. నాదోషమేమియు లేదు. తరువాత నీయిష్టము. దైవసంకల్ప మెట్లున్నదో, అటులగు.

మద—చాలు చాలు నీధర్మోపన్యాసములు; ఊరకుండుము.

౪౦. * క. ఇరువురినిన్ దండింతున్
దురితమును క్షమింపఁజాలఁ; తులువా! పోపో;
కళా— సరె; దండింపంగలుగుదు;
అరయఁగ ధర్మంబుమాత్ర ♦ మది కాదుసుమా. ౯౧

మద—(కోపముతో) ఎందుకు ధర్మము కాదు?

క. స్మరతంత్రమునకు లోఁబడి
పరువెల్లను తీసినారు; ♦ వదలుట తగవే;

కళా—ఇదా ధర్మము? కాదు; అది దురవగాహము. అందుచే,

దురితాత్ముల దండింపన్
ధరణీశా! దండధరుఁడె ♦ తగువాఁడు సుమా. * ౯౨

మద—ఏమే నీమొండితనము? ఊరకుండుమనిన ఊరకుండక మరల ధర్మోపన్యాసము మొదలుపెట్టితివా? పొండి! మీరందఱును నాయెదుటినుండి లేచిపొండి.

కళా—అట్లే పోయెదము. పోవక కూర్చుందుమా? ఇంతకు ఇప్పుడు నీవు నామాట వినవు, తరువాత విచారించెదవుగాని.

మద—(కోపముతో) ఛీ! నోరు మూసికొనుము.

క. చింతింపను మానుదునో
అంతయు నీకేల? మాట ♦ లాడక పోపో;
ఎంతయు పెద్దతికంబున
గంతులు వేయుచును నీతి ♦ కఱపెదు నాకున్. ౯౩

పోపొండి. (వెళ్లును.)

యామి—అమ్మా! పోయెద.

వసు—(ఏడ్చుచు) హా! నే నెంతదౌర్భాగ్యురాలను!. (కౌఁగిలించుకొనును.)

[తెరపడును.]

---

రంగము—వీధి.

[విచ్చుకత్తులతోడి తలారు లిరుప్రక్కల రాఁగా బిల్హణుఁడు పురజనులతోఁ బ్రవేశించును.]

బిల్హ—(విచారముతో) రం * అయ్యో! నాప్రాణేశ్వరి కెంతకష్టము వచ్చినది!

ఉ. పుట్టిననాఁటనుండియును ♦ పువ్వు తెఱంగున పెంపుగన్న రా
పట్టి, కటా! కటా! ఇపుడు ♦ భాగ్యవిహీనత నేలమాలియన్
పెట్టి తపింపచేయ, ఎటు ♦ వేఁగుచు నున్నదొ! ఏమొనర్తు? నా
యట్టులె ఆమె అయ్యొ; శని ♦ యట్టుల పట్టెతి నాతలోదరిన్. * ౯౪

అకటా! దౌర్భాగ్యమా! నన్ను బాధించుటతో నీకు తృప్తి కాలేదా? నాజీవితేశ్వరినికూడ భాగ్యహీనంబున వెఱఁబెట్టితివా? విచారాంధకారంబున మునింగి చావనున్న నాకు ఆసుందరీముఖచంద్రబింబంబు కనిసంతసించుభాగ్యమైన లే

ఈండ చేసితివా? పోనిమ్ము. పరాత్పరా! నన్నేమి చేసినను సరే. కరుణించి ఆ కాంతామణిని కాపాడుము. అంతే చాలును. (పైకిచూచి నమస్కరించును)

తలా—అయ్యా! నడునడు.

బిల్హ—(నడచును.)

మొ-వా—అయ్యా! ఈయన యేమితప్పుచేసినాఁడు? తలారులు వధించుటకు తీసికొని పోవుచున్నారు.

రెం-వా—అంతఃపురద్రోహము చేసినాఁడఁట. అందుచే రాజుగారు మరణదండము విధించినారఁట.

మొ-వా—నమ్మశక్యము కాదు; ఈమాట నమ్మశక్యము కాదు.

గీ. సర్వవిద్యలు నేరిచి ♦ సర్వధర్మ
విదుఁడయి సుగుణఖని అన ♦ వినుతి కాంచు
ఈయనేడ? ఈదురితము ♦ చేయుటేడ?
నమ్మఁగాఁజాల ఒక్కింత ♦ నమ్మఁజాల. ౯౫

రెం-వా—ఏమి జరిగినదో నిశ్చయముగా ఎవరికిని తెలియదు. పలువురు పలువిధములుగా చెప్పుకొనుచున్నారు. నిజము దైవమునకే యెఱుక.

మూ-వా—ఈయనయెడ దోషము లేకుండిన వధ విధించుటకు రాజుగారు వెఱ్ఱి వారా?

నా-వా—కొందఱు రాచకుమార్తెదే దోషముగాని యీయనదోష మేమియు లేదనుచున్నారు.

రెం-వా—రాజుగారు ఇద్దఱియెడ దోషమున్నదని యెంచి, ఈయనను వధించుటకు నిర్ణయించి, ఆమెను నేలమాలెలో వేయించినారఁట.

ఐ-వా—అన్యాయమన్యాయము. ఈయనయందును దోషములేదు; ఆమెయందును దోషములేదు. వీరిని దండించుట రాజుదే తప్పు.

మూ-వా—ఏమయ్యా! అట్లనెదవు? అంతఃపురద్రోహము చేయుట తప్పుకాదా?

ఐ-వా—అంతఃపురద్రోహమా? ఎక్కడ? ఆమె కన్య కాదా?

మూ-వా—కన్య అయిన ఏమి?

ఐ-వా—మఱేమి? వారికిరువురకు పరస్పరానురాగము కలిగినది; గాంధర్వవిధిని వివాహమాడినారు. ఇందులో దోష మేమున్నది?

మూ-వా—ఇదేమివివాహము? ఈయన బ్రాహ్మణుఁడు; ఆమె క్షత్రియకన్య.

వి-వా—ఏమీ? బ్రాహ్మణుఁడు క్షత్రియకన్యను వివాహమాడకూడదా? ఎవరు చెప్పినారు? క్షత్రియకన్యనే కాదు, వైశ్యకన్యను, శూద్రకన్యనుకూడ వివాహమాడవచ్చును.

మూ-వా—ఏక్షత్రియకన్యలను ఏబ్రాహ్మణులు వివాహమాడినారు?

వి-వా—ఒకరేమి? ఎందఱో కొందఱినో వివాహమాడినారు.

మూ-వా—కొందఱిని చెప్పరాదా?

వి-వా—కావలసిన వినుము; చెప్పెద.

సీ. చ్యవనుండు సంయాతి ♦ జనవరుపుత్రిక
అగుసుకన్యను వివా ♦ హంబుకాఁడె?

మూ-వా—ఒకఁడు; తరువాత.

వి-వా— వైదర్భసుతను లో ♦ పాముద్రను అగస్త్యుఁ
డంచితంబుగ పెండ్లి ♦ యాడలేదె?

మూ-వా—ఇద్దఱు; పెద్దపద్దులే; తరువాత.

వి-వా— సంజయధరణీశ ♦ చంద్రకూఁతుఁ దమ
యంతి నారదుఁడు భా ♦ ర్యగను కొనఁడె?

మూ-వా—చాలును చాలును; మఱెందుకు? చ్యవనుఁడు, అగస్త్యుఁడు, నారదుఁడును రాజకన్యల వివాహమాడ తక్కినవారిమాట చెప్పవలసినదేమున్నది? అవునుగాని గురువు శిష్యురాలిని వివాహమాడ వచ్చునా?

వి-వా—సాధారణముగా, కూడదనియే కట్టుబాటు. కాని,

ఇరువురు ననురాగ ♦ భరితులై ఉండిన,
పరిణయమున కిష్ట ♦ పడుటె తగవు;

అట్లనియేకదా సంజయుఁడు తనకూఁతురగుదమయంతి నారదునియందు బద్ధానురాగ అగుట యెఱిఁగి తనకిష్టము లేకున్నను వారికిద్దఱకు వివాహంబొనరించె.

మూ-వా—ఇందువలన తేలిన దేమి? తప్పనిసరిగావచ్చిన, గురువుతో శిష్యురాలి వివాహమునకు ఒప్పుకొనుటే కాని, అది సర్వసమ్మతమగు ఆచారము కాదు.

బి-వా—బొత్తిగా లేనిఆచారమును కాదు.

విరటావనీశుఁ డు♦త్తరఁ గురువగు అర్జు
నునకు ఇచ్చెద నంచు ♦ అనఁగ లేదె?
కాన, ఆచారముంట ని♦ క్కంబు; కాని,
ఉత్తమంబని చెప్పుట ♦ ఒప్ప; దయిన
స్థితిగతులఁ బట్టి నడచుట ♦ చెల్లు; ఇట్లు
మూర్ఖపుంబట్టు పట్టుట ♦ మురువు కాదు. ౯౬

మూ-వా—అవునవును; ఇందువలన మర్యాదపోవుట, ఈయన చచ్చుట, తక్కిన వారు దుఃఖసాగరమున మునుంగుట గాక మఱి యేమిలాభమున్నది? రాజులు! వారికి తోఁచదు; మఱిఒకరు చెప్పిన వినరు. పాపము! ఈగురుత్వము ఈయన మరణమునకే వచ్చినది కాఁబోలు. (వెళ్లుదురు.)

---

రంగము—కాళికాలయప్రాంతము.

[బిల్హణుఁడు తలారులతోడను, పౌరులతోడను ప్రవేశించును.]

తలా—నిలు; ఇక్కడ నిలు.

బిల్హ—(వెగటు నవ్వు నగుచు) అహాహా! కర్మవైచిత్ర్యము.

క. ఒకక్షణము సుఖముపొందుట,
ఒకక్షణ మత్యంతబాధ ♦ నొందుట, మదిలో
ఒకక్షణ మాశన్ పొందుట,
ఒకక్షణము నిరాశనొందు ♦ టాదవెదు; అకటా!. ౯౭

[రాజు మంత్రితో ప్రవేశించును.]

మహ—తలారులారా! సిద్ధముగా ఉన్నారా?

తలా—చిత్తము మహాప్రభూ!

మహ—సరే; మీపని మీరు కానిందు.

తలా—(బిల్హణునితో) అయ్యా! వధ్యశిల యెక్కు.

బిల్హ—ఒకనిమిషము తాళు; ఎక్కెద. (రాజును ఉద్దేశించి)

ఉ. ప్రాణము నీటిబుగ్గవలె ♦ భంగము నొందు క్షణంబులోన; నీ
ప్రాణముకై రవంతయును ♦ వందుర; నిక్కము; కాని, ధర్మసం
త్రాణమొనర్చు నీవిటు ల ♦ ధర్మపు దండములన్ విధించి, స
త్ప్రాణుల బాధ పెట్టి, తుది ♦ రౌరవబాధలు పొందఁ బోకుమా. ౯౮

మద—(కోపముతో బిల్హణునిచూచి, తలయూఁచి. తలారులతో) తలారులారా! ఈ నాస్తికుఁడు సిగ్గులేక నాకు నీతి బోధింపఁబోవుచున్నాఁడు! నన్నుఁగూర్చి విచారింపక తనపని తాను చూచుకొమ్మని చెప్పుఁడు.

తలా—చిత్తము. (బిల్హణునితో) అయ్యా! మాటలాడక వధ్యశిల యెక్కు.

బిల్హ—మంచిది. (వధ్యశిల యెక్కును.)

తలా—(బిల్హణునికాళ్లకు సంకెలలు వేయుదురు.)

బిల్హ—(కనులు మూసి, చేతులు మోడ్చి, పైకి తలయెత్తి,)

ర౩ * సీ. కావవే యిప్పుడు ♦ కరుణతో ఓదేవ
దేవ! నిన్ వేఁడెద ♦ దీన పాల!
నేను దోషము చేసి ♦ నానొ! లేనో! అది
నీ వెఱుంగుదుకదా ♦ నిఖిలసాక్షి!
లేనినిందను తెచ్చి ♦ పైని మోపి మహీశుఁ
డుగ్రుఁడై చంపింప ♦ నున్న వాఁడు;
నాకభయమొసంగి ♦ సాకతమున కావ
నీకంటె ఎవ్వరున్ ♦ దిక్కు లేరు; *
నామనము ధర్మనిరతమై ♦ నడచునేని,
చంపతగిన నేరము ఒన ♦ రింపనేని,
సంతతము మది నిన్ను ధ్యా ♦ నింతునేని,
కరుణఁ ఇప్పుడు నను నీవు ♦ కాతుఁగాక. ౯౯

(ధ్యానించుచుండ సంకెలలూడిపోవును.)

పౌర—ఆహా! ఏమియీయాశ్చర్యము! ఈశ్వర ధ్యానము చేసినంతమాత్రముచేతనే సంకెలలూడిపోయినవి. ఈయన మహాత్ముఁడు; నిర్దోషి అయి ఉండవలయును.

మద—(తనలో) ఏమియీవింత? ఇది నిజముగా దైవానుగ్రహమువలననే జరిగినదా? కాదు కాదు. (పైకి) పౌరులారా! ఇతఁడు మాంత్రికుఁడు. ఏదో క్షుద్రమంత్రప్రభావమువలన ఇట్లైనదిగాని మఱియొకటి కాదు. మహాపరాధము చేసినాఁడు. తప్పక దండింపవలయును. (తలారులతో) తలారులారా! చూచెదరేమి? మరల సంకెలలు వేయుఁడు.

తలా—చిత్తము. (సంకెలలు వేయుచుందురు.)

(తెరలో)

యామి—హా! నాథా?

పౌరు—(వినుటనభినయించి) ఏమియీయార్తధ్వని? రాజకుమారి విలపించుచు వచ్చుచున్నట్లున్నది.

మద—(ఆశ్చర్యముతో) ఇది నేలమాలియనుండి యెట్లు బయటికి వచ్చినది!.

యామి—(వసుమతీకళావతీచతురభాషిణులతో ప్రవేశించి, బిల్హణునిపాదములపైఁ బడి)

౪౩ *

ఉత్సా. పోదె నాథ? నన్ను వదలి ♦ పుణ్యలోకమున్ కనన్?
నాదుప్రాణమా! ధనంబ! ♦ నన్ను కూడ కొనియె పో;

బిల్హ—(ఆశ్చర్యసంతోషములతో) ప్రాణేశ్వరీ! దానికేమిగాని,

నీదుబంధ మెటుల తప్పె? ♦ నెమ్మి తెలియఁ జేయుమా;
నాదుభాగ్యమునను నిన్ క ♦ నంగనయ్యె క్రమ్మఱన్. ౧౦౦.

యామి—ప్రాణేశ్వరా!

చ. వరుదయచేత నేఁ తిరిగి ♦ ప్రాణముతో నిను కాంచనోపితిన్;
బిల్హ— కరము వెఱంగగున్; తెలుపు ♦ గ్రక్కున నీచెఱ యెట్లు తప్పెనో;
యామి— నిరతిశయార్తిమున్గుచును ♦ నెమ్మదిలోన భవాని వేఁడ, త
త్పరమదయాప్తిన్ భాగ్యవశ ♦ పాటము లల్లన వీడి ప్రోవిడెన్. *

మద—(తననే... ...డు నాపరువు తీసివేసినాఁడుకదా. (ప్రైకి) తలారులా రా! ... (యామినీపూర్ణతిలక మొదలగువారిపై చూచి) ఓసీ! కులటలారా! ... ముక్కడకు వచ్చినారు? పొండు.

[తెరలో]

రాజా! ... తొందరపడకు తొందరపడకు.

అందఱు—(... చూచుచుందురు.)

[అప్పు... ...లుపులు విడిపోఁగా భవాని ప్రత్యక్షమగును.]

అందఱు—(... ...రు.)

భవా—రాజా! ... క్షత? వీరియెడ దివ్యమహత్త్వము కనఁబడుచుండినను తెలిసికొనక ... ...గా చెదవు. వీరు పూర్వము విద్యాధరదంపతులు. నాభక్తులు. ఒక ... ...ణమున మానవజన్మము లెత్తి, దైవనిర్ణయమునుబట్టి గాంధర్వవిధిచే దంపతులైనవారు. వీరియెడ అపరాధమేమియు లేదు. వీరికి మహావైభవంబున వివాహంబు కావింపుము.

మద—(సాగిలఁబడి మ్రొక్కి) నీయాజ్ఞానుసారముగానే చేసెద. సర్వేశ్వరీ! నా అపరాధము క్షమింపుము.

భవా—క్షమించితి; లెమ్ము. ఇంతకు నీదోషమును ఏమియును లేదు. నీకరినతకు వీరిపురాకృతకర్మము కారణము. కాన నిన్ను నిందింపనక్కఱ లేదు. లెమ్ము.

మద—(లేచి) తల్లి! కృతార్థుఁడనైనవాఁడ.

వసు—, కళా— } అమ్మా! ఇప్పటికి మాప్రాణములు గూటఁబడినవి. కృతార్థురాండ్రమైనారము.

బిల్హ—, యామి— } (చేతులు మోడ్చి,) 43 *

దండకము. తల్లీ! మహాకష్టసారాశినిర్మగ్నభక్తాళి నాకామతల్లీ! నినున్ విన్నఁగా ఎన్నఁగా నేర్తుమే? తెల్వి యింతేనియున్ లేదు; మాతప్పులన్ కాచి కాపాడుమా; అమ్మ! దుర్మార్గులంచున్ కడున్ దూషణంబంది, అత్యంతదుఃఖంబులన్ పొంది, చావంగ సిద్ధంబుగా ఉన్నకాలంబునన్ నీవు ప్రత్యక్షమై మాయెడన్ దోషముల్ లేని చందంబు లోకంబెఱుంగంగ ఘోషించి, మాచావు తప్పించి, మమ్మిప్డు మోదాబ్ధిఁ దేలించి, ముందున్ సుఖాంభోధిలో ఓలలాడింప కావించి, రక్షించితో; ఇట్టిఅప్పు తీర్పంగ మాశక్యమే? డెందమారన్ నినున్ కొల్చుచున్

వందనంబుల్ సమర్పింతు; మింతే; దయఁ గ మమ్ము మన్నించి, పోషింపుమా స
ర్వదా ఓమృడాని! భవానీ! ఇదే నీకు జేజే; ఇదే నీకు జేజే; ఇదే నీకు జే. *

(సాగిలఁబడి మ్రొక్కుదురు.)

భవా—బిల్హణ యామినీపూర్ణతిలకలారా! లెండు. ఇది అంతయు మీపూర్వకర్మానుసారంబుగా జరిగినది గాన మీరు దీనికి చింతింప నక్కఱలేదు. లోకాచారమునకు కొంచెము విరుద్ధముగానున్నను మీయెడ దోషమేమియు లేదు. కర్మపాశబద్ధులరయ్యును మీరు చూపినధర్మపరత్వమునకు సంతసించినదాన. మీరు కొంతకాలమువఱకు భూలోకంబున అఖిలసౌఖ్యంబులలో తేలియాడుచుండి, శాపవిముక్తిచెంది, పూర్వరూపంబున నాసాన్నిధ్యంబు చేరువారు. మీఅభీష్టమే ద్దియో కోరుకొనుఁడు; ఒసంగుదాన.

బిల్హ—తల్లీ! నీ అనుగ్రహముకంటె కావలసినదేమున్నది? అయినను, దయచేసె దనంటివిగాన,

భరతవాక్యము.

చ. మనము లధర్మవర్తనపు ♦ మార్గమునన్ చనకుండ, ధర్మవ
ర్తనమున సంచరించునటు ♦ తద్దయు యత్నము చేయునట్టి స
జ్జనులకు తోడునీడవయి ♦ సాయము చేయుచు, వారికెందు దు
ర్జనులభయంబులేనిగతి ♦ సల్పుచునుందువుగాక యీశ్వరీ!. ౧౦౩

భవా—అటులే అగుఁగాక.

౪౪ * *

సమాప్తము.

శ్రీ

# బిల్హణీయము.

## పాటలు.

### నాంది.

కమాచి—ఏకతాళము. (చతురశ్రగతి.)

౧ దేవదేవా! సద్భ - క్తిన్ మ్రొక్కెదన్॥ దేవ॥
కావవే మాయెడన్ - కలిగి కరుణన్
భావమున నిన్నె నమ్మితిన్॥ దేవ॥
వాచాగోచర - ప్రభావాకరా!
నీ చరిత మెన్న తరమే?॥ దేవ॥
సరసకలాభిలాష - సమాజపాలా!
సురుచిరరామచంద్ర- స్తుతిచయలోలా!॥ దేవ॥

కమాచి—రూపకము.

సూత్ర— ౨ ఇంతి! ఒకసారి యిట - కేగుదెంతువా?
ఎంతసేపు నీకొఱ - కిటు వేచియుందునే?॥ ఇంతి॥
నటి— ఏల నాకై వేచియుంటి? - హృదయేశ్వరా!
జాలమేల? చెప్పుడీ; వి - చారమెందుకు?॥ ఏల॥
సూత్ర చూచినావె యీసభ? - ఓచకోరాక్షి!
ఏచక్రనినాటక - మిపుడాడుదము?॥ ఇంతి॥
నటి— దీని కింతచింతయేల? - దేవ! మనోజ్ఞ
మైనబిల్హణీయ మిపు - డాడరాదో?॥ ఏల॥

(3 పుటలోని లయగీతమునకు బదులు.)

కమాచి—ఏకతాళము. (చతురశ్రగతి.)

నటి— వేసవి ఋతువులనెల్లన్ - వాసి కన్నదికదా;
భాసుర సౌఖ్య తతికిన్ - పట్టుకొమ్మయౌఁగదా॥ వేస॥
చలిబాధ లేకుండన్ - చల్లనినీటిలో
సలలితముగ స్నానముల్ - సలుపవచ్చునుగదా॥ వేస॥
వెన్నెలబయళులందు - వేడ్కలలరఁగను
వెన్నునడుగు సొగసు కనుచు - వెలయవచ్చునుగదా॥ వేస॥

బేహాగు—రూపకము.

మద— 3 సచివశేఖర! రాజ్య - సమాచారమేమి?
రుచిరభాషణముల - రూఢిఁ జెప్పుమా॥ సచి॥
ధరామరవరుల్ - తపోజపాదులెల్ల
నిరతనియమమునన్ - పరఁగ ఒనర్తురా?
ధరణీవరుల్ నిజ - ధర్మమాచరింతురా?
సరిగ వణిక్తతి సచ్ఛూద్రులు - సంచరింతురా?॥ స॥

జంఝూటి—ఏకతాళము. (త్య్రశ్రగతి.)

మద— ౪ అహహా! నేఁ ధన్యుఁడ - నైతిఁగా
మహాత్ములారా! మీ ఆగమమునన్॥ అహా॥
మీప్రసాదమువల్ల - నేఁ బుత్రికన్ గాంచితి;
ఆపెఁ విద్యావతిఁ జేయఁగావలెన్॥ అహా॥
మీలోన ఎవ్వరా - బాలిక కిపుడు
చాలఁగ విద్య చెప్పెదరు?॥ అహా॥
చక్కఁగా యోచించి - సరగున జెప్పుఁడీ;
మ్రొక్కెద మీకిదె భక్తితో॥ అహా॥

ఖారువ—ఏకతాళము.

మద— ౫ ఏమిపాపమయో! మంత్రీ! - ఏమిపాపము!॥ ఏమి॥
ఈమహాపట్టణమున - నాముద్దుపట్టికి

కామితవిద్యలు నేర్పెడి - ఘనులు లేరుగా॥ ఏమి॥
ఇంక ఎచటిపండితుల - ఇటకు తెచ్చెద;
శంకాకాక్రాంత మయ్యెను నా - స్వాంతమక్కటా॥ ఏమి॥

అమీరుకల్యాణి—రూపకము.

మద— ౬ ధీరా! కవీంద్రా! - కారుణ్యాంబుధీంద్రా! మహా॥ ధీరా॥
సారసభవాన్వవాయ - వారిధిచంద్రా!
సూరిసైరవచంద్రా! - హారసమాఖ్యా సాంద్రా!
చారుభూషణా! - భీరుపోషణా!
వైరిశోషణా! - మారసుందరాంగ!॥ ధీరా॥

బేహాగు—చతురశ్రగతిచాపు.

మద— ౭ దేవా! నాదొకప్రార్థన కలదు చిత్తగింపు;
సావధానముగ విని - సన్మానింపవలయు॥ దేవా॥
బిల్హ— రాజా! నీమనోరథ మేమొ రయమున చెప్పు;
వ్యాజ మేమియును లేక - ఆచరించువాఁడను॥ రాజా॥
మద— లేకలేక ఒక్కసుత నేఁ గాంచి పెంచితిని
ఆకన్యామణికి విద్యా - భ్యాసము చేయవలె॥ దేవా॥
బిల్హ— నీమనోభీష్టము తీర్ప నిశ్చయించుకొంటినిగాని
నీమ మొకటికలదు- నిర్ణయింపవలయు॥ రాజా॥
మద— ఏమియేమి? ఆనియమ మేమొ తెలుపుము వేగ;
నామనము వ్యాకులతా- నాగకంపితమగు॥ దేవా॥
బిల్హ— కుష్ఠముఖదుష్టరోగ వేష్టితుల చూచుట, అ
రిష్టమనివారిఁ జూడ - ఇష్టము లేదుసుమీ॥ రాజా॥

బేహాగు—ఆదితాళము.

మద— ౮ పురాకృతము చే కుష్ఠ- శరీరఅయ్యెనాసుత॥ పురా॥
బిల్హ— బాలికకు విద్యచెప్ప వీలు లేదుసుమీ రాజా!॥ బాల॥

మద— ధరామరేంద్రా!- తామొనంగిన-
వరమును మఱవంగ- వలవదు॥ పురా॥

బిల్హ— వరము మఱవఁగ- వలదని మెచ్చు-
ధరావర! నియమమే- కరణీనగు॥ బాల॥

మద— నియమభంగ మొదవకుండ- నేనొనర్చువాఁడఁగాన
దయచేసి మఱియొక- తలఁపు మానుఁడు॥ పురా॥

బిల్హ— ఎటుల నియమభంగ మొదవ- నటు చేయువాఁడవీవు
ఘటురయమున తెలుప- వలయు; వినద॥ బాల॥

హిందుస్థాని భైరవి—ఏకతాళము.

మద— ౯ పలుకఁగదే- జలజలఅమృత-
మొలుకగను- కలికిమిన్నా!॥ పలు॥

యామి— విను; జనకా!- విద్యనుగూర్చియే-
అనుకొనుచుంటి- మనువుగను॥ విను॥

మద— అహహా! ఏమి! ఆశ్చర్యంబే-
మహిళామణి! ఒకటే- మనము తలఁచితిమి॥ పలు॥

యామి— ఏమీ! మీరున్- ఇదితలఁచితిరే?-
కామితమునుతీర్చ- కరుణచూపఁగవలె॥ విను॥

మద— సరే; ఏవిద్యలను- చదువ కోరెదవో-
త్వరగా తెలుపుము- గురువును కూర్తు॥
నిరుపమశ్రద్ధతో- నేర్చుకొనువిద్య-
పరమానందసుధా- వారిధిఁ దేల్చుము॥ పలు॥

యామి— కవితాసంగీత- కళలు నేర్చుకొన-
నవనవవాంఛలు- ధృవమయ్యెను;
వివిధవిద్యాచయ- విదుఁడగుపండిత-
కవివరు గురువుగ- తివిరి చూడవలె॥ విను॥

బేహాగు—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౦ ఏమి పొగడనేర్తు నహా! జనకా!- నీమహావాత్సల్యమును॥ నే॥

తలఁచినకోరిక- తెలుపక మునుపే- ఫలింపఁ జేసెదవహా!॥ఏమి॥
ఇందులకుమాకే- నేమొనర్పఁగల- వందనమర్పించెద॥ ఏమి॥

హిందూస్థానీ-కాఫీ—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౧ ఏమి ఆలోచించినా- రెఱుఁగ చెప్పుడీ వేగమే;
నామనోవ్యాధితీర్చి, ఆ- నందమొందఁ జేయుఁడీ॥ ఏమి॥
మద— కాండపటమొకటి నడుమ- కట్టించెడి వాఁడను;
పుండరీకనయన! ఇంక- పొగలఁ బోకుదీనికింత॥ కాండ॥
యామి— సరిగాసే; బాగుగానున్నది- జనక రత్నమా! నీన్నె
కరణిస్తోత్ర మొనరింపఁ- గా ఒకింతఁ జాలను॥ ఏమి॥
మద— అమ్మ! త్వరగా శుభది- నమ్మున విద్యాభ్యాసము
సమ్మోదముగా నొనర్తు- సంతసంబుగా ఉండుమా॥ కాండ॥

హిందుస్థానీ-కాఫీ—రూపకము.

యామి— ౧౨ చెప్పఁజాల నే నేనింత- చెప్పఁజాలనే;
కప్పలవలె తలఁపుల్- గంతు లిడునే॥ చెప్ప॥
సఖులు— ఏమి యీగతి ననెద- వేమియీగతి?
కామసంబంధమగు- కలను కంటివే? సఖీ॥ ఏమి॥
యామి— నన్ను బాధ పెట్టకుఁడే- అన్న మిన్నలార! యింక;
మిన్ను ముట్టునట్టిసిగ్గు- నన్ను గ్రమ్మెనే సఖీ!॥ చెప్ప॥
సఖులు— కొమ్మ! ఇంకఁ చెప్పకున్న- మమ్ము చంపినట్టులే;
సమ్మోదంబు నొందెదము- సరగ చెప్పుమా సఖీ!॥ ఏమి॥
యామి— నవమోహనాంగుఁ డొకఁడు- నాకంటఁ బడెనే;
నవనీతమురీతిని- నామది కరఁగెనే సఖీ!॥ చెప్ప॥
కళా— పడఁతి! పిదప నీవె అతనిఁ- పైకొనిన దానవౌ;
దుడుకు చేసి నిన్నెయతఁడు- తొందరించెనో సఖీ॥ ఏమి॥

భైరవి—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౩ తెలుపఁగ లేనే వాని- చెలువముఁగ॥ తెలు॥
తలిరుటడిదవుజోదున్- తల దన్నుఁగ॥ తెలు॥

నిగనిగలాడెడు- తెగ జారెడు కురుల్
మగువలమనంబుల్ కట్టి- తెగించుచుఁగా॥ తెలు॥
మదనుతూపులన- పొదలెడు ఓరచూపుల్
సుదతులహృదయములన్- విదళించున్॥ తెలు॥

హిందుస్థానీకాఫీ—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి—౧౪ ఊరకయుండినచో ఏమో?
కోరిన వరుఁడు చే- కూరకున్న॥ ఊర॥

కళా— అందఱుఁ ఇటు చేయునా రే?
సుందరీ! లోకము- శూన్యము కాదే॥ అంద॥

యామి— అందఱిమాట నా- కరయఁగ పనియేమి? నా
డెందము వచ్చిన- చందమొనర్తు॥ ఊర॥

కళా— లోకులతో పాటు- నీకును చేయతగుఁ
గాకొండు విధమును- గా చేయతగునె?॥ అంద॥

యామి— ఎవ్వరికర్మమున- కెవ్వారు కర్తలు?
ఎవ్వరి కేమి నే- నిటులొనర్చిన?॥ ఊర॥

కళా— ఎల్లరకున్ పని- యేమియు లేకున్న
తల్లిదండ్రులైన- తల్లడిల్లరే॥ అంద॥

యామి— వారుమాత్రము వి- చారించు టెందుకు?
నేరహిని సౌఖ్య- నీరధిఁ తేల॥ ఊర॥

కళా— ఏమీ? సౌఖ్య- మెటులభించును?
కోమలి! పెండ్లియే- కుదరకయున్న॥ అంద॥

యామి— దున్నవంటివాని- తో ఉండుటకంటె
కన్నెగా ఉంట సౌ- ఖ్యంబగుఁగాదె?॥ ఊర॥

కళా— చాలి! ఇంక నీవాడు- పలుకులకు మాఱు
పలుకఁ జాలను? - ఎట్టులు కాఁగలదో!॥ అంద॥

కమాచి—రూపకము.

కళా— ౧౫ లతాంతనితాంతభూజ- లతావితానమై
ప్రతీతవాతపోతవి- ఖ్యాతమహా!॥ లతా॥
యామి— ప్రభాతసరోజమిత్ర- ప్రభాన్వితంబై
విభావరీఘనాంధకార- విరహితమై॥ ప్రభా॥
కళా— విచ్చినపూలతేనె- విచ్చలవిడిగ అళుల్
హెచ్చుగా కోరికదమ- మెచ్చి పాడుచున్నవి॥ లతా॥
యామి— కోకిల మావిచిగురు- టాకుల మెక్కి సొక్కి
కాకలీధ్వనులతో- ఆకసంబు నింపు॥ ప్రభా॥
కళా— దొండపండు వన- తుండమునన్ కొట్టి
పండువు గాఁగ తిని- మెండు పలుకున్ చిలుక॥ లతా॥
యామి— అచ్చపుముత్యాల- మచ్చున మంచుబొట్లు
పచ్చికా ఆకులపై- ముచ్చటచేయునే॥ ప్రభా॥
కళా— ముదురుమొగ్గలు మరు- వదనుబాకులవలె
పొదలపై అంతట- పొదలుచున్నవి॥ లతా॥
యామి— అపునవినాకుఁగ చిత్త- భవునిబాకులవలె
అవుచున్నవిప్పుడో- ఊవిదమిన్నలార!॥ ప్రభా॥

కమాచి—రూపకము.

యామి— ౧౬ కనుఁగొంటినే నిజముగనే
మనసిజనిభుఁడ- యినఅతని॥ కను॥
కళా— ఎప్పుడెచటన్ కనుఁగొంటివే
అప్పురుషుని- చెప్పుము సకియారో!॥ ఎప్పు॥
యామి— ఇప్పుడే ఒకక్షణముక్రిందనే- యిచ్చట అతని కనినదాన
కపటపువిధి- కాంతు బాపెనే॥ కను॥
కళా— ఏమి? ఇప్పుడిచట కాంచి- తేని యింతలోన ఆపురుషుఁ
డేమైనాఁడని- అనియెదో చెప్పుము॥ ఎప్పు॥
యామి— ఏమిచెప్పుదాననే? నోటి- యెదుటిముద్ద తన్నినటులవిధి
నామనోహరు బాపి- నాఁడకటకటా!॥ కను॥

కళా— అట్లయైన; ఇప్పుడేపోయి- అతని వెదకెదము నీవీ
పట్టుననే యుండుము మేము- వచ్చుదాఁక॥ ఎప్పు॥

కాఫీ—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౭ ఎటులాతఁడు లభించునో॥ ఎటు॥
పటుతరమన్మథ- వ్యథ పాయఁగ॥ ఎటు॥
మదనసమానుఁ- డెద డాఁగిలించి
కదియఁగ వచ్చి చనెనే- కఠినుఁడై॥ ఎటు॥
ఇఁక ఇప్పుడైన- ఈవనమందున
సకియలకంటఁ బడునో- అకట! లేదో!॥ ఎటు॥
దురదృష్టదేవత- శిరమునఎక్కి
కరమునటించుచో నా- వరుఁడబ్బునే?॥ ఎటు॥

కాఫీ—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౮ అటులనెదేమే? సఖి!- అటులనెదేమే? చెప్పవేగ మే॥ అటు॥
కళా— ఎటుచూచినఁగాని- యేజాడలేదే, సఖీమణిరో!॥ ఎటు॥
యామి— కటికవిధికింకఁ- గాసంతసమైన, అ
క్కటికము నాపైని- కలుగదాయెనే- గతియేమొకో॥ అటు॥
కళా— చటుకున నీకోర్కె- సఫలము చేయఁగ
కటకట! మాకుశ- క్యంబుకాదయ్యె- కలికిమిన్న॥ ఎటు॥
యామి— నాకర్మమిట్లా- నర్చుచున్నప్పుడు
మీకుమఱొకటి- యేకతమునను- మేకొనదగు॥ అటు॥
కళా— పనివచ్చునప్పుడు- పనికిరాకుండిన
అనుఁగుసఖులమని- అనుకొనుటకా? వనితామణీ!॥ ఎటు॥

బేహాగు—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౧౯ కనుమూయఁబడదెన్ని- కడగండ్లు పడినను॥ కను॥
సునిశితశరముల- మనసిజుఁడేయునే॥ కను॥
పుండరీకారి- చండకిరణములు
మండుసూదులవలె- వేండ్రము చేయునే॥ కను॥

సలసల కాఁగునూనె- పడినరీతిని నా
రెయొడలు మన్మథాగ్నిన్- ఉడుకుచున్నదే॥ కను॥
పాలలో పడినట్టి- బల్లిపోలిక నేఁ
గాలినిపడి కడు- గాసి పొందుదునే॥ కను॥

ఫరజు——ఆదితాళము.

యామి—— ౨౦ నీచరిత్రం బతిచిత్రము మార!॥ నీచ॥
వాచాగోచర- మేచందమున కన॥ నీచ॥
మెత్తనిపువ్వుల- మొత్తములు వాఁడి
కత్తులవలె మేను- హత్తుకొను; అయ్యో॥ నీచ॥
చల్లనిపన్నీరు- చల్ల, కాఁగునూనె
చల్లినరీతి మయి- పెల్లుగఁ పొక్కెడు॥ నీచ॥
సురుచిరగంధము- కరఁగినలోహము
కరణిశరీరము- కరము కాలఁజేయు॥ నీచ॥

జంఝూటి——ఆదితాళము.

బిల్హ—— ౨౧ చా! చా! ఇదియేమి తలఁపు?
నీచము మదిఁ దలఁచుట- నింద్యము నోటననుట॥ చా॥
ఊరకయుండిన, ఆ- దారినే పోవును మతి
త్వరతతో మతియొక- దారికి త్రిప్పవలయు॥ చా॥
విడివడినగుఱ్ఱముగతి- ఎడఁదయు నాయెం
చెడుతొలియెడకే- కడువడిఁ పరుగిడు॥ చా॥

శంకరాభరణము—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి—— ౨౨ కృతార్థనైతిని గదా! ఆహా! నే॥ కృతా॥
ఇతని డెంపము నామీఁదనే- ఎనయుటన్॥ కృతా॥
మదనుఁడు నాపై- మది పగగత్తేఁ
ఒదవించునని వగచున్॥ కృతా॥
తనగుణసంపద- కనఁజేసి నేనే
తనువలవఁగ కోరున్॥ కృతా॥

చూత మెటులైన- శుభమే; ప్రధాన
చేతస్సిటు చిక్కెఁగా॥ కృతా॥

హిందుస్థానీభైరవి- చాపు. (త్ర్యశ్రగతి.)

యామి— ౨౩ ఇఁక ఏమి సాధనం- బేమియు తోఁచదే;
అకటా! నాఆశ ని- రాశ అయ్యెఁగదా॥ ఇఁక॥
ఇత్తఱి గట్టి యెత్తెత్తుకన్న
చిత్తజుఁడు నన్ను- బొత్తిగ నిలనీఁడు॥ ఇఁక॥
శేలని అందునా?- కాలాహి అందునా?
పోలవివి; మఱి- యేలాగొనర్తును?॥ ఇఁక॥
(ఆలోచించి) సరిసరి; నన్నుఁ బి- శాచముపట్టి
ఊరవడిఁ బీడించు చున్నట్లుఅయెఁ॥ ఇఁక॥

సింధుకమాచి—ఏకతాళము. (చతురశ్రగతి.)

యామి— ౨౪ అన్యాయమె లేదా?- ఆహా! నీమోడ॥ అన్యా॥
కన్యానూతన- కమలతనయా!॥ అన్యా॥
బిల్హ— కన్యామణి! ఏమి- కరణిన నెదు?॥ కన్యా॥
అన్యాయమే మో- అరసి చెప్పుమా॥ కన్యా॥
యామి— నిన్నటిరాతిరి- నన్ను నీవెలమిని
కోరి్న్నవిల్తు నూర్చి- చాల- మన్నింపలేదా?॥ అన్యా॥
బిల్హ— అనుచితపుమాట- లాడుట తగునా?
నినునేఁ కనుంగొన- నైన- కనుఁగొంటినా?॥ కన్యా॥
యామి— నేఁడుదయంబున- నీవువనంబున
చూడఁగ రాలేదా- నన్ను?- సుమశరాభ!॥ అన్యా॥
బిల్హ— వనమునకుఁ నేను- చనుదెంచుట నిజము;
నిను కనుటకు మాత్రము- కాదు- నను నమ్ముము॥ కన్యా॥
యామి— అప్పటిసంగతి- అక్కఱలేదు నీ
విప్పుడు నను కావ- రావా?- మెప్పులాఁడా!॥ అన్యా॥
బిల్హ— ఇప్పుడు నినుకావఁ- ఏతెంచుటయే
తప్పనియెదవా?- ఏమి?- చెప్పుమా వేగ॥ కన్యా॥

సింధుకమాచి - రూపకము.

యామి— ౨౫ నన్ను కావుమా- కరుణ- నన్ను కావుమా
కొన్నవిల్తు బారినుండి॥ నన్ను॥

బిల్హ— ఇటుల వల్కఁగా- తగునా?- ఇటులవల్కఁగా
కటకట! గురువని యెంచక॥ ఇటు॥

యామి— ఏల నన్ను వేఁపఁగ?- చాలు నాపై ఁ వగ;
జాలిపుట్టదా? దేవ! లీలలఁ- కాలమెల్ల కడచునగుణ్యా!॥ న॥

బిల్హ— ఏమి? నన్ను దివ్యఁగా- ఎంచుచున్నదానవా
యేమి? కానుసూ; నమ్ము- భూమిసురుఁడ; నీగురుఁడ॥ ఇటు॥

యామి— నిక్కముగను చెప్పుమా- నీవు నా గురుండవా?
చక్కఁదనముఁబట్టి, చూడఁగా- ఒక్కదివ్యుఁడ వనుకొంటి॥ న॥

బిల్హ— కానుగా నేనమరుఁడఁ- కాను; నీదుగురుఁడఁ
గాని యెందుకిటుల, చానరో!- మానరాని భ్రమపొందితి॥ ఇ॥

బేహాగు- ఏకతాళము. (చతురశ్రగతి.)

బిల్హ— ౨౬ న్యాయమా యిట్టిమాట లాడుట
కాయజునకు చిక్కి వివే- కము విడిచెదవు॥ న్యాయ॥
గురువుననుచున్ మదిన్- కొంచెమెంచక మనో
హరుఁడననుచు పలుకన్- ఆరంభించితివి॥ న్యాయ॥
ఎవ్వరైనన్ వినినన్- ఏమనియెదరో
జవ్వని! చాలు; ఇఁక- చాలు నోరుమూయుము॥ న్యాయ॥

కమాచి - ఆదితాళము.

యామి— ౨౭ మొదట నా స్థితి విను- పిదప నిందింపుము॥ మొద॥
మదనునికిన్ చిక్కి- మాత్రమిటు చేయ;
విదితధర్మము- విడువఁగ వెఱ్ఱినే॥ మొద॥

బిల్హ— అదియేమొ తెలుపుమా- ఆలించువాఁడఁ॥ అది॥
సుదతి! నీవలు కేల- శోధింపరాదు?
తుద ముట్టనీస్థితి- వదల నెఱిఁగింపు॥ అది॥

W

# బిల్హణీయము.

యామి—— కలగని నంతనే- వలచి నిన్ భర్తఁగా
తలఁచితి గురువను- తలఁపే లేకయే॥ మొద॥

బిల్హ—— తెలియనపుడటు- తలఁచుట సరి కాని
తెలిసినపుడటు- తలఁచుట తగునా?॥ అది॥

యామి—— మనసున ఒక్కనిన్- పెనిమిటిగా కొని
వెనుక మఱొక్కనిన్- ఎనయుట తగునా?॥ మొద॥

బిల్హ—— తగదనుట నిజ- మగుఁగాని గురుని
మగనిఁగ కోరుట- తగునా? మగువరో!॥ అది॥

యామి—— పోనిమ్ము తగకున్న- పోనిమ్ము; దీనన్
పోనేమి! ప్రాణము- పోవునుగాని॥ మొద॥

నవరోజు——ఏకతాళము. (త్ర్యశ్రగతి.)

బిల్హ—— ౧౮ కోపమా నాపై?- రూపనవమదనసతీ!
ఆఁపరాని స్మరబాధకు- ఓపఁజాల; అమృతమీవే;
రాపొనర్చితేని- ప్రాణమాఁగదుసూ॥ కోప॥

యామి—— తొందరెందుకు?- సుందరీజనరతీపతీ!
విందుగను మావారు మన- పొందున కియ్యకొను దాఁక
డెందము కొంచెము- మందలింప తగు॥ తొంద॥

బిల్హ—— మీతండ్రిదీనిన్- ప్రీతింగోడ ఒప్పుకొనునే?
నాతిమిన్న! అటులైనన్- ఈతీరేల చేయు మొదట?
నీతిగ సలుపున్ పనికేల జడుపు?॥ కోప॥

యామి—— ప్రీతిదీనికి- నాతల్లిదండ్రు లొప్పకున్నన్
ఏతీరునను మనపెండ్లి- నీతియుక్తమైనదగును?
చేతస్సు సంశయమందు; తెలుపుము॥ తొంద॥

ఫరజు——ఆదితాళము.

బిల్హ—— ౧౯ మానిని! తాళఁగఁజాల- సూనశరునిబాణవేదనయిఁక॥ మా॥
చక్కెర వెక్కిరించు- చక్కని కెమ్మోవి
నొక్కను సుధారసము- గ్రక్కున ఆనక॥ మాని॥

పూలగుత్తులతో- పొల్పగునట్టితీఁగె
పోలుమేను మేనఁగ- కీలింపకున్నను॥ మాని॥

హిందుస్థానీభైరవి—ఏకతాళము. (చతురశ్రగతి)

కళా— ౩౦ మానుమ నీమది భయమిఁక;
చాన! దాసీతతి- సలుపఁగలదేమి?॥ మాను॥
చతు— ఏమి నీకింత నిబ్బరము?
నామది వగపాయ- నమ్మ చెప్పవేగ॥ ఏమి॥
కళా— ఇంతిరహస్యము మన- యిరువురికిఁగా
కింత యితరుల- కెఱుఁగ రాదుగద॥ మాను॥
చతు— ఇదియేన; ఇంకమ- ఱేమైన కలదా?
ముదమొదవఁగ వేగఁగ- ముదితా! తెలుపవే॥ ఏమి॥
కళా— తొలుతన్ భవాని- చెలికలఁగ ఈతఁడే
చెలువుఁడగునంచు- తెలుపుటయెఱుఁగవె?॥ మాను॥
చతు— అవునవును; మనచెలి- అట్టులే చెప్పినది;
భవానిదయకల్గ- వగవనేల యింక?॥ ఏమి॥

సింధుకమాచి - త్రిపుట.

యామి— ౩౧ ప్రాణేశుఁడెట- వసియించునో
ప్రాణములటవిడుతు- త్వరగా నడు॥ ప్రాణే॥
కళా— సఖియ! దగ్గఱకున్- చనుదెంచితిమి;
అకటా! నీవిటుల- అడలకుమా॥ సఖి॥
యామి— అడలకుమంచున్- నుడివెదవయ్యో!
ఒడలిజీవములు- విడువవుగా॥ ప్రాణే॥
కళా— మానిని! ధైర్యము- పూనకెటుల
మానరానివగ- మ్రగ్గగన్ చనునా?॥ సఖి॥

ఖరహరప్రియ - ఆదితాళము.

యామి— ౩౨ ఎంతదుస్థితి సంభవించెనో-
కాంత! నీకునాకారణంబున!॥ ఎంత॥

బిల్హ— నీకారణంబున ఏమియు కాదు-
నాకర్మమునంగాని సతీ!॥ నీకా॥

యామి— నిర్భాగ్యురాల- నిన్నిప్పుడిట్టి-
దుర్భరకష్టాబ్ధిఁ- త్రోసితినయ్యో!॥ ఎంత॥

బిల్హ— చెలువ! నన్నుఁగూర్చి- చింతింపకుండు;
ఖలుఁడ నేనె నీకష్ట- కారణమ్మైతి॥ నీకా॥

యామి— హా! నిన్నుఁబాసి- ప్రాణంబుతో
నేనుండఁజాల- హృదయేశ్వరా!॥ ఎంత॥

బిల్హ— అయ్యో! నీవిటు- లధైర్యపడకు;
నెయ్యము మఱచి- నెమ్మినుండుము॥ నీకా॥

పీలువా - చాపు. (త్ర్యశ్రగతి.)

యామి— ౩౩ ఏవారిపై నలుగ- ఏమిలాభము?
దైవవిధి దాఁటఁగా- తరమే?॥ ఏవా॥
మును చేసికొన్నది- అనుభవింపక
చనునే ఊరక- శర్వానికైన?॥ ఏవా॥
నిను చూడఁగల్గు- దనుక నీచెంత
కనిపెట్టుకొనియుండు- వెనుకటిపనియేల?॥ ఏవా॥

కమాచి—(త్ర్యశ్రగతి.)

కళా— ౩౪ జనపతిని వేఁడినచో- కనికరించుఁగా;
కనుక మనమాయన- కడకేగుదము॥ జన॥

యామి— ఆయన కడకేగుట- న్యాయమె నాకు?
నాయందలి ప్రేమ- పాయఁజేసెఁగదే॥ ఆయ॥

కళా— వసుధాపతి నిన్- ప్రాణంబనుచో
విసుగు చెందియిటు- విడుచుట తగునా?॥ జన॥

యామి— నను తనప్రాణం- బని తలఁచిన నా
మనోహరుని ఈ- మాడ్కిన్ చేయునే॥ ఆయ॥

కళా— ప్రమాద మేరికిన్- వచ్చును ఒకచో
సుమాంగి! ఆయనన్- మాతము; రమ్ము॥ జన॥

యామి—— నాపతి మేలు- నకు కావున ఆ
భూపతిఁ కనుఁగొనఁగ- పోవఁగ వలయుఁగా॥ ఆయ॥

సింధుకమాచి—చాపు.

యామి—— ౩౫ అనుజ్ఞ యిమ్మా- అరిగి వత్తుఁగా
మనోహర! నేను- కనిమిషమునఁగా;
జనపతితో- మనచరిత
వినిపించి- వేఁడుకొనెద॥ అను॥

విల్లా—— సరియే; పొమ్మా;- తరుణీ! ఏమి
జరిగెనేని- తిరిగి రమ్మా;
ధరావిభుతో- తగవు వలదు;
జరగినది- సరిగ చెప్పు॥ సరి॥

యామి—— ప్రాణేశ్వరా!- అటులే ఒనర్తున్;
లేనిపోని- వాని పనియేమి?
భూనాథుతో- పోరు లాభమే?
ప్రాణదానము- ప్రార్థించెదఁగా॥ అను॥

విల్లా—— అన్నులమిన్నా!- అరయ ధర్మముల్
అన్ని యెఱుంగుదు;- అయిన చెప్పితి;
క్రన్నన విభుకడ- కు న్నీవు చని
మన్ననకని యిట- ఉన్నట్లు రా॥ సరి॥

యదుకులకాంభోది—ఆదితాళము.

వసు—— ౩౬ ఇంతతొందరపని- యెంతైన తగునా?
స్వాంతమునన్ బాగుగఁగా- చింతింప వలదా?॥ ఇంత॥
ఆయనమీఁద దోష- మావంతయును లేదు;
న్యాయము కాదు వధ- న్యాయము కాదు॥ ఇంత॥
అతనికై కాకున్న- యామినికైనైన
అతని మన్నింప- అర్హము కాదా?॥ ఇంత॥

X

అకట! కూఁతునిటు- లాడుట ధర్మమా?
ఒకవేళ తప్పేదో- ఒనరినన్ గాని॥ ఇంత॥

కాఫీ—ఆదితాళము.

యామి— ౩౭ పతిభిక్ష పెట్టుమా- పార్థివచంద్రా!
సుతవత్సలత నీకు- సుంతైన ఉన్న॥ పతి॥
హా! దైవమా! నాదు- ప్రాణంబు పోదుగా
ఈదయావిరహిత- మౌనావమానమున;
పోదము సఖి! ఇంక- పోవుదము పద;
నాదయితుతోడిదే- నాదులోకము॥ పతి॥

వసు— అకటా! మూర్ఛ- నందినది సుత;
ఇఁక ముందేమగునో- ఎఱుఁగ అయ్యయ్యో!॥ అక॥

కళా— అన్నన్న! రాజుల- అన్యాయమిటుల
ఉన్నది; ఏమని- యెన్నఁగవచ్చును?॥ అన్న॥

వసు— భూమీశ! ఇప్పుడు- ముదము నీకైనదా?
నీముద్దుపట్టినిటు- నిర్విణ్ణఁ జేసితి;
నోము లెన్నోనోచి- యీమెను కన్నది
యీమాడ్కిఁ జేయుట- కే కాఁబోలును॥ అక॥

కళా— పురుషులు తమరెన్ని- పోకడలు పోయిన
పరమధర్మమని- పాటించువారలు;
తరుణులె అయినను- తగవు విడువక
జరిపిన అది యింత- సరిగాదందురు॥ అన్న॥

అఠాణా—ఏకతాళము. (చతురశ్రగతి.)

మద— ౩౮ ఏమే! పతిభిక్ష- మిడవలెనే?
ఛీ! మాటలాడఁగ- సిగ్గైన లేదఁటే?॥ ఏమే॥
కామాంధతన్ కోరఁ- గారానియిట్టి
కామితంబు అడుగఁ- గా తెగించితివే॥ ఏమే॥

స్త్రీలమాయ లెఱుఁగరా- పోల దేరికైన;
ఈలీలను 'వీ- రెంచి చేసిరో!
బాల యీరీతిని- పడి మూర్ఛ చెందినది;
ఏలొకో తెలియఁ- జాల కన్నవాఁడ॥ ఏమో॥

తోడి—ఆదితాళము.

వసు— ౩౯ ఏమిది పుత్రికరా- ఇటులొనరింతు రే?
భూమీశ! ఎవరైన- భూమిమీఁద॥ ఏమి॥

యామి— పోమెద; నాకయి- పొగులకు జననిరో!
నాయదృష్టమింతే- నను తలఁపకు॥ పో॥

వసు— ఎందుకు పుట్టితివి- ఇంతి! నాకడుపున?
మందభాగ్యురాల; నిను- మనుపఁ జాల॥ ఎందు॥

యామి— భూపతి నాపై దయ- చూపలేదని
కోపగింపకు; ఇదంత- నాపాపమే॥ పో॥

వసు— ఏరిపయి కోప- మెందుకు? నేను నీ
చెరువ నుండక- జీవింతునా?॥ ఎందు॥

కన్నడ- ఏకతాళము. (చతురశ్రగతి.)

మద— ౪౦ ఇరువురినికూడ దండింతున్- దురితమును క్షమింపరా॥ ఇరు॥

కళా— దండింపఁగలుగుదుపుగాని- ధర్మం మాత్రము కాదు॥ దండి॥

మద— స్మరతంత్రమునకు లోఁబడినారు- పరువుతీసినారు॥ ఇరు॥

కళా— దండధరుఁడు మీఁగను ఉన్నాఁడు- దండింపంగలవాఁడు॥దం॥

జంఝూటి- ఏకతాళము. (చతురశ్రగతి.)

బిల్హ— ౪౧ అయ్యో! ఎంత కష్టమువచ్చెరా- ప్రాణేశ్వరికిరా;
దయ్యము తలవ్రాఁత- తప్పింపఏరికి
ఎయ్యెడ తరమగునె- యింతయైన?॥ అయ్యో॥
నాకై యేమియును చింతింప;- నామనోహారిణిరా
సాకతమున కావు;- సంస్తవ మొనరింతు;

లోకేశ్వర! భక్త- లోల! పరాత్పరా!॥ అమ్మో॥
ఆగర్భశ్రీమంతురాలయిన- అట్టి అతివమిన్న
భూగృహమున పడి- పొరలవలసివచ్చె;
ఈగతి తప్పింప- వే సర్వేశ్వరా!॥ అమ్మో॥

సహన - త్రిశ్రగతి చాపు.

బిల్హ— ౮౨ కావవేయిప్పుడు- కరుణతో దేవ
దేవా! నినువేఁడెద- దీనరక్షకా!॥ కావ॥
నాయెడ అపరాధము- న్నదో లేదో
నీయెదకే తెలియు- నిఖిలాంతర్యామి!॥ కావ॥
లేనిపోనినింద- పైని మోపి నన్ను
భూనాథుఁడు చలప- పూనియున్నాఁడు;
నాకు అభయమిచ్చి- సాకతమున కావ
నీకంటె మఱియెవ్వ- రేకడనున్నారు?॥ కావ॥

హిందుస్థానీ భైరవి- చాపు.

యామి— ౮౩ పోదే నాథా! నన్నున్నావసి-
నాదుధనమా! నాప్రాణమా॥ పోదే॥
బిల్హ— ఎటువచ్చి తింతిమిన్నా!-
ఇటకు భూమిగృహమునుండి?॥ ఎటు॥
యామి— దైవకృపవల్ల మరల-
జీవములతో నిన్నుకంటి॥ పోదే॥
బిల్హ— పటుతరాద్భుతం బయ్యెడు-
చటుకున అంతయు చెప్పుమా॥ ఎటు॥
యామి— అతిఖిన్నతఁ అంబికఁ కడు- స్తుతులొనర్ప చోద్యముగను
జతతలుపులు సరిగవిడఁ- అతి త్వరితగతివచ్చితి॥ పోదే॥

సింధుకమాచి — ఆదితాళము.

బిల్హ— ౮౪ } నిను నుతియింప- నేర్తుమె? తల్లీ!
యామి — } ఘనభక్తజన- కల్పవల్లీ!॥ నిను॥

దురితాత్ములమని- దూషింపఁబడి
మరణమొందునెడ- మనిచితివహాహా!॥ నిను॥
లోకపునిందకు- లోఁబడకుండ,
ప్రాకటసౌఖ్యములు- పడయఁగ చేసితి॥ నిను॥
సురనుతచరణా!- సుగుణాభరణా!
హరమనోహారిణీ!- ఆర్యా! భవానీ!॥ నిను॥

## మంగళహారతి.

అమీరుకల్యాణి—రూపకము.

౮౫ మంగళమిదే- మంగళప్రదా!
సంగీతలోలా!- సర్వలోకేశా!॥ మంగ॥
రంగుగ నిన్నంత- రంగమునందున
సంగతము చేసి- స్తవము లొనర్తుము॥ మంగ॥
దేవదేవ! నీకుతగిన- సేవచేయ నిన్ను పొగడ
చేవలేదు మాకు- కావునను దయ- కావఁగ వలయు॥ మంగ॥
సారకీర్తి- సరసకలార్థి- సమాజపాల!
మా॥ రామచంద్ర- చారుసంస్తవ- వారముదితాత్మ! మంగ॥

సంపూర్ణము.

# హితకారిణీ గ్రంథమాల.

సంపాదకుడు, ఇ. యజ్ఞనారాయణ.

**ఉద్దేశము:—**

1. అందరికిని సులభముగా బోధపడు చక్కనిశైలిని నాటకములు, ప్రహసనములు, నవలలు, కథలు మొదలగు గ్రంథములను నీతిబోధకముగ వ్రాసి ప్రచురించి జనసామాన్యమునకు చదువునం దభిరుచి పుట్టించుట.

2. ఇందుమూలమున వచ్చినలాభము అస్థులగు అంగహీనులకు అన్నవస్త్రములక్రిందను, బీదబాలురబడిజీతములక్రిందను, ఆర్యమతాభివృద్ధికిని, నిమ్నజాత్యుద్ధరణమునకును వలయుపనులక్రిందను వినియోగించుట.

పుస్తకములవెల సం॥రమునకు రు 0-8-0 లకు మించదు.

సంవత్సరమునకు మూడుపుస్తకములకు తక్కువ కాకుండ ప్రచురింపఁబడును. ప్రవేశపురుసుము (ఒకఅణామాత్రమే). ఇది సంవత్సరపుచందా ముందిచ్చువారీయనక్కఱలేదు. ఈసొమ్ము ధర్మార్థముపయోగింపఁ బడును.

వెలువడినపుస్తకములు:—అపూర్వనాగరికత.

అపూర్వప్రహసనము. హాస్యరసప్రధానము. నవనాగరికతమూలమున వచ్చిన కొన్ని దురాచారములు మిక్కిలి యుక్తియుక్తముగా వెలిపుచ్చఁబడినవి. కథాకల్పన అతిమనోహరము. మొదటిభాగము ప్రచురించినవెనుక తక్కినభాగముల నెంతత్వరలో పూర్తిచేసి పంపుదురని మాచందాదారులంపినయుత్తరములకుప్పలే దీనిగొప్పను వేనోళ్ల వెల్లడచేయుచున్నవి.

| | చందాదారులకు. | ఇతరులకు. |
|---|---|---|
| మొదటిభాగము. | 0—2—0. | 0—3—0. |
| రెండు మూడుభాగములు | 0—4—0. | 0—6—0. |

*N. B.* మాచందాదారులకుపంపు పుస్తకముల పోస్టేజీ మేమే భరింతుము.

మా గ్రంథమాలవిషయమయి యింక నేమైనఁ గోరువారీక్రింది చిరునామాకు వ్రాయఁ బ్రార్థితులు.

కార్యదర్శి,
హితకారిణీ గ్రంథమాల,
విశాఖపట్టణము.

ప్రతులు తక్కువ! త్వరపడుఁడు!!

# శ్రీకలాభిలాషక కావ్యమాలిక.

ఇందు, భాషాభివృద్ధికి సాధనములగు కావ్యనాటకాదులు, నవలలు, నిఘంటువ్యాకరణాదులు, శాస్త్రచరిత్రాదులు, ప్రకటితములగును.

## చందాదారులు.

సంవత్సరమునకు రు 3-0-0 లకు మించని వెలగల యుండరి పుస్తకములు కొనఁ నొప్పుకొనువారు చందాదారులు. పుస్తకములు పంపినపుడు వెలయిచ్చి పుచ్చుకొనుటయేకాని, ముందే చందా యియ్యనక్కఱలేదు. ప్రవేశరుసుము రు 0-4-0. ఇది దరఖాస్తుతో పంపవలెను.

## శాశ్వతపుచందాదారులు.

ఒక్కసారియే రు 25-0-0 ఇచ్చువారు శాశ్వతపుచందాదారులు.

## చందాదారులకులాభము.

(1) పైవారికి రు 1-0-0 కు ఇచ్చు పుస్తకములు చందాదారులకు రు 0-12-0 లకే యిచ్చెదము. (2) చందాదారులు వీ. పీ. ఖర్చు పెట్టుకొన నక్కఱలేదు.

## నిత్యపోషకులు; నిత్యసహాయకులు.

రు ౧౦౦ లకు తక్కువకాని ధనసాహాయ్యము చేయువారు నిత్యపోషకులు. రు ౫౦ లకు తక్కువకాని ధనసాహాయ్యము చేయువారు నిత్యసహాయకులు. వీరికి మా కావ్యమాలికా పుస్తకములన్నియు నిచ్చుచు వీరిపేళ్లు ప్రతిపుస్తకమందును ప్రచురపఱతుము.

రాజపోషకుల యాదరణము వారిదయాధీనము.

## పోషకులు; సహాయకులు.

సంవత్సరమునకు రు ౧౦ ల చందా యిచ్చువారు పోషకులు; రు ౫ ల చందా యిచ్చువారు సహాయకులు. ఈచందా ముందే యియ్యవలయును.

## ఏజెంట్లు.

చందాదారులు మొదలగు వారిని చేర్చుటకు ఏజెంట్లు కావలయును. వీ.పీ.గా మాపుస్తకములు తెప్పించుకొను ఏజెంట్లకు నూటికి రు 25 చొ॥ కమీషను ఇచ్చెదము. కాఁబట్టి మా కావ్యమాలికకు ఏజెంట్లుగానుండి పనిచేయఁగోరువారును చందాదారులు కాఁదలఁచువారును నాపేర దరఖాస్తులు పంపవలెను.

విశాఖపట్టణము, 1913 స॥

మారేపల్లి రామచంద్రశాస్త్రి,
శ్రీకలాభిలాషక సభాధిపతి